బుధవారం 11•12•2019
కరీంనగర్
మన రాష్ట్రం • మన పత్రిక

నమస్తే తెలంగాణ

• వెల. రూ. 6.50 • సంపుటి 9 • సంచిక 166 • పేజీలు : 14 + 16 + 8 పేజీల నిపుణ ప్రత్యేక అనుబంధం

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD

పీఎస్ఎల్వీ ప్రయోగం విజయవంతం కావాలని తిరుమల శ్రీవారిని దర్శించుకొన్న ఇస్రో చైర్మన్ శివన్

నేడే నింగిలోకి పీఎస్ఎల్వీ సీ-48

సాయంత్రం 3.25కి
రీశాట్-2బీఆర్1 ప్రయోగం
మరో చారిత్రక మైలురాయికి చేరువైన ఇస్రో
ఇది పీఎస్ఎల్వీ 50వ మిషన్
శ్రీహరికోట నుంచి 75వ ప్రయోగం

5

నేడు రాష్ట్ర క్యాబినెట్ భేటీ

- దుమ్ముగూడెం బరాజ్‌కు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వనున్న మంత్రివర్గం!
- కాళేశ్వరం నుంచి మూడో టీఎంసీకి కూడా..
- ఆర్థిక పరిస్థితి, ఆర్టీసీ, మున్సిపోల్స్‌పైనా చర్చ!

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర మంత్రివర్గ సమావేశం బుధవారం సాయంత్రం ఐదు గంటలకు ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు అధ్యక్షతన జరుగనున్నది. సాగునీటిరంగంలో అతి ముఖ్యమైన దుమ్ముగూడెం బరాజ్ నిర్మాణంతోపాటు తెలంగాణ గుండెకాయ కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి మూడో టీఎంసీ నీటి తరలింపు తదితర అంశాలపై మంత్రివర్గం సవివరంగా చర్చించి నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నది. దీనితోపాటు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై సమగ్రంగా చర్చిస్తారని తెలిసింది. ఆర్థికమాంద్యం ప్రభావం దేశంపై లేదని చెప్తున్న కేంద్ర ప్రభుత్వం.. రాష్ట్రానికి రావాల్సిన నిధులను సరిగ్గా ఇవ్వడంలేదు. ఈ ఆర్థిక సంవత్సరంలో పన్నుల్లో రాష్ట్ర వాటా ఇప్పటి వరకు గతేడాదికంటే 2.13% తక్కువ ఇచ్చింది. వాస్తవంగా గత ఏడాదికంటే అదనంగా 6.2% రావాల్సిఉండగా మైనస్‌లోకి వెళ్లింది. దీంతో రావాల్సిన 8.3%కంటే.. తక్కువ వాటా నిధులు తెలంగాణకు వచ్చాయి. ఈ విషయంపై

మిగతా 6వ పేజీలో

• సిరిసిల్లకు గోదారమ్మ సిరులు

బ్యాక్‌వాటర్‌తో పాపికొండలను తలపిస్తున్న సిరిసిల్ల శివారు

7

అపరభగీరథుడు సీఎం కేసీఆర్ సంకల్పబలంతో గోదావరి మేడిగడ్డ నుంచి బరాజ్‌లు, పంప్‌హౌస్‌లు దాటుకుంటూ శ్రీరాజరాజేశ్వర (మధ్యమానేరు) జలాశయాన్ని నిండుకుండలా మార్చి, మానేరు వాగు మీదుగా ఎదురెక్కింది. మేడిగడ్డ నుంచి 172 కిలోమీటర్ల దూరంలో మెట్ట ప్రాంతమైన రాజన్న సిరిసిల్ల జిల్లాను ముద్దాడింది. సముద్రమట్టానికి దాదాపుగా 1,250 అడుగుల ఎత్తులో ఉన్న ఈ ప్రాంతానికి గోదావరి జలాలు రావడం చరిత్రను తిరగరాసినట్లయింది. మరోవైపు కాళేశ్వరం జలాల రాకతో శ్రీరాజరాజేశ్వర జలాశయం జలకళను సంతరించుకొన్నది. నంది, గాయత్రి పంప్‌హౌస్‌ల మీదుగా గోదావరి తరలి వస్తుండడంతో నీటిమట్టం క్రమంగా పెరుగుతున్నది. ప్రాజెక్టు సామర్థ్యం 25.873 టీఎంసీలు కాగా, మంగళవారం సాయంత్రం ఆరు గంటల వరకు 23.109 టీఎంసీలకు చేరింది.

కాళేశ్వరం సూపర్!

గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ కితాబు

- జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో విస్తృత పర్యటన
- లక్ష్మీ పంపుహౌస్, లక్ష్మీ, సరస్వతి బరాజ్‌ల సందర్శన
- బోడగూడెంలో ఆదివాసీలతో ముఖాముఖి

మంగళవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం లక్ష్మీ పంప్‌హౌస్ గ్రావిటీ కెనాల్ వద్ద విజయసంకేతం ఇస్తున్న గవర్నర్ తమిళిసై దంపతులు

జయశంకర్ జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ:

ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు సూపర్ అని రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ కితాబిచ్చారు. గోదావరిలో కాళేశ్వర జలాలను చూసి పులకించిపోయారు. జలాలకు పూజలుచేసి మురిసిపోయారు. గిరిజనులతో మమేకమయ్యారు. గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు బిజీబిజీగా గడిపారు. ముందుగా భూపాలపల్లి పట్టణంలో ఏర్పాటుచేసిన జనరిక్ మందుల దుకాణాన్ని ప్రారంభించారు. అనంతరం కాటారం మండలంలోని బోడగూడెంలో నాయకపోడు, కోయతెగల గిరిజనులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు. తర్వాత కాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయంలో గవర్నర్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం లక్ష్మీ పంపుహౌస్ (కన్నెపల్లి), లక్ష్మీ (మేడిగడ్డ), సరస్వతి (అన్నారం) బరాజ్‌లను సందర్శించారు.

ఓ సోదరిగా మీ అభిమానాన్ని మరువలేను

కాటారం మండలం బోడగూడెంలో నాయకపోడు, కోయతెగలకు చెందిన గిరిజనులతో కలెక్టర్ వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ముఖాముఖి కార్యక్రమంలో గవర్నర్ తమిళిసై పాల్గొని.. ప్రభుత్వ పథకాల అమలుతీరు, లబ్ధిదారుల అనుభవాలు, ప్రగతిపనులపై గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. గిరిజనులు అన్నిరంగాల్లో రాణించాలని, ప్రతి పథకాన్ని అందిపుచ్చుకుంటూనే ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని సూచించారు. గర్భిణులు ఐరన్ మాత్రలు వేసుకోవడం మరిచిపోవద్దని చెప్పారు. అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఆదివాసీ గిరిజనులు చూపిన అభిమానం తనను ఎంతో కదిలించిందని, ఇదే అభిమానంతో బోడగూడెం గిరిజనులను రాజ్‌భవన్‌కు

మిగతా 3వ పేజీలో

గజ్వేల్ జిగేల్

• అభివృద్ధి పండుగ

ప్రారంభోత్సవానికి సిద్ధమైన సిద్దిపేట జిల్లా ములుగులోని ఉద్యాన విశ్వవిద్యాలయం

నేడు గజ్వేల్‌లో పర్యటించనున్న సీఎం కేసీఆర్

- ఉద్యాన వర్సిటీ, ఫారెస్ట్ కాలేజీ, సమీకృత మార్కెట్‌సహా పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవం
- అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, మాతాశిశు సంరక్షణ కేంద్రానికి శంకుస్థాపన
- సీఎం పర్యటన ఏర్పాట్లు పర్యవేక్షించిన మంత్రులు నిరంజన్‌రెడ్డి, హరీశ్‌రావు

గజ్వేల్ / హైదరాబాద్, నమస్తే తెలంగాణ / ప్రత్యేక ప్రతినిధి:

ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్ నియోజకవర్గం అభివృద్ధి పండుగ చేసుకోనున్నది. బుధవారం నియోజకవర్గంలో పర్యటించనున్న సీఎం కేసీఆర్.. పలు ప్రభుత్వ భవనాలకు ప్రారంభోత్సవంతోపాటు శంకుస్థాపనలు చేస్తారు. తొలుత ములుగులో ఆధునిక సౌకర్యాలతో నిర్మించిన కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యాన విశ్వవిద్యాలయం, అటవీ కళాశాలను ప్రారంభిస్తారు. అనంతరం గజ్వేల్‌లో సమీకృత వ్యవసాయ మార్కెట్, ఐవోసీ, మహతి ఆడిటోరియాలను ప్రారంభిస్తారు. రూ.100 కోట్లతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, రూ.32 కోట్లతో మాతాశిశుసంరక్షణ కేంద్రానికి శంకుస్థాపన చేస్తారు. మహతి ఆడిటోరియంలో నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రముఖులతో ముఖ్యమంత్రి కేసీఆర్ సమీక్ష సమావేశం నిర్వహిస్తారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను రాష్ట్ర మంత్రులు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, తన్నీరు హరీశ్‌రావు, వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి పార్థసారథి, ఉద్యాన కమిషనర్ వెంకట్రాంరెడ్డి, అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్

మిగతా 2వ పేజీలో

హెచ్చార్సీకి సైబరాబాద్ పోలీసుల నివేదిక

- దిశ కేసులో సేకరించిన సాంకేతిక, శాస్త్రీయ ఆధారాలు అందజేత
- నాలుగోరోజూ కొనసాగిన విచారణ
- నేడు హెచ్చార్సీ బృందం తిరుగుపయనం
- ఢిల్లీ వెళ్లిన సైబరాబాద్ సీపీ సజ్జనార్

6

ఆ రాత్రి ఏం జరిగింది?

చటాన్‌పల్లి ఎన్‌కౌంటర్‌పై సిట్ దర్యాప్తు ప్రారంభం
ఆపరేషన్ డిసెంబర్ 6పైనే ప్రత్యేక దృష్టి
దిశ ఘటనపై నమోదయిన ఎఫ్ఐఆర్‌ల సేకరణ
అత్యంత గోప్యంగా విచారణ

స్తంభించిన ఈశాన్యం

పౌరసత్వ సవరణ బిల్లుకు నిరసనగా

అసోం, అరుణాచల్, త్రిపుర, నాగాలాండ్, మేఘాలయలో బంద్

- రణరంగంగా మారిన వీధులు
- బిల్లును ఉపసంహరించాలని 600 మందికి పైగా మేధావులు, శాస్త్రవేత్తల లేఖలు
- అమిత్‌షాతోపాటు కీలకనేతలపై ఆంక్షలు విధించాలి
- అమెరికాకు చెందిన యూఎస్‌సీఐఆర్ఎఫ్ సిఫారసు
- నేడు పెద్దల సభకు వివాదాస్పద బిల్లు
- మద్దతుపై జేడీయూలో విభేదాలు
- బిల్లును సవరిస్తేనే సహకరిస్తామన్న శివసేన

పౌరసత్వ సవరణ బిల్లును నిరసిస్తూ ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద బిల్లు ప్రతులను దహనం చేస్తున్న ఆందోళనకారులు

ముస్లిమేతర శరణార్థులకు పౌరసత్వం కల్పించే బిల్లును వ్యతిరేకిస్తూ జరిగిన ఆందోళనలతో ఈశాన్య రాష్ట్రాలు మంగళవారం అట్టుడికిపోయాయి. పలు చోట్ల ఆందోళనకారులకు, పోలీసులకు మధ్య జరిగిన ఘర్షణలతో వీధులు రణరంగాన్ని తలపించాయి. నిరసనకారులు రహదారులను దిగ్బంధించడంతో.. దవాఖానకు వెళ్లే మార్గం లేక రెండు నెలల పసికందు దారిలోనే ప్రాణాలు కోల్పోయింది. బిల్లుకు నిరసనగా ఢిల్లీ, పశ్చిమ బెంగాల్‌లో కూడా ఆందోళనలు జరిగాయి. బిల్లు వివక్షపూరితమని, దేశాన్ని విభజించేదిగా ఉన్నదని పేర్కొంటూ 600మందికి పైగా మేధావులు, శాస్త్రవేత్తలు, కళాకారులు ప్రభుత్వానికి వేర్వేరుగా లేఖలు, వినతిపత్రాలు పంపారు. మోదీ సర్కార్ రాజ్యాంగాన్ని ఓ పద్ధతి ప్రకారం ధ్వంసం చేయాలనుకుంటున్నదని కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. మరోవైపు మత ప్రాతిపదికన ఉన్న పౌరసత్వ సవరణ బిల్లుకు భారత పార్లమెంట్ ఆమోదం తెలిపితే.. ఆ దేశ హోం మంత్రి అమిత్‌షాతోపాటు ఇతర కీలక నాయకత్వంపై ఆంక్షలు విధించాలని అమెరికాకు చెందిన యూఎస్‌సీఐఆర్ఎఫ్ ట్రంప్ సర్కార్‌కు సిఫారసు చేసింది. పొరుగుదేశాల్లో జోక్యం చేసుకొనేందుకే భారత్ ఈ బిల్లును తెస్తున్నదని పాకిస్థాన్ ఆరోపించింది. ఈ బిల్లును బుధవారం రాజ్యసభలో ప్రవేశపెట్టనుండగా, మద్దతు తెలిపేందుకు శివసేన షరతులు విధించింది. తమ సందేహాలు నివృత్తికావాలని స్పష్టంచేసింది. కాగా ఈ బిల్లు పార్టీ సిద్ధాంతాలకు విరుద్ధంగా ఉన్నదని.. అందువల్ల మద్దతుపై పునరాలోచించుకోవాలని జేడీయూ అధినేత నితీశ్‌కుమార్‌కు ఆ పార్టీ ఉపాధ్యక్షుడు ప్రశాంత్ కిశోర్ సూచించారు. ఈ బిల్లు వల్ల అసోంలో బెంగాలీ మాట్లాడేవారికి ఆధిపత్యం లభించబోదని కేంద్ర ప్రభుత్వం స్పష్టంచేసింది.

5

చికెన్ ధరలు (వెన్‌కాబ్) (రూ.)			
ఫారంధర	80.00	లిటిల్ లైవ్	102.00
డ్రెస్‌డ్	148.00	స్కిన్‌లెస్	168.00

గుడ్ల ధరలు (వందకు) (రూ.)			
హైదరాబాద్	434.00	రంగారెడ్డి	434.00
మెదక్	434.00	కరీంనగర్	437.00
వరంగల్	437.00	డజన్‌ధర	66.00

మాకు ఉరిశిక్షలు ఎందుకు?

III

ఢిల్లీలోని వాయుకాలుష్యం వల్ల ఎలాగూ చనిపోతాం!
సుప్రీంకోర్టులో నిర్భయ దోషి రివ్యూ పిటిషన్

'సీ-130 హెర్క్యులస్' విమానం (ఫైల్)

కూలిన చిలీ సైనిక విమానం

38 మంది ఆచూకీ గల్లంతు

5

సిద్దిపేట జిల్లా ములుగు హార్టికల్చర్ యూనివర్సిటీలో ఏర్పాటుచేసిన కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం

సిద్దిపేట జిల్లా ములుగులో ముఖ్యమంత్రి కేసీఆర్ చేతులమీదుగా ప్రారంభోత్సవానికి సిద్ధమైన ఫారెస్ట్ కాలేజీ, రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్

గజ్వేల్ జిగేల్

మొదటిపేజీ తరువాయి...

వంటేరు ప్రతాప్‌రెడ్డి, ఎలక్షన్‌రెడ్డి తదితరులు మంగళవారం పరిశీలించారు. సీఎం పర్యటన నేపథ్యంలో కట్టుదిట్టమైన భద్రతాఏర్పాట్లు చేశారు. సీఎం పర్యటించే ప్రాంతాల్లో ప్రత్యేక పోలీసు బృందాలు, డాగ్‌స్క్వాడ్‌లు తనిఖీచేశాయి. జిల్లా కలెక్టర్ వెంకట్రామ్‌రెడ్డి, సీపీ జోయల్ డేవిస్‌తోపాటు పలువురు అధికారులు, పోలీసులు ఉన్నతాధికారులు భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

ప్రపంచస్థాయి ప్రమాణాలతో ఫారెస్ట్ కాలేజీ

తమిళనాడులోని గట్టుపాలయం ఫారెస్ట్ కాలేజీ దేశంలోనే అత్యధిక సంఖ్యలో 120 మంది ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ (ఐఎఫ్ఎస్) అధికారులను అందించింది. అంతకంటే ఎక్కువ మంది ఐఎఫ్ఎస్‌లను తెలంగాణ నుంచి తయారుచేసేందుకు వీలుగా దేశం గర్వించే రీతిలో ఫారెస్ట్ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని భావించిన సీఎం కేసీఆర్ ఆలోచనకు అనుగుణంగా ములుగులో ఫారెస్ట్ కాలేజీ రూపుదిద్దుకున్నది. ప్రస్తుతం ఉస్మానియా యూనివర్సిటీకి అనుబంధంగా ఉన్న ఫారెస్ట్ కాలేజీని పూర్తి స్థాయి లేదా డీమ్డ్ యూనివర్సిటీగా హోదా పెంచడానికి ప్రభుత్వం ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నది. దూలపల్లి ఫారెస్ట్ అకాడమీలో తాత్కాలికంగా కొనసాగుతున్న బీఎస్సీ ఫారెస్ట్రీ కోర్సులు నూతన క్యాంపస్‌లోకి మారనున్నాయి. 2020 నుంచి ఎమ్మెస్సీ, పీహెచ్‌డీతోపాటు ఏకకాలంలో ఫారెస్ట్ మేనేజ్‌మెంట్ కోర్సులను ప్రారంభించడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. ఫారెస్ట్ కాలేజీ పరిపాలనా భవనాన్ని దాదాపు 12 ఎకరాల పరిధిలో, రెండు లక్షల చదరపు అడుగుల వైశాల్యంలో నిర్మించారు. దీని నిర్మాణానికి ప్రభుత్వం రూ.75 కోట్లు మంజూరుచేసింది.

సువిశాల ప్రాంగణంలో ఫారెస్ట్‌కాలేజీ

గజ్వేల్ నియోజవకవర్గం నర్సంపల్లి రిజర్వ్‌ఫారెస్ట్ బ్లాక్‌లో సువిశాల ప్రాంతంలో పరిపాలనా విభాగం, తరగతి గదులు, సెమినార్ హాల్స్, ల్యాబ్‌లు, హాస్టళ్లు, క్యాంటీన్‌లు, ఆడిటోరియం, రైతు హాస్టళ్లు, గెస్ట్‌హౌస్‌లు, పరిశోధనా విభాగాలను ఏర్పాటుచేశారు. అటవీవనరులు, అటవీ ఉత్పత్తుల యాజమాన్యం, వాటి వాడకం, అటవీ సాంఘిక శాస్త్రం, సామాజిక శాస్త్రంతోపాటు వన్యప్రాణి శాస్త్రం, పట్టణాల్లో అడవుల పెంపకం, సుందరీకరణ, సిల్వికల్చర్ విధానాలపై వివిధ విభాగాలుంటాయి. ఈ కళాశాలలో వినూత్నరీతిలో అటవీ, వన్యప్రాణులపై సమగ్ర అవగాహన కోసం ఒక మ్యూజియం ఏర్పాటుచేస్తున్నారు. ఈ కోర్సులలో నిష్ణాతులైనవారికి పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలతోపాటు యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్‌లో ఎంపిక కావడానికి అవకాశాలు మెరుగవుతాయి. ఈ కోర్సులు పూర్తిచేసినవారికి అటవీశాఖ ఉద్యోగాల్లో ప్రత్యేక రిజర్వేషన్ కల్పించనున్నారు. ఫారెస్ట్రీ కోర్సులకు కూడా ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తిస్తున్నది. ఉపకారవేతనాలను కూడా అందిస్తున్నారు. ఇంటర్న్‌షిప్‌ల ద్వారా కొంత రాబడిని పొందడమేకాకుండా రూరల్ ఎంటర్‌ప్రినర్‌షిప్ అవేర్‌నెస్ డెవలప్‌మెంట్ యోజన (రెడీ) ద్వారా ముఖ్యమైన పాఠ్యాంశాలపై క్షేత్రస్థాయిలో అధ్యయనం ఉంటుంది.

దేశంలో నాలుగో ఉద్యాన వర్సిటీ

దేశంలో మొట్టమొదటి ఉద్యాన విశ్వవిద్యాలయం 1983లో హిమాచల్‌ప్రదేశ్‌లోని సోలాన్‌లో ప్రారంభించారు. ఆ తర్వాత 2007లో ఆంధ్రప్రదేశ్‌లోని తాడేపల్లిగూడెంలో, 2010లో కర్ణాటకలోని బాగల్‌కోట్‌లో వర్సిటీలను ప్రారంభించారు. 2014లో తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం ఏర్పాటైంది. ఉద్యానరంగంలో విద్య, పరిశోధన, విస్తరణ లక్ష్యాలుగా 2016 జూన్ 7న తెలంగాణ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు, మంత్రుల సమక్షంలో అప్పటి కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి రాధామోహన్‌సింగ్ ములుగు ఉద్యాన విశ్వవిద్యాలయానికి శంకుస్థాపనచేశారు. ఇందులో హార్టికల్చర్ బీఎస్సీ, ఎంఎస్సీ, పీహెచ్‌డీకి అవకాశం ఉన్నది. ఈ కాలేజీలో అందించే హార్టికల్చర్ బీఎస్సీలో 190, ఎంఎస్సీలో 40, పీహెచ్‌డీలో 4 సీట్లలో వచ్చే ఏడాది నుంచి అడ్మిషన్లు జరుగనున్నాయి. హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్, వనపర్తి జిల్లా మోజర్లలోని ఉద్యాన కళాశాలల్లో పండ్లు, కూరగాయలు, పూలు, సుగంధద్రవ్య, ఔషధ మొక్కల విభాగాల్లో పీజీ కోర్సులు, ఆదిలాబాద్ జిల్లా దస్నాపూర్, కరీంనగర్ జిల్లా రామ్‌గిరి ఖిల్లాలో ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాలలు, రాష్ట్రవ్యాప్తంగా కూరగాయలు, పండ్లలో పరిశోధనలకై 11 ఉద్యాన పరిశోధనస్థానాలు ఏర్పాటయ్యాయి. ద్రాక్షకోసం హైదరాబాద్‌లో, పసుపుపై ప్రత్యేకంగా నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లిలో పరిశోధనలు జరుగుతున్నాయి.

మంగళవారం గజ్వేల్‌లోని సమీకృత మార్కెట్ వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్థిక మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి తదితరులు ఉన్నారు

పదహారు ఎకరాల్లో వర్సిటీ నిర్మాణం

ములుగు ఉద్యాన వర్సిటీని రూ.135 కోట్ల వ్యయంతో 16 ఎకరాల్లో ఏర్పాటు చేశారు. ఈ వర్సిటీలో అద్భుతమైన సాంకేతిక ప్రమాణాలతో నాలుగు అంతస్తుల భవనాన్ని నిర్మించారు. ప్రత్యేకంగా అకడమిక్ బ్లాక్‌లు, మూడు, నాలుగు అంతస్తుల్లో అడ్మినిస్ట్రేషన్ బ్లాకులను ఏర్పాటుచేశారు. విద్యార్థినీవిద్యార్థులకు వేర్వేరుగా వసతిగదులు, గెస్ట్ హౌస్, స్టాఫ్ క్వార్టర్స్ నిర్మించారు. వీటితోపాటు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన అత్యాధునిక పరిశోధనాలయాలు (ల్యాబ్‌లు) ఏర్పాటుచేశారు. వెయ్యిమంది విద్యార్థులకు ఉపయోగపడేలా పంటకోత అనంతరం పరిశోధనలు నిర్వహించేందుకు ల్యాబ్‌లను కూడా ఏర్పాటుచేశారు. ఇందులో ఎంసెట్ ర్యాంకు ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. వచ్చే విద్యాసంవత్సరం 2020-21లో బీఎస్సీ హార్టికల్చర్ కోర్సులో 40 మందికి ప్రవేశం లభిస్తుంది. రాబోయేరోజుల్లో ఇందులో ఉద్యానశాస్త్రంలో బీఎస్సీతోపాటు పీజీ, పీహెచ్‌డీ కోర్సులు కూడా అందుబాటులోకి రానున్నాయి.

గజ్వేల్‌లోని మహతి ఆడిటోరియంలో సీఎం కేసీఆర్ బుధవారం ప్రసంగించే వేదిక (ఇన్‌సెట్‌లో) విద్యుత్తు కాంతుల్లో మహతి ఆడిటోరియం

మంగళవారం రాత్రి విద్యుత్తు కాంతులతో వెలిగిపోతున్న గజ్వేల్‌లోని ఐవోసీ

ములుగు వర్సిటీతో నూతన అధ్యాయం: మంత్రి నిరంజన్‌రెడ్డి

ములుగు ఉద్యాన విశ్వవిద్యాలయంతో తెలంగాణ ఉద్యానరంగంలో నూతన అధ్యాయం ప్రారంభంకానున్నదని వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖల మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. హిమాచల్‌ప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు తర్వాత దేశంలోనే ఇది నాలుగో ఉద్యాన విశ్వవిద్యాలయమని పేర్కొన్నారు. తెలంగాణలో 53.25 ఎకరాలలో విశాలమైన ప్రాంగణంలో నిర్మించినట్టు తెలిపారు. దీనిలో 30.01 ఎకరాల్లో పలురకాల పండ్లమొక్కలతో ములుగు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా తీర్చిదిద్దినట్లు చెప్పారు. దీనిని మామిడి, జామ, దానిమ్మ, బొప్పాయి, చింత, ఉసిరి తదితర 40 రకాల పండ్లమొక్కలు, శాండల్, వెదురుమొక్కలతో తీర్చిదిద్దిన అధికారులను మంత్రి ప్రశంసించారు. రెండేండ్లుగా ఉద్యాన విశ్వవిద్యాలయం రూపుదిద్దుకునేందుకు కృషిచేసిన అధికారులను అభినందించారు. ఉద్యానరంగంలో శాస్త్ర, సాంకేతికతను పెంపొందించేందుకు వర్సిటీ ప్రారంభోత్సవం ముందడుగు అన్నారు. రాష్ట్రంలోని రైతుల ఆర్థికాభివృద్ధికి, సాంకేతిక శిక్షణకు ఇది తోడ్పడుతుందని చెప్పారు. రైతు ఆత్మగౌరవంతో బతుకాలి.. రాష్ట్రం సర్వోతోముఖాభివృద్ధి చెందాలని సీఎం కేసీఆర్ నిరంతరం తపిస్తుంటారని మంత్రి పేర్కొన్నారు. ముగులు ఉద్యానవర్సిటీకి జాతీయ, అంతర్జాతీయ హోదా కోసం కృషిచేస్తామని మంత్రి వెల్లడించారు. గజ్వేల్ స్ఫూర్తిగా రాష్ట్రవ్యాప్తంగా సమీకృత మార్కెట్లు నిర్మిస్తామని మంత్రి నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఆరు బ్లాకుల సముదాయంతో, అన్నిరకాల కూరగాయలు, పండ్లు, మాంసం ఉత్పత్తులు లభించడంతోపాటు 16 వాణిజ్యదుకాణాలు, ఒక సూపర్‌మార్కెట్ ఉన్నట్లు చెప్పారు. పిల్లలకు మార్కెట్ పరిసరాల్లోనే పార్క్ ఏర్పాటుచేయడంతో ఆహ్లాదకరంగా ఉన్నదని పేర్కొన్నారు.

సీఎం కేసీఆర్ రాక సందర్భంగా ములుగులోని హార్టికల్చర్ వర్సిటీలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి. చిత్రంలో వంటేరు, పార్థసారథి

దేశానికే రోల్ మోడల్‌లా గజ్వేల్: మంత్రి హరీశ్

దేశంలోనే అభివృద్ధికి గజ్వేల్ రోల్‌మోడల్‌గా మారిందని రాష్ట్ర ఆర్థిక మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. ఆడిటోరియం, సమీకృత మార్కెట్‌ను అత్యాధునిక సౌకర్యాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి ముఖ్యమంత్రి కేసీఆర్ స్వయంగా రూపకల్పనచేసిన నమూనాలో నిర్మించినట్టు చెప్పారు. నియోజకవర్గస్థాయిలో అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఒకే ప్రాంగణంలో ఏర్పాటుచేయడం ప్రజాసేవకు ఆదర్శంగా నిలుస్తుందన్నారు. గజ్వేల్ అభివృద్ధికి ముఖ్యమంత్రి నిరంతరం కృషి చేస్తున్నారని చెప్పారు. గజ్వేల్ ప్రజలు బుధవారం అభివృద్ధి పండుగ జరుపుకొనేందుకు ఉత్సాహంగా ఉన్నారని వ్యాఖ్యానించారు. ప్రజలు అధికారులకు సహకరించి సీఎం పర్యటనను విజయవంతం చేయాలని కోరారు.

ములుగులోని హార్టికల్చర్ యూనివర్సిటీలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి హరీశ్‌రావు

ఉద్యానవర్సిటీతో బంగారు భవిష్యత్

- రాష్ట్రాభివృద్ధిలో ఉద్యానరంగానిది కీలకపాత్ర
- స్థూల వ్యవసాయోత్పత్తిలో 40.5% వాటా
- పథకాలతో ఉద్యాన పంటలను ప్రోత్సహిస్తున్నాం
- 'నమస్తే తెలంగాణతో' ఉద్యానవర్సిటీ వీసీ పార్థసారథి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర అభివృద్ధిలో ఉద్యానరంగం ప్రధానపాత్ర పోషిస్తున్నదని కొండాలక్ష్మణ్ తెలంగాణ ఉద్యానవర్సిటీ వైస్‌చాన్స్‌లర్, వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి సీ పార్థసారథి తెలిపారు. రాష్ట్ర స్థూల వ్యవసాయోత్పత్తిలో ఉద్యానరంగం వాటా 40.5% మేర ఉన్నదని, రాష్ట్రవ్యాప్తంగా 12.40 లక్షల ఎకరాల్లో సాగవుతున్న ఉద్యానపంటల ద్వారా 71.52 లక్షల టన్నుల దిగుబడి వస్తున్నదని వివరించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 4.42 లక్షల ఎకరాల్లో పండ్లు, 3.52 లక్షల ఎకరాల్లో కూరగాయలు, 3.90 లక్షల ఎకరాల్లో సుగంధ ద్రవ్యాలు సాగవుతున్నాయని చెప్పారు. ఉద్యానవర్సిటీ ప్రారంభోత్సవం సందర్భంగా పార్థసారథి 'నమస్తే తెలంగాణ'తో ప్రత్యేకంగా ముచ్చటించారు.

హరితగృహాలను, సూక్ష్మసేద్యాన్ని ప్రోత్సహించాం

రాష్ట్రంలో కూరగాయల కొరత తీర్చేందుకు హరితగృహాలతోపాటు బిందు, తుంపర సేద్యాన్ని భారీగా ప్రోత్సహించాం. గతంలో 11.99 లక్షల ఎకరాలకు సూక్ష్మసేద్యం ఉంటే.. తెలంగాణ ఏర్పడిన తర్వాత రూ.1,816 కోట్లతో 6.60 లక్షల ఎకరాల్లో బిందు, తుంపర సేద్యాన్ని ఏర్పాటు చేశాం. సూక్ష్మసేద్యంతో ఒక్కో రైతుకు సరాసరి రూ.2 లక్షల అదనపు ఆదాయం సమకూరింది. ఆసిఫాబాద్‌లో మూడేండ్ల క్రితం మొదలైన ఆపిల్ సాగు ప్రస్తుతం పూతకొచ్చింది. ఆపిల్‌తోపాటు ఆపిల్‌బెర్, డ్రాగన్‌ఫ్రూట్, ఖర్బూజ, తెట్టు, అమెరికన్, ఎర్ర చింతపండు నిచ్చే అనంతరుధిర్ రకాలను ప్రవేశపెట్టాం. కొత్త టెక్నాలజీలతో పలుతోటల్లో దిగుబడి పెరిగింది. కూరగాయలు, పండ్లు, పసుపు సాగుకోసం జీడిమెట్ల, ములుగులో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుచేసి 17.5 లక్షల నాణ్యమైన మొక్కలను రైతులకు అందించాం. 5,398 ఎకరాల్లో పందిరి కూరగాయల సాగును ప్రోత్సహిస్తున్నాం.

సమగ్ర విధానంతో పంట కాలనీలు

రాష్ట్రంలో 30.7 లక్షల టన్నుల కూరగాయలు ఉత్పత్తి అవుతున్నాయి. 10.98 లక్షల టన్నుల లోటును పూడ్చేందుకు ఇబ్రహీంపట్నంలో పంటకాలనీలను ఏర్పాటుచేశాం. దీంతో ఉత్పత్తి 44 వేల టన్నుల నుంచి 83 వేల టన్నులకు పెరిగింది. దీన్ని స్ఫూర్తిగా తీసుకొని హైదరాబాద్‌తోపాటు నిజామాబాద్, వరంగల్, ఖమ్మం, కరీంనగర్ పరిధిలో పంటకాలనీలను ప్రవేశపెడుతున్నాం. వినియోగదారులకు నాణ్యమైన మిరప, పసుపు పొడులు, అల్లం, వెల్లుల్లి పేస్టులను 'కాకతీయ ఫుడ్స్' ద్వారా ప్రభుత్వం నేరుగా విక్రయిస్తున్నది. పసుపు రైతుల సంక్షేమం కోసం నిజామాబాద్ జిల్లా వేల్పూర్ మండలం పర్గల్‌లో 'సైస్ పార్కు' ఏర్పాటుచేశాం. వెదురు, కాజురైనా, ఎర్రచందనం సాగును విస్తృతంగా ప్రోత్సహిస్తున్నాం.

లోకం పోకడ

కేజీ టమాటలు, అరకేజీ ఆలుగడ్డలు, పావు కేజీ స్మార్ట్ ఫోన్లు కొనుక్కుందాం!

ముహూర్తం

సూర్యోదయం: 6.39 గంటలకు

సూర్యాస్తమయం: 5.34 గంటలకు

వికారినామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, శుక్లపక్షం చతుర్దశి ఉదయం 11.00 వరకు, తదుపరి పౌర్ణమి, నక్షత్రం: రోహిణి గురువారం ఉదయం 6.23 వరకు, తదుపరి మృగశిర, అమృతఘడియలు: సాయంత్రం 4.07 నుంచి 5.45 వరకు, రాహుకాలం: మధ్యాహ్నం 12.06 నుంచి 1.28 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 11.45 నుంచి మధ్యాహ్నం 12.28 వరకు, వర్జ్యం: రాత్రి 10.14 నుంచి 11.52 వరకు.

సమర్థంగా పరీక్షల నిర్వహణ

గతేడాది పొరపాట్లు పునరావృతం కావు ▪ త్రిసభ్య కమిటీ సిఫార్సులు అమలుచేస్తాం

- సీజీజీ ఆధ్వర్యంలోనే ఇంటర్మీడియట్ పరీక్షలు
- విద్యార్థులు భయాందోళనలకు గురికావొద్దు
- ఇంటర్‌బోర్డు కార్యదర్శి ఒమర్ జలీల్ భరోసా

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వచ్చే మార్చిలో ఇంటర్మీడియట్ పరీక్షలను మరింత సమర్థంగా, పారదర్శకంగా నిర్వహించడానికి అన్ని రకాల చర్యలు చేపడుతున్నట్టు ఇంటర్ బోర్డు కార్యదర్శి సయ్యద్ ఒమర్ జలీల్ చెప్పారు. గత మార్చిలో ఇంటర్ పరీక్షల్లో తలెత్తిన పొరపాట్లు మళ్లీ జరుగకుండా పకడ్బందీ ఏర్పాట్లుచేశామన్నారు. ముఖ్యంగా సాఫ్ట్‌వేర్‌లో ఉన్న లోపాలను సరిచేశామని తెలిపారు. పైగా పరీక్షల నిర్వహణ పనులు ఈసారి సీజీజీ ఆధ్వర్యంలో జరుగుతున్నాయని అన్నారు. సీజీజీ కొత్త సాఫ్ట్‌వేర్‌ను తయారుచేసిందని, బోర్డులో ఐటీ విభాగాన్ని కూడా ఏర్పాటుచేశామని చెప్పారు. టెస్టింగ్ నిర్వహించామని, ఇప్పటివరకు ఎలాంటి సమస్య రాలేదని పేర్కొన్నారు. విద్యార్థులు ఎలాంటి అనుమానాలు లేకుండా పరీక్షలకు సిద్ధంకావాలని సూచించారు. మంగళవారం ఇంటర్‌బోర్డు కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. గత పరీక్షల నిర్వహణలో ఎదురైన సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటుచేసిన త్రిసభ్య కమిటీ సిఫార్సులను ఇప్పుడు తూచ తప్పకుండా పాటిస్తున్నామని చెప్పారు. పరీక్షల విషయంలో విద్యార్థులెవ్వరూ భయాలు పెట్టుకోవాల్సిన పనిలేదని స్పష్టంచేశారు. ఒకవేళ చిన్న చిన్న పొరపాట్లు ఉంటే వెంటనే వాటిని సరిచేయడానికి ప్రాంతీయ ఇంటర్మీడియట్ విద్యాధికారులు (ఆర్ఐఈవో) సిద్ధంగా ఉన్నారని తెలిపారు. తప్పులు సరిచేసుకోవడానికి విద్యార్థుల డాటా మొత్తాన్ని ఇంటర్మీడియట్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశామని చెప్పారు. తమ వ్యక్తిగత వివరాల్లో ఏవైనా పొరపాట్లు ఉన్నట్లయితే.. ఈ నెల 15లోగా సరిచేసుకోవడానికి విద్యార్థులకు అవకాశం ఇచ్చామని పేర్కొన్నారు. పరీక్షలంటే భయపడే విద్యార్థుల్లో మానసిక ధైర్యం నింపడం, ఒత్తిడిని తగ్గించడం కోసం 404 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో, 1,000 పైగా ప్రైవేటు జూనియర్ కాలేజీల్లో కౌన్సెలర్లను నియమించామని తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి కౌన్సెలింగ్ ఇవ్వాలనే అంశాలపైనా కౌన్సెలర్లతోపాటు ప్రిన్సిపాళ్లకు కూడా శిక్షణ ఇచ్చామని చెప్పారు.

ఇంటర్‌బోర్డు కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్న ఇంటర్‌బోర్డు కార్యదర్శి ఒమర్ జలీల్

ఇంటర్ పరీక్షలకు 9,62,699 దరఖాస్తులు

వచ్చే మార్చిలో నిర్వహించే ఇంటర్ పరీక్షలకు మంగళవారంనాటికి 9,62,699 మంది విద్యార్థులు దరఖాస్తులు చేసుకున్నారని బోర్డు కార్యదర్శి చెప్పారు. ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని, ఈ అంశం ప్రభుత్వ పరిశీలనలో ఉన్నదన్నారు. రాష్ట్రంలోని ప్రైవేటు జూనియర్ కాలేజీల గుర్తింపు కోసం జనవరి రెండోవారం వరకు దరఖాస్తులకు గడువు ఇవ్వనున్నామని తెలిపారు. ఆన్‌స్క్రీన్ మూల్యాంకనం మార్చిలో నిర్వహించే పరీక్షలకు వర్తింపజేయడంలేదని చెప్పారు. స్పాట్ వ్యాల్యూయేషన్‌లో తప్పులుచేసిన 1,149 మంది ఎగ్జామినర్లపై చర్యలు తీసుకున్నామని, ఒక్కొక్కరికి రూ.5,000 వరకు జరిమానా విధించామని తెలిపారు. ఇంటర్ పరీక్షల నిర్వహణ బాధ్యతలు సీజీజీకి అప్పగించడంపై ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం అధ్యక్షుడు పీ మధుసూదన్‌రెడ్డి హర్షం ప్రకటించారు.

యాదాద్రి.. కేసీఆర్ మరో గొప్పతనం

- ఆలయ నిర్మాణంలో రెండున్నర లక్షల టన్నుల గ్రానైట్ వినియోగం
- ఆగమశాస్త్ర ప్రకారం.. ప్రాచీన కట్టడంలా నిర్మాణం
- రెండువేల ఏండ్లపాటు చరిత్రకు సాక్షీభూతం
- ఐటీ, మున్సిపల్‌శాఖ మంత్రి కేటీఆర్ ట్వీట్

యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ: 'యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ పునర్నిర్మాణం అత్యద్భుతం. రెండున్నర లక్షల టన్నుల గ్రానైట్ రాయితో నిర్మాణం చేపట్టారు. ఈ ఆలయ నిర్మాణం సీఎం కేసీఆర్ మరో గొప్పతనం' అని ఐటీ, మున్సిపల్‌శాఖల మంత్రి కే తారకరామారావు కొనియాడారు. ఈ మేరకు మంగళవారం ఆయన ట్వీట్ చేశారు. దేవాలయ నిర్మాణ పనులు పూర్తికావచ్చాయని, త్వరలో కొత్త హంగులతో స్వామివారు భక్తులకు దర్శనమివ్వనున్నారని తెలిపారు. 'యాదాద్రి ఆలయ నిర్మాణం ఆగమశాస్త్రం ప్రకారం, ప్రాచీన కట్టడం మాదిరిగా జరిగింది. ఆలయం మొత్తం రాతితోనే నిర్మాణం చేపట్టారు. ఇందుకోసం రెండున్నర లక్షల టన్నుల గ్రానైట్‌ను వినియోగించారు. ఇంతపెద్దమొత్తంలో గ్రానైట్‌ను ఉపయోగించిన ఆలయం దేశంలో మరెక్కడా లేదు. ఈ ఆలయం రాబోయే రెండువేల సంవత్సరాల వరకు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుంది. భారత్‌లోనే ఇది ఒక గొప్ప అద్భుత కట్టడంగా నిలుస్తుంది. ఇంతటి చారిత్రాత్మక కట్టడానికి పూనుకున్న సీఎం కేసీఆర్ భక్తుల గుండెల్లో చిరకాలం నిలిచిపోతారు' అని కేటీఆర్ పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన వీడియోను ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు.

మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పూజలు

సీఎం కేసీఆర్ చొరవతో చినజీయర్ స్వామి వారి ఆశీస్సులతో నిర్మాణమవుతున్న యాదాద్రి వల్ల తిరుమల తరహాలో ఇక్కడ మహానగరం ఆవిష్కృతం కానున్నదని ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి వీ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. మంగళవారం ఆయన యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. తిరుమల తరహాలో సప్తగిరులకు ఎంతటి ప్రాధాన్యం ఉన్నదో.. యాదాద్రిలో నవగిరులకు కూడా అంత ప్రాధాన్యం ఏర్పడనున్నదని చెప్పారు. ప్రపంచంలోనే పేరుగాంచే విధంగా తెలంగాణకు తలమానికంగా యాదాద్రిని తీర్చిదిద్దుతున్న ఘనత సీఎం కేసీఆర్‌దేనని కొనియాడారు.

రాష్ట్ర రైతు సమన్వయ సమితి చైర్మన్‌గా
13న పల్లా బాధ్యతల స్వీకరణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర రైతు సమన్వయ సమితి చైర్మన్, డైరెక్టర్‌గా పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఈ నెల 13వ తేదీన (శుక్రవారం) పదవీ బాధ్యతలు స్వీకరిస్తారు. హైదరాబాద్ ప్రశాసన్‌నగర్‌లోని రైతు సమన్వయ సమితి రాష్ట్ర కార్యాలయంలో జరిగే ఈ కార్యక్రమంలో పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు పాల్గొంటారు. అనంతరం వ్యవసాయ అనుబంధరంగాల ఉన్నతాధికారులు, జిల్లా రైతు సమన్వయ సమితి అధ్యక్షులతో పల్లా రాజేశ్వర్‌రెడ్డి సమావేశం నిర్వహిస్తారు.

మంగళవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని లక్ష్మీ బరాజ్‌లో గోదావరి జలాలను పరిశీలిస్తున్న గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ దంపతులు

మహదేవపూర్ మండలంలోని కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్

కాటారం మండలం నస్తూర్ పల్లి గ్రామపంచాయతీ పరిధిలోని బోడగూడెంలో గిరిజన మహిళతో మాట్లాడుతున్న గవర్నర్ తమిళిసై

కాళేశ్వరం సూపర్!

మొదటిపేజీ తరువాయి...

ఆహ్వానిస్తున్నట్టు గవర్నర్ చెప్పారు. గిరిజనులు చూపిన అభిమానాన్ని ఒక గవర్నర్‌గా కాకుండా ఒక సోదరిగా మరువలేనని అన్నారు. గిరిజనులకు పెద్దఎత్తున ప్రభుత్వ పథకాలు అందడంపై ఆమె ఆనందం వ్యక్తంచేశారు. గిరిజన యువతకు ఉద్యోగ ఉపాధితోపాటు డబుల్ బెడ్‌రూం ఇండ్లు, సాగుకు వ్యవసాయ భూమి ఇవ్వాలని చేసిన విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించారు. ముందుగా గిరిజన సంప్రదాయ నృత్యాలతో గవర్నర్‌కు ఘనస్వాగతం పలికారు. ఆమె మొక్కలు నాటి, అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించడంతోపాటు లక్ష్మీదేవర ఆలయంలో పూజలు చేశారు.

ప్రాజెక్టు, పనితీరు చూసి ఆశ్చర్యం

భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయంలో గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ దంపతులు ప్రత్యేక పూజలను నిర్వహించి, స్వామికి అభిషేకం చేశారు. వారికి అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఆశీర్వచనం అందించారు. లక్ష్మీ పంప్‌హౌస్‌లో భూగర్భంలో ఏర్పాటు చేసిన మోటర్లను పరిశీలించిన తమిళిసై ఒకటో నంబర్ మోటర్‌ను ఆన్ చేశారు. ఎత్తిపోస్తున్న నీటి నిచూసి మురిసిపోతూ విక్టరీ సింబల్ చూపించారు. వావ్ సూపర్ అంటూ గోదావరికి నమస్కరించారు. ఆ తర్వాత మేడిగడ్డను సందర్శించి లక్ష్మీ బరాజ్ పైనుంచి గోదావరికి పసుపు, కుంకుమ, పూలను సమర్పించారు. లక్ష్మీ పంపుహౌస్, లక్ష్మీ, సరస్వతి బరాజ్‌లను చూసి.. నిర్మాణం ప్రారంభం నుంచి నీటి పంపింగ్ వరకు మొత్తం వివరాలను ఇంజినీర్లను అడిగి తెలుసుకుని సంతోషపడ్డారు. నిర్మాణాలను, వాటి పనితీరును చూసి గవర్నర్ ఆశ్చర్యాన్ని వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు గండ్ర వెంకటరమణారెడ్డి, శ్రీధర్ బాబు, భూపాలపల్లి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణి, జిల్లా కలెక్టర్ వాసం వెంకటేశ్వర్లు,జిల్లా అధికార యంత్రాంగం పాల్గొన్నది. నక్సల్స్ ప్రభావిత అటవీప్రాంతంలో భారీ పోలీసు బందోబస్తు మధ్య గవర్నర్ విస్తృతంగా పర్యటించారు.

ఎన్టీపీసీ వీఐపీ గెస్ట్‌హౌస్‌లో గవర్నర్ బస

పెద్దపల్లి ప్రతినిధి, నమస్తే తెలంగాణ: పెద్దపల్లి జిల్లా పర్యటనలో భాగంగా గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ మంగళవారం సాయంత్రం ఎన్టీపీసీలోని వీఐపీ గెస్ట్‌హౌస్‌కు చేరుకున్నారు. గవర్నర్‌కు ఎస్సీ సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్, జెడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్, కలెక్టర్ శ్రీదేవసేన, ఎమ్మెల్యే కోరుకంటి చందర్, రామగుండం సీపీ వీ సత్యనారాయణ స్వాగతం పలికారు. అనంతరం గవర్నర్‌ను మంత్రి కొప్పుల సన్మానించారు. రాత్రి ఆమె ఎన్టీపీసీలోని జ్యోతిక వీఐపీ గెస్ట్‌హౌస్‌లో బస చేశారు. బుధవారం జిల్లాలోని ఎన్టీపీసీ ప్రభుత్వ బాలికల పాఠశాల విద్యార్థులు ప్రదర్శించే కలరియపట్టు కేరళ మార్షల్ ఆర్ట్స్‌ను గవర్నర్ తిలకిస్తారు. బసంత్‌నగర్‌లోని అవెన్యూ ప్లాంటేషన్, ధర్మారం క్రాస్‌రోడ్డులోని నాన్‌ఓవెన్ బ్యాగుల తయారీయూనిట్‌ను పరిశీలిస్తారు. పెద్దపల్లి శాంతినగర్‌లో సబల శానిటరీ న్యాప్కిన్స్ తయారీయూనిట్‌ను పరిశీలించి, కాసులపల్లి గ్రామాన్ని సందర్శిస్తారు. మధ్యాహ్నం కాళేశ్వరం ప్రాజెక్టులోని నంది పంపుహౌస్‌ను సందర్శించి హైదరాబాద్‌కు తిరుగు పయనమవుతారు.

ప్రపంచ లైఫ్‌సైన్స్ హబ్ లక్ష్యం

- ఇప్పటికే ఉన్నతస్థానంలో తెలంగాణ
- పెట్టుబడుల ఆకర్షణకు సదస్సు తోడ్పాటు
- స్విట్జర్లాండ్‌తో ఒప్పందం సంతోషకరం
- ఐటీ, పరిశ్రమలశాఖల మంత్రి కేటీఆర్
- ఫిబ్రవరిలో బయో ఏషియా సదస్సు

బయోఏషియా సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి కేటీఆర్, స్విట్జర్లాండ్ డిప్యూటీ కాన్సుల్ జనరల్ సిల్వానా రెంగ్లీ ఫ్రే. చిత్రంలో ఐటీశాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్, బయో ఏషియా సీఈవో శక్తినాగప్పన్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: లైఫ్‌సైన్సెస్ రంగంలో తెలంగాణ ఇప్పటికే ఉన్నతస్థానంలో కొనసాగుతున్నదని, ప్రపంచానికి లైఫ్‌సైన్సెస్ హబ్‌గా రాష్ట్రాన్ని మార్చాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని ఐటీ, పరిశ్రమలశాఖల మంత్రి కే తారకరామారావు చెప్పారు. హైదరాబాద్ వృద్ధిలో, దాదాపు 100 దేశాలనుంచి పెట్టుబడులను ఆకర్షించడంలో బయోఏషియా సదస్సు తోడ్పాటునందిస్తుందని అన్నారు. బయోఏషియా సదస్సు దేశభాగస్వామిగా ఉండేందుకు స్విట్జర్లాండ్ ముందుకురావటం సంతోషకరమన్నారు. స్విస్ సంస్థలు, కంపెనీలతో ఉన్న విస్తృత అవకాశాలను వినియోగించుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని చెప్పారు. మంగళవారం ప్రగతిభవన్‌లో మంత్రి కేటీఆర్ సమక్షంలో రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, కాన్సులేట్ జనరల్ ఆఫ్ స్విట్జర్లాండ్ అధికారులు ఒప్పందంపై సంతకాలు చేశారు.

ఫిబ్రవరి 17 నుంచి బయోఏషియా

17వ ఎడిషన్ బయో ఏషియా- 2020 సదస్సును వచ్చే ఏడాది ఫిబ్రవరి 17 నుంచి 19 వరకు హైదరాబాద్‌లోని హెచ్‌ఐసీసీలో నిర్వహించనున్నట్టు ఐటీశాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్ తెలిపారు. ఫార్మా, లైఫ్‌సైన్సెస్, హెల్త్‌కేర్, బయోటెక్నాలజీ తదితర రంగాలకు మరింత ఊతమిచ్చేలా తెలంగాణ ప్రభుత్వం బయోఏషియా సదస్సును నిర్వహిస్తూ వస్తున్నదని తెలిపారు. పరిశ్రమలభవన్‌లో కాన్సులేట్ జనరల్ ఆఫ్ స్విట్జర్లాండ్ అధికారులతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. లైఫ్‌సైన్సెస్ రంగంలో స్విట్జర్లాండ్‌కు ప్రపంచవ్యాప్తంగా మంచిపేరు ఉన్నదని చెప్పారు. తెలంగాణలో ఆవిష్కరణలు, భాగస్వామ్యాలను ప్రోత్సహించేందుకు ఈ సదస్సును నిర్వహిస్తున్నామని, ఇదే లక్ష్యంతో స్విట్జర్లాండ్‌ను భాగస్వామిగా ఆహ్వానించామని తెలిపారు. లైఫ్‌సైన్స్‌రంగంలో తెలంగాణ, స్విట్జర్లాండ్ ఉమ్మడిగా దృఢపడేందుకు ఇది ఎంతో దోహదం చేస్తుందని చెప్పారు. స్విట్జర్లాండ్ డిప్యూటీ కాన్సుల్ జనరల్ సిల్వానా రెంగ్లీ ఫ్రే మాట్లాడుతూ.. హెల్త్‌కేర్‌రంగంలో భారత్‌ను ప్రముఖ భాగస్వామిగా తమ దేశం గుర్తించిందని చెప్పారు. బయోఏషియా సదస్సు ద్వారా కలిసి ముందుకువెళ్లేందుకు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీఎస్ఐఐసీ వైస్‌చైర్మన్, ఎండీ ఈవీ నరసింహారెడ్డి, బయో ఏషియా సీఈవో శక్తినాగప్పన్ పాల్గొన్నారు.

50 దేశాల నుంచి ప్రతినిధులు

'టు డే ఫర్ టుమారో' నినాదంతో నిర్వహించే బయో ఏషియా సదస్సులో 50 దేశాల నుంచి ప్రభుత్వాధికారులు, ఫార్మా దిగ్గజాలు, పరిశ్రమల పెట్టుబడిదారులు, అకాడమీ విభాగాలకు చెందిన సుమారు రెండువేల మంది ప్రతినిధులు హాజరు కానున్నారు. నోవర్టిస్ సీఈవో వాస్ నరసింహన్, యూనివర్సిటీ ఆఫ్ పెన్సిల్వేనియా నుంచి డాక్టర్ కార్ల్ జూన్, సన్ ఫార్మా చైర్మన్ దిలీప్ షాంగ్వీ, బయోకాన్ సీఎండీ కిరణ్ మజుందార్ షా, పిరమల్ వైస్ చైర్మన్ స్వాతి పిరమల్ తదితర ప్రముఖులు కూడా రానున్నారు.

వివిధ రైతు సంఘాల ప్రతినిధులతో సమావేశమైన రైతు రుణవిముక్తి కమిషన్

రైతు సంఘాలతో రుణవిముక్తి కమిషన్ భేటీ

- అన్నదాతల సంక్షేమంపై చర్చ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ రైతు రుణవిముక్తి కమిషన్ రాష్ట్రంలోని వివిధ రైతు సంఘాల ప్రతినిధులతో మంగళవారం సమావేశమైంది. మాసబ్‌ట్యాంక్‌లోని కమిషన్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో కమిషన్ అధికారాలు, విధులతోపాటు రైతులకు కమిషన్ ఏవిధంగా సహాయం చేయాలనే అంశంపై చర్చించారు. ప్రధానంగా రైతు రుణవిముక్తి, ఆత్మహత్యల నివారణపై కమిషన్‌కు పలు సూచనలు చేశారు. వ్యవసాయ రుణాల మాఫీ, రైతులకు బ్యాంకు రుణాల మంజూరు, పంటలకు మద్దతు ధర, బీమా, పాన్ బ్రోకర్లను, దళారులను నియంత్రించడం, రైతు రుణవిముక్తి కమిషన్ కార్యాకలాపాలపై గ్రామస్థాయి వరకు అవగాహన కల్పించడం తదితర అంశాలపై చర్చించారు. సమావేశంలో రాష్ట్ర రుణవిముక్తి కమిషన్ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు, సభ్యులు కవ్వా లక్ష్మారెడ్డి, పాకాల శ్రీహరి, కార్యదర్శి శారదాదేవి, వివిధ రైతు సంఘాల ప్రతినిధులు కోదండరెడ్డి, సారంపల్లి మల్లారెడ్డి, మోర్తాల చందర్‌రావు, రవి తదితరులు పాల్గొన్నారు.

పాస్‌పుస్తకం కోసం తాసిల్దార్ ఆఫీస్ ఎదుట బైఠాయింపు

కొణిజర్ల : దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న తమ భూమికి పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వాలని కోరుతూ ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం తనికెళ్లకు చెందిన గిరిజన రైతు మంగ్యా కుటుంబసభ్యులతో కలిసి మంగళవారం తాసిల్దార్ కార్యాలయం ఎదుట షామియానా వేసుకొని బైఠాయించారు. తనికెళ్ల రెవెన్యూ పరిధిలోని 387/ఈ లో 28 గుంటల భూమి తమ పూర్వీకుల నుంచి తమకు వారసత్వంగా సంక్రమిస్తుందని, 90 ఏండ్లుగా తామే సాగు చేస్తున్నామని తెలిపారు. కాగా, మూడ్ మంగ్య, గుత్తా శ్రీనివాసరావు, వాసుదేవరావు మధ్య ఈ భూమిపై వివాదం కోర్టు పరిధిలో ఉన్నదని తాసిల్దార్ కమల తెలిపారు. స్థానిక ఎస్సై యల్లయ్య, రెవెన్యూ సిబ్బంది మంగ్యా కుటుంబసభ్యులతో మాట్లాడి నిరసనను విరమింపజేశారు.

SBI
రియల్ ఎస్టేట్ & హౌసింగ్ బిజినెస్ యూనిట్, 2వ అంతస్తు, లోకల్ హెడ్ ఆఫీస్, కోఠి, హైదరాబాద్-500 095.

హోమ్ లోన్ కౌన్సిలర్ (HLC) జాబితా రూపొందించుట

పనితీరుతో సంబంధం కలిగిన చెల్లింపు ప్రాతిపదికన తెలంగాణలో SBI కొరకు హోమ్ లోన్స్ అందించుటకు HLCగా జాబితాలో చేర్పుటకు దిగువ తెలిపిన అర్హతా ప్రమాణాలను నెరవేర్చు భారత పౌరుల నుండి దరఖాస్తులు కోరబడుతున్నవి:

1. వయస్సు: 30-11-2019 నాటికి 18 సంవత్సరాలు లేదా ఆపైన ఉండాలి.
2. మొబైల్ హ్యాండ్ సెట్‌తో స్థానికుడై ఉండి, మెట్రిక్యులేషన్ & ఆపైన చదివి ఉండాలి మరియు తెలుగు మరియు/లేదా ఇంగ్లీషులో ధారాళంగా మాట్లాడగలిగి ఉండాలి.
3. దరఖాస్తు ఫారాలను SBI శాఖల నుండి లేదా https://tinyurl.com/y8dq2hm3 లింక్ ద్వారా పొందవచ్చును.
4. పై ప్రమాణాలను నెరవేర్చు ఆసక్తిగల వ్యక్తులు నిర్ణీత దరఖాస్తు ఫారంలో దరఖాస్తు చేసుకోవచ్చును మరియు 20-12-2019న సా॥ 5.00 గం.లోగా స్వయంగా లేదా పైన తెలిపిన చిరునామాకు తపాలా ద్వారా డిప్యూటీ జనరల్ మేనేజర్ (REHBU)కు దాఖలు చేయాలి.

గౌరవనీయ
తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ (TSERC) సమక్షమున
D.No. 11-4-660, 5వ అంతస్తు, సింగరేణి భవన్, లక్డీకాపూల్, రెడ్‌హిల్స్, హైదరాబాద్-500004.

ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్
బహిరంగ ప్రకటన

1. ట్రాన్స్‌కో యొక్క ట్రాన్స్‌మిషన్ వ్యాపారం కొరకు 4వ నియంత్రణా వ్యవధి (2019-20 నుండి 2023-24) నిమిత్తం మల్టీ ఇయర్ టారిఫ్ (ఎంవైటి) ఏర్పాటు త్రింద ప్రతిపాదిత టారిఫ్ కొరకు ఫైలింగ్ (ఎఫ్‌పిటి) మరియు ట్రాన్స్‌మిషన్ వ్యాపారం మరియు ఎస్ఎల్‌డిసి కార్యకలాపం నిమిత్తం 3వ నియంత్రణా వ్యవధి కొరకు ట్రు అప్ మరియు స్టేట్ లోడ్ డిస్పాచ్ సెంటర్ (ఎస్ఎల్‌డిసి) కార్యకలాపం కొరకు ఆపరేటింగ్ చార్జీలు, వార్షిక ఫీజు మరియు నమిష్టి రెవెన్యూ అవసరత (ఎఆర్‌ఆర్) యొక్క నిర్ధారణ కొరకు తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ (TSERC) సమక్షంలో ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ (TSTRANSCO) ఫైలింగ్స్‌ను దాఖలు చేసినదని యావన్మందికి ఇందుమూలముగా తెలియజేయడమైనది. ఈ ఫైలింగ్స్ ఒ.పి. నెం. 3/2019 (ట్రాన్స్‌మిషన్ వ్యాపారం) మరియు ఒ.పి.నెం. 2/2019 (ఎస్ఎల్‌డిసి కార్యకలాపం) నందు గౌరవనీయ కమిషన్‌చే రికార్డులోకి తీసుకోబడినవి.
2. పైన తెలిపిన ఫైలింగ్స్ యొక్క ప్రతులు చీఫ్ ఇంజనీర్ (కమర్షియల్ & ఆర్ఎసి) కార్యాలయం, రూం నెం. 149, 'ఎ' బ్లాక్, TSTRANSCO, విద్యుత్ సౌధ, హైదరాబాద్-500 082 నందు మరియు చీఫ్ ఇంజనీర్ / (మెట్రో జోన్, రూరల్ జోన్, కరీంనగర్ మరియు వరంగల్ జోన్) మరియు సూపరింటెండింగ్ ఇంజనీర్/ OMC/ TSTRANSCO (ఖమ్మం, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, నల్గొండ, మహబూబ్‌నగర్, వరంగల్, హైదరాబాద్‌లోని మెట్రో తూర్పు, మెట్రో వెస్ట్, మెట్రో సెంట్రల్ మరియు సంగారెడ్డి) వద్ద లభిస్తాయి. ఆసక్తి గల వ్యక్తులు సదరు ఏదేని కార్యాలయంనందు కార్యాలయ పని వేళల్లో సదరు ఫైలింగ్స్‌ను ఉచితంగా తనిఖీ చేసుకోవచ్చును / చదువుకోవచ్చును మరియు నోట్ చేసుకోవచ్చును. ఈ ప్రతిపాదనలు వెబ్‌సైట్: www.tstransco.in నందు కూడా లభిస్తాయి మరియు వీటిని www.tserc.gov.in నందు చూడవచ్చును. టిఎస్‌ట్రాన్స్‌కో బిజినెస్ కొరకు రూ. 300/-లు మరియు ఎస్ఎల్‌డిసి ఫైలింగ్స్ కొరకు రూ. 50/-ల నగదును చెల్లించి ఈ ఫైలింగ్స్ యొక్క హార్డ్ కాపీలను పైన తెలిపిన కార్యాలయాల నుండి పొందవచ్చు.
3. సదరు ఫైలింగ్స్ మీద అక్షేపణలు / సూచనలు ఏవైనా ఉంటే, వాటిని మద్దతు మెటీరియల్‌తో పాటు చీఫ్ ఇంజనీర్ / కమర్షియల్ & RAC, రూం నెం. 149, 'ఎ' బ్లాక్, TSTRANSCO, విద్యుత్ సౌధ, హైదరాబాద్ - 500 082 వారికి 10.01.2020, సా॥ 5.00 గం॥లోపు చేరునట్లు స్వయంగా లేదా రిజిస్టర్డ్ పోస్టు ద్వారా దాఖలు చేయవలెను. వాటి కాపీని తప్పనిసరిగా పైన తెలిపిన సింగరేణి భవన్, రెడ్ హిల్స్ చిరునామా వద్ద సెక్రటరీ (FAC), TSERC వారికి కూడా దాఖలు చేయవలెను. అక్షేపణలు / సూచనల మీద తగువిధంగా సంతకం చేయవలెను మరియు సదరు అక్షేపణలు / సూచనలను పంపిస్తున్న వ్యక్తి(వ్యక్తుల) పూర్తి పేరు మరియు తపాలా చిరునామాను వాటిలో పేర్కొనవలెను. ఏదేని సంస్థ లేదా ఏదేని కంజ్యూమర్స్ కేటగిరీ తరపున అక్షేపణలు / సూచనలు దాఖలు చేయబడినట్లయితే, అవిషయాన్ని స్పష్టంగా పేర్కొనవలెను. అక్షేపణదారు స్వయంగా విచారణలో పాల్గొనదల్చినట్లయితే, అవిషయాన్ని కూడా నిర్దిష్టంగా పేర్కొనవలెను. అక్షేపణ / సూచనతో పాటు దిగువ తెలిపిన పట్టికను జతపర్చవలెను.

అక్షేపణదారు పేరు మరియు పూర్తి చిరునామా	అక్షేపణ(లు)/ సూచన(ల)/ యొక్క సంక్షిప్త వివరాలు	2019-20 నుండి 2023-24 వరకు గల వ్యవధికి SLDC యాక్టివిటీ కొరకు వార్షిక రుసుము మరియు ఆపరేటింగ్ చార్జీలను మరియు ట్రాన్స్‌మిషన్ బిజినెస్ కొరకు ARR మరియు టారిఫ్‌ను నిర్ణయించటానికి TSTRANSCOచే దాఖలు చేయబడిన ఫైలింగ్స్ మీద అక్షేపణలు	అక్షేపణ కాపీ మరియు TSTRANSCO కార్యాలయం వద్ద డెలివరీ యొక్క రుజువు జతచేయబడిందా (అవును /కాదు)	అక్షేపణదారు స్వయంగా విచారణలో పాల్గొనదల్చారా (అవును/కాదు)

4. ఫైలింగ్స్ యొక్క సంగ్రహం షెడ్యూల్స్ I (ట్రాన్స్‌మిషన్ బిజినెస్) మరియు II (SLDC యాక్టివిటీ) నందు సూచించబడినవి.
5. తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ 07.02.2020 న ఉ. 11.00 గం.ల నుండి కోర్టు హాల్, TSERC, # 11-4-660, 5వ అంతస్తు, సింగరేణి భవన్, రెడ్ హిల్స్, హైదరాబాద్-500 004 వద్ద ఒక బహిరంగ విచారణను నిర్వహించాలనుకుంటున్నది.

ప్రదేశం: హైదరాబాద్
తేది: 10.12.2019

సం/-
చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్
TSTRANSCO

షెడ్యూలు-I
ట్రాన్స్‌మిషన్ వ్యాపారం కొరకు ARR/ ట్రాన్స్‌మిషన్ చార్జీలు

	వివరములు	2019-20	2020-21	2021-22	2022-23	2023-24
A)	ARR/ట్రాన్స్‌మిషన్ చార్జీలు					
	1) ట్రాన్స్‌మిషన్ వ్యాపారం యొక్క ARR (రూ. కోట్లలో)	2012.08	2828.18	3345.98	3974.39	4274.77
	2) ట్రాన్స్‌మిషన్ కాంట్రాక్టెడ్ సామర్థ్యం (MW)	15235	17564	17569	19588	21114
	3) ట్రాన్స్‌మిషన్ చార్జీలు (రూ./KW/ నెలకు)	110.05	134.19	158.71	169.09	168.72
B)	లక్షిత ట్రాన్స్‌మిషన్ నష్ట శ్రేణి (%)	3.25 +/-0.2	3.24 +/-0.2	3.23 +/-0.2	3.22 +/-0.2	3.21 +/-0.2
C)	మూలధన పెట్టుబడులు (రూ. కోట్లలో)	3521.67	3968.20	3120.93	1669.57	1397.91

షెడ్యూలు-II
SLDC కార్యకలాపం కొరకు వార్షిక ఫీజు మరియు ఆపరేటింగ్ చార్జీలు

	వివరములు	2019-20	2020-21	2021-22	2022-23	2023-24
1	మొత్తం ఆపరేటింగ్ చార్జీలు (రూ. కోట్లలో)	57.09	40.67	43.66	48.38	51.99
2	ఉత్పత్తి సామర్థ్యం (MW)	16540	18892	18924	20979	22537
3	ఆపరేటింగ్ చార్జీలు (రూ./MW/ నెలకు)	2876.57	1794.04	1922.49	1921.72	1922.54
4	మొత్తం మూలధన వ్యయం (రూ. కోట్లలో)	6.36	8.89	9.90	10.26	10.51
5	వార్షిక ఫీజు (రూ./MW/ నెలకు)	3844	4708	5233	4890	4662

R.O.No. 39/19

జమ్ముకశ్మీర్‌లో స్థానిక ప్రభుత్వం, అధికారులు తీసుకునే నిర్ణయాలకు అనుగుణంగా జైళ్లలోని వారంతా విడుదలవుతారు. అందులో కేంద్ర ప్రభుత్వ జోక్యం ఉండదు. ఏ ఒక్కరిని కూడా ప్రత్యేకంగా జైళ్లలో నిర్బంధించాలని మేం భావించటం లేదు.

అమిత్ షా, కేంద్ర మంత్రి

పౌరసత్వ సవరణ బిల్లు విషయంలో మద్దతు ప్రకటించటాన్ని జేడీ(యూ) నాయకత్వం పునరాలోచించాలి. బిల్లు రాజ్యాంగ వ్యతిరేకం. వివక్షాపూరితమైనది. దేశ ఐక్యతకు, సభాతృత్వానికీ వ్యతిరేకం ఆ బిల్లు. లౌకికభావనలకు కట్టుబడిన జేడీయూ బిల్లును వ్యతిరేకించాలి. గాంధీ ఉన్నా దీన్ని పూర్తిగా వ్యతిరేకించేవారు.

ప్రశాంత్ కిషోర్, జేడీయూ ఉపాధ్యక్షుడు

చరిత్రలో నేడు



1730

ప్యారిస్‌లో వోల్టేర్ రచించిన 'బ్రూటస్' నాటక ప్రదర్శన.

1792

రాజ్యానికి వ్యతిరేకంగా ద్రోహ చర్యలకు పాల్పడ్డాడని ఫ్రాన్స్‌రాజు 14వ లూయీ విచారణ.

1946

ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో 'యూనిసెఫ్' ఏర్పాటు.

కెనడాలో ఈ సిగరెట్ల దుష్ప్రభావాన్ని గుర్తించి అరికట్టడానికి ప్రయత్నం సాగుతున్నది. ఈ సిగరెట్ల దుష్ప్రభావం కనిపిస్తూనే ఉన్నది. అమెరికాలో ఈ సిగరెట్ల బారిన పడి అనారోగ్యానికి గురై చికిత్స పొందుతున్నవారు రెండు వేల వరకున్నారు. వీరిలో 47 మంది మరణించారు. ఈ సిగరెట్లు తాగే వారిలో 70 శాతం మంది పొగాకు సిగరెట్లకు అలవాటు పడుతున్నార ని వెల్లడైంది. కెనడాలో ఈ సిగరెట్లపై కొత్త నియంత్రణ నిబంధనలను జనవరిలో అమలు చేస్తారంటున్నారు. గతంలో పొగాకుపై మాదిరిగానే ఇప్పుడు ఈ సిగరెట్‌లపై కూడా కఠిన నిబంధనలను అమలు చేయాలె.

టొరంటో స్టార్

బొలివియాలో మొరేల్స్ ప్రభుత్వాన్ని సైన్యం కూల్చివేసిన తర్వాత అధికారం చేపట్టిన జీనైన్ అనీజ్ చావెజ్ వెంటనే ఎన్నికలు జరిపిస్తామనే వాగ్దానాన్ని విస్మరించారు. తనకు పోటీచేసే హక్కు ఉన్నప్పటికీ, విరమించుకుంటున్నానని విదేశంలో తలదాచుకున్న మొరేల్స్ ప్రకటించారు. ఇప్పుడు తమ పార్టీలోని వారసుడిని గుర్తించడం ఆయన బాధ్యత. మొరేల్స్ ప్రభుత్వం కూలిపోయిన తర్వాత బొలివియాలో వామపక్ష, రైటిస్టు పక్షాల మధ్య పోరాటం చెలరేగుతున్నది. ఈ పోరాటం ఇతర లాటిన్ అమెరికా దేశాలకు వ్యాపించే అవకాశం ఉన్నది.

ది న్యూయార్క్ టైమ్స్

'పౌరసత్వ సవరణ'

వివాదాస్పద పౌరసత్వ సవరణ బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. బిల్లుపై సుదీర్ఘ చర్చ అనంతరం విపక్షసభ్యుల తీవ్ర అభ్యంతరాలు, నిరసనల మధ్య 311-80 తేడాతో బిల్లుకు ఆమోదముద్ర పడింది. దీంతో పాకిస్థాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్థాన్ దేశాల్లో మతపరమైన వేధింపులు ఎదుర్కొని 2014 డిసెంబర్ 31లోపు భారత్‌లో అడుగుపెట్టిన హిందువులు, సిక్కులు, బౌద్ధులు, జైనులు, పార్శీలు, క్రైస్తవులను అక్రమ శరణార్థులుగా భావించబోమని హోంమంత్రి ప్రకటించారు. వారికి పౌరసత్వం కల్పిస్తామంటూ, రేషన్‌కార్డు సహా ఎలాంటి పత్రాలు లేనప్పటికీ భారతీయ పౌరసత్వం కల్పిస్తామనటం గమనించదగినది. ప్రభుత్వం తలపెట్టిన బిల్లులో సవరణల ప్రతిపాదనలను సభ మూజువాణి ఓటుతో తిరస్కరించటం, బిల్లు విషయంలో ప్రభుత్వం ఎంత కఠినంగా వ్యవహరించదల్చుకున్నదో చెప్పకనే చెప్పింది. గతంలోనూ ఇలా ప్రతిపక్షాలు వ్యతిరేకిస్తున్నా అధికారపార్టీ బిల్లులను నెగ్గించుకున్న ఉదంతాలుండవచ్చు. కానీ ఈ పౌరసత్వ సవరణ బిల్లు అతి సున్నితమైనది. దేశ సామాజిక జీవనంపై, శాంతిభద్రతలపై తీవ్ర ప్రభావం చూపేది. పౌరసత్వ సవరణ బిల్లు విషయంలో బీజేపీ దశాబ్దాలుగా చెబుతున్న హిందుత్వవాదాన్ని గెలిపించుకోవటంలో చూపిన శ్రద్ధ, ప్రజల అభిప్రాయాలను గౌరవించటంలో చూపించలేదని తెలిసిపోతున్నది. ఎందుకంటే గతంలో అనేక సందర్భాల్లో బీజేపీకి మద్దతుగా నిల్చిన పార్టీలు కూడా ఈ బిల్లుకు వ్యతిరేకంగా ఓటేశాయి. లౌకికస్ఫూర్తిని గౌరవించే పార్టీగా టీఆర్ఎస్ పౌరసత్వ బిల్లును వ్యతిరేకిస్తూ పౌరసత్వ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ఓటేసింది. రాజ్యాంగంలో ప్రబోధించిన సమానహక్కుకు ఈ బిల్లు వ్యతిరేకమైనదిగా ప్రకటించింది.

అస్సాంలోని బెంగాళీలను వారి స్వస్థలాలకు పంపించాలని అంటే పశ్చిమబెంగాల్‌కు పంపించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ సమస్యను మతంతో ముడేసి పౌరపట్టిక, పౌరసత్వ సవరణ బిల్లుల రూపంలో మత సంబంధమైన విషయంగా బీజేపీ మారుస్తున్నది. అందుకే దేశంలోని ముస్లింలంతా ప్రభుత్వం తలపెట్టిన పౌరసత్వ సవరణ బిల్లును అనుమానిస్తున్నారు. ఈ బిల్లుతో దేశంలోని ముస్లింలకు ఏ సంబంధం లేదని ప్రభుత్వం అంటున్నప్పటికీ, పౌరసత్వం అనే దాన్ని మెడమీది కత్తిలా మార్చి ఒక సమూహాన్ని తీవ్ర అభద్రతలోకి నెట్టడంగా ముస్లిం సమాజం భావిస్తున్నది.

పౌరగణన పట్టికను, పౌరసత్వ సవరణ బిల్లును తీవ్రంగా వ్యతిరేకిస్తున్న పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీ తమ రాష్ట్రంలో దాన్ని అమలుచేయబోమని ప్రకటించారు. ఈశాన్య రాష్ట్రాల్లో పౌరసత్వ సవరణ బిల్లుపై తీవ్ర నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ప్రతిపాదిత చట్టం మూలంగా చొరబాటుదారులతో ఈశాన్య రాష్ట్రాల్లో జనాభా నిష్పత్తిలో తీవ్ర తేడాలు సంభవిస్తాయని భయపడుతున్నారు. ఫలితంగా ఈశాన్య రాష్ట్రాల సాంస్కృతిక జీవనమే ప్రమాదంలో పడుతుందని ఆందోళన చెందుతున్నారు. అస్సాంలోనైతే ఆల్‌మోరాన్ విద్యార్థి సంఘం 48 గంటల బంద్‌కు పిలుపునిచ్చింది. ఈ బిల్లు పరిధిలో లేని మణిపూర్‌ను 'ఇన్నర్‌లైన్ పర్మిట్'లోకి తెస్తున్నామని ప్రధాని నరేంద్ర మోదీ హామీ ఇచ్చినా ఈశాన్య భారతంలోని రాష్ట్రాల్లో తీవ్ర అభద్రతా భావం నెలకొన టం గమనార్హం. యాభయవ దశకంలో నెహ్రూ-పాక్ ప్రధాని లియాఖత్ అలీ ఖాన్ మధ్య కుదిరిన ఒప్పందాన్ని ఇరు దేశాల్లో చిత్తశుద్ధిగా అమలైతే నేటి సమస్యలే ఉండేవి కావు. ఆ ఒప్పం దం ప్రకారం ఇరుదేశాల్లో ఉన్న మైనారిటీవర్గాలకు అన్నివిధాలా రక్షణలు కల్పించాలి. ప్రభుత్వ ఉద్యోగాలు, రాజకీయాలు, సాయుధ బలగాల్లో చేర్చుకోవటంతో పాటు అన్ని హక్కులు, స్వేచ్ఛలను కల్పించాలి. దేశ విభజన సమయంలో రెండుదేశాల్లో ఉండిపోయిన వారు స్వేచ్ఛగా ఇరుదేశాల్లో రాకపోకలు సాగించేలా చూడాలి. ఒక దేశం నుంచి మరో దేశానికి పోదల్చినవారికి ఇరుదేశాలూ రక్షణ కల్పించాలి. ఇలా చేసినప్పుడే ఇరు దేశాల్లోని మైనారిటీలుగా ఉన్నవారు సురక్షితంగా ఉన్నట్లు భావిస్తారని ఆ ఒప్పందంలో రాసుకున్నారు. కానీ నెహ్రూ-లియాఖత్ ఒప్పంద స్ఫూర్తిని ఆ తర్వాతకాలంలో పూర్తిగా మర్చిపోయారు. మైనారిటీలు పూర్తిగా అభద్రతలో జీవించే పరిస్థితులు కల్పించటమే నేటి సమస్యకు కారణం.

బీజేపీ పౌరసత్వ సవరణ బిల్లు విషయంలో ఏమి చెప్పినా వివక్షాపూరిత విధానం తెలిసిపోతూనే ఉన్నది. ఈ బిల్లు ప్రకారం 2014 డిసెంబర్ 31కి ముందు వచ్చిన అని పేర్కొన్న ప్రజా సమూహాల్లో ముస్లింలు మాత్రమే ఎందుకు లేరన్న దానికి సంతృప్తికరమైన సమాధానం ప్రభుత్వం దగ్గరలేదు. దానికి దేశం మత ప్రాతిపదికన విడిపోవటమే ప్రాతిపదిక అన్నట్లుగా మాట్లాడటం బాధ్యతాయుత ప్రభుత్వ విధానం కాదు. నిజానికి అస్సాంతో సహా మిగతా ఈశాన్యరాష్ట్రాల్లోని వలసలన్నీ జీవనోపాధి కోసం వెతుకులాటలో జరిగినవే. మత ప్రాతిపదికన జరిగిన చొరబాట్లుగా చెప్పాలనుకోవటం సమస్యను పక్కదారి పట్టించటం. వాస్తవానికి అస్సాంతో సహా మిగతా రాష్ట్రాలన్నీ చొరబాట్లతో తమ హక్కులు, ఉద్యోగాలు కోల్పోతున్నామని మాత్రమే అంటున్నారు. అస్సాంలోని బెంగాళీలను వారి స్వస్థలాలకు పంపించాలని అంటే పశ్చిమబెంగాల్‌కు పంపించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ సమస్యను మతంతో ముడేసి పౌరపట్టిక, పౌరసత్వ సవరణ బిల్లుల రూపంలో మత సంబంధమైన విషయంగా బీజేపీ మారుస్తున్నది. అందుకే దేశంలోని ముస్లింలంతా ప్రభుత్వం తలపెట్టిన పౌరసత్వ సవరణ బిల్లును అనుమానిస్తున్నారు. ఈ బిల్లుతో దేశంలోని ముస్లింలకు ఏ సంబంధం లేదని ప్రభుత్వం అంటున్నప్పటికీ, పౌరసత్వం అనే దాన్ని మెడమీది కత్తిలా మార్చి ఒక సమూహాన్ని తీవ్ర అభద్రతలోకి నెట్టడంగా ముస్లిం సమాజం భావిస్తున్నది. అందుకే ఇంతటి వ్యతిరేకత.

జనగళం

భవనాలను ఆధునీకరించాలె

రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాలు కొన్ని ప్రైవేట్ బిల్డింగుల్లో కొనసాగుతున్నాయి. కాబట్టి పాత ప్రభుత్వ భవనాలను కూల్చివేసి వాటి స్థానంలో కొత్త భవనాలను కట్టాల్సిన అవసరం ఉన్నది. అలాగే నిరుపయోగంగా ఉంటున్న భవనాల పరిసర ప్రాంతాలు చెత్తాచెదారంతో నిండి ఉంటున్నాయి. అవి అలాగే కొనసాగితే విషకీటకాలైన పాములు తేళ్లు విరివిగా పుట్టుకొచ్చే ప్రమాదం పొంచి ఉన్నది. కాబట్టి నిరుపయోగంగా ఉన్న భవనాల న్నింటినీ కూల్చివేసి వాటి స్థానంలో అధునాతన భవనాలను నిర్మించాల్సిన అవసరం ఉన్నది. ఇలాంటి భవనాలను ప్రజల అవసరాలైన లైబ్రరీలు, పోలీస్‌స్టేషన్లు, తహసీల్దార్ కార్యాలయాల కోసం ఉపయోగిస్తే బాగుంటుంది.

- షేక్ అస్లాం షరీఫ్, శాంతినగర్, హైదరాబాద్

మాటతీరు మారాలె

ఆధునిక ప్రపంచంలో చాలా మార్పు వచ్చింది. స్వార్థం పెరిగిపోయి విలువలు సన్నగిల్లుతున్నాయి. దుర్మార్గం, పైశాచికం, అసూయ, మోసం చేయడం లాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నారు. డబ్బు సంపాదించాలన్న విపరీత ఆలోచన, గొంతెమ్మ కోరికలతో చేయకూడని పనులెన్నో చేస్తున్నారు. దాంతో కుటుంబ సంబంధాలు సన్నగిల్లి చిన్న విషయాలను పెద్దవి చేస్తూ కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారు. ఈ ధోరణి మారాలంటే ఆవేశం, అహంభావాలకు తావివ్వకుండా మంచితనం, మానవత్వం అలవర్చుకోవాలి. మనిషి మాట తీరునుబట్టి వ్యక్తి స్వభావాన్ని అంచనా వేయచ్చు. కొంతమంది 'నేనింతే'నంటూ ఎక్కువ దురుసుతనంతో మాట్లాడుతుంటారు. అలాంటివారికి దూరంగా ఉండటం మంచిది. ఇంకొంతమంది ఇప్పుడు జనరేషన్ మారింది మీకంటే మాకే ఎక్కువ తెలుసు అని వాదిస్తుంటారు. ఇలాంటివాళ్లు పెద్దల నుంచి సరైన సమాచారాన్ని అందుకోలేకపోతున్నారు. ఒక పద్ధతిగా మాట్లాడటం నేర్చుకొని మంచి నడవడికను అలవర్చుకుంటే సమాజంలో మంచి పేరు సంపాదించవచ్చు. మనలోని రాక్షసత్వం విడనాడి జాలి, దయ, ప్రేమ, వాత్సల్యం అలవాటు చేసుకుంటే జీవితానికి సార్థకత ఏర్పడుతుంది. ఆ దిశగా యువత అడుగులు వేయాలి.

- కాయల నాగేంద్ర, హైదరాబాద్

ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7.8.9. కృష్ణాపురం, రోడ్‌నంబర్.10. బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@ntnews.com Fax-040-23291118

ఉద్యాన పరిశోధనలకు ఊతం

సాగునీటి విస్తీర్ణంలో వరి పంటను మాత్రమే పండించకుండా చూడాలి. వరి సాగుతో ఇప్పటికే రాష్ట్రానికి కావాల్సిన బియ్యం, అపరాలు తీరి మిగులు ఉన్నది. ఒకటి ఇతర దేశాలు, రాష్ట్రాలకు మన వరి ధాన్యాన్ని ఎగుమతి చేయాలి. క్వింటాలు వరిని ఉత్పత్తిని చేయాలంటే దాదాపు 5000 లీటర్ల నీరు కావాలి. కోట్లాది రూపాయలు ఖర్చుచేసి నిర్మిస్తున్న నీళ్లను అనుత్పాదకతకు వాడుకోవద్దు.

విశ్లేషణ

డాక్టర్ పిడిగెం సైదయ్య

ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని రైతు అభివృద్ధి, సంక్షేమానికి చిరునామాగా తీర్చిదిద్దారు. నేడు తన చేతుల మీదుగా ములుగులో శ్రీకొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయాన్ని, అటవీ కళాశాలలను ప్రారంభించనున్నారు. కేసీఆర్ కోటి ఎకరాల మాగాణి కల్పనతో రాష్ట్ర రైతాంగాన్ని, వ్యవసాయాన్ని ఒడ్డుకు చేర్చే ప్రణాళికలతో ముందుకు సాగుతున్నారు. రైతుబంధు, రైతుబీమా పథకాలతో రైతులకు భరోసా ఇచ్చారు. ప్రస్తుతం వ్యవసాయంలో పరిశోధన, అభివృద్ధి, మెరుగైన ఉపాధి కల్పనపై దృష్టిసారించారు. వ్యవసాయంలో చేపట్టిన సంస్కరణలతో ఇప్పుడు వ్యవసాయం సజావుగా సాగుతున్నది.

పెరుగుతున్న సాగునీటి సౌకర్యంతో వచ్చే రెండు ప్రధాన అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. సాగునీటి విస్తీర్ణంలో వరి పంట మాత్రమే పండించకుండా చూడాలి. వరి సాగుతో ఇప్పటికే రాష్ట్రానికి కావాల్సిన బియ్యం అవసరాలు తీరి మిగులు ఉన్నది. ఒకటి ఇతర దేశాలు, రాష్ట్రాలకు మన వరి ధాన్యాన్ని ఎగుమతి చేయాలి. అలాగే కిలో వడ్లను ఉత్పత్తిని చేయాలంటే దాదాపు 5000 లీటర్ల నీరు కావాలి. కోట్లాది రూపాయలు ఖర్చుచేసి నిర్మిస్తున్న నీళ్లను అనుత్పాదకతకు వాడుకోవద్దు. దీనికి బదులుగా రైతులకు మరింత ఆదాయాన్ని అందించే పంటల సాగును ప్రోత్సహించాల్సిన అవసరం ఉన్నది. అట్లనే రాష్ట్రంలో ఉద్యాన పంటలు సాగుచేయడానికి అపారమైన అవకాశాలున్నాయి. వీటిని రైతులకు ఆదాయమార్గాలుగా మార్చాలి. రాష్ట్రంలో సుమారు 48 శాతం ఎర్రనేల లున్నాయి. ఉద్యానపంటలు పండించడానికి ఈ నేలలు అత్యంత అనుకూలమైనవి.

వినియోగదారుల ఆహారపుటలవాట్లు మారుతున్నాయి. ఈ నేపథ్యంలో ఉద్యాన పంటల విస్తీర్ణాన్ని పెంచాలి. దాదాపు అన్ని ఉద్యాన పంటలు-పంటల వారీగా ఉత్పత్తి అంతా ఒకే సమయంలో రాదు. దఫాలుగా వస్తుంది. దీనివల్ల ధరలు ఒకేసారి పడిపోవు. మనిషి ఆరోగ్యంగా ఉండాలంటే రోజూ 400 గ్రాముల పండ్లు, కాయగూరలు కలిపి తీసుకోవాలి. సంవత్సరానికి ఒక వ్యక్తి సరాసరి 146 కిలోలు తీసుకోవాలి. అందులో 300 గ్రాములు కాయగూరలు, 100 గ్రాముల పండ్లు ఉండాలి. కాయగూరల్లో 50 గ్రాముల ఆకుకూరలు, మరో 50 గ్రాములు దుంపలు, మిగిలినవి ఇతర కూరగాయలు. అయితే ఇందులో కొంత ఇబ్బంది ఉన్నది. కూరగాయలు, పండ్లు ఎక్కువకాలం నిల్వ ఉండవు. పొలం నుంచి రైతుకు చేరే లోపు దాదాపు 30 శాతం వరకు ఉత్పత్తులు దెబ్బతింటున్నాయి. ఈ పంట కోత అనంతర నష్టాలు తగ్గించేందుకు ఇప్పటికే ముఖ్యమంత్రి నియోజకవర్గానికి ఒక ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుచేస్తామని ప్రకటించారు. తెలంగాణ ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీని కూడా రూపొందించారు. ఆకుకూరల నుంచి పండ్ల వరకు క్యానింగ్, బాట్లింగ్, విలువల జోడింపులో వాడుకోవచ్చు. దీంతో పంట కోత అనంతరం నష్టాలను గణనీయంగా తగ్గించవచ్చు. యువతకు కూడా ఉపాధి అవకాశాలు విస్తృతంగా మెరుగవుతాయి. వినియోగదారులకు ఏడాదంతా ఉత్పత్తులు లభిస్తాయి. కాబట్టి ధరలు విపరీతంగా పెరుగుదల అనేది ఉండదు. రైతులు కూడా రాష్ట్ర అవసరాల మేరకే పండిస్తారు.

ఒక్క టమాటా తీసుకుంటే వానకాలం సాగు విస్తీర్ణం పెరుగుతుంది. దీనివల్ల ఉత్పత్తి పెరిగి ధరలు తక్కువగానే ఉంటాయి. యాసంగిలో

సాగునీటి సౌలతి ఆధారంగానే పండిస్తారు. ఉత్పాదకత పెరుగటం వల్ల ధరలు అందుబాటులోనే ఉంటాయి. ఎండకాలంలో నీటి కొరత ఉంటుంది. అట్లనే అధిక వేడిని తట్టుకొని దిగుబడిని ఇచ్చే రకాలు లేవు. దీంతోపాటు వైరస్ తెగుళ్ల తాకిడి ఎక్కువగా ఉంటుంది. దీంతో దిగుబడులు, ఉత్పాదకత రెండూ తగ్గిపోయి ధరలు పెరుగుతాయి. దీనికిబదులుగా వానకాలం, యాసంగి ఉత్పత్తులకు ప్రాసెసింగ్ ద్వారా విలువల జోడింపు చేస్తే టమాటాను ఒరుగులు, కచప్, సాస్ రూపంలో ఏడాదంతా వాడుకోవచ్చు. ధరలు కూడా అందుబాటులో ఉంటాయి. పసుపు ఉత్పత్తిలో రాష్ట్రం మొదటిస్థానంలో, ఎండుమిరప ఉత్పత్తిలో రెండోస్థానంలో ఉన్నది. వీటికి అంతర్జాతీయంగా, దేశీయంగా మంచి డిమాండు ఉన్నది. అయితే రాష్ట్ర ప్రభుత్వమే గిట్టుబాటు ధర కల్పించాలంటే సాధ్యం కాదు. కొన్ని ప్రైవేటు ఫుడ్ ప్రాసెసర్లు తమ బ్రాండ్లతో మంచి లాభాలు పొందుతున్నాయి. పోషకాలు, యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉన్న పండ్లు కివి, డ్రాగన్‌ఫ్రూట్, ఆపిల్, పర్సిమన్ వంటి వాటిని మాల్స్‌లో అధికంగా కొంటున్నారు. ఎగ్జోటిక్ కూరగాయలకు మేలైన డిమాండు ఉన్నది. కాబట్టి భవిష్యత్తులో ఉద్యానపంటలు భారీగా పండిస్తున్న రాష్ట్రాలను అధిగమించే సామర్థ్యం తెలంగాణ రాష్ట్రానికి ఉన్నది. కాబట్టి ఎప్పుడూ మూసధోరణి పంటలైన వరి, మక్కజొన్న పంటలకే పరిమితం కాకుండా రైతులకు ఎక్కువ ఆదాయాన్నిచ్చి, ఎక్కువగా ఉత్పాదకతను పదే పదే చెబుతుంటారు. అందుకే వారిని తీర్చిదిద్దేందుకు అవసరమైన అటవీ కళాశాల, పరిశోధన సంస్థను చొరవ తీసుకొని ఏర్పాటుచేశారు. భవిష్యత్తులో తెలంగాణ బిడ్డల ఉజ్వల భవిష్యత్తుకు ఈ కళాశాల చిరునామా కానున్నది.

తెలంగాణ రాష్ట్రం ఇప్పటికే వ్యవసాయ అనుకూల పథకాలు తెచ్చింది. సంస్కరణలు అమలు చేస్తున్నది. తెలంగాణ ఉద్యాన, అటవీ రంగాల అభివృద్ధికి తగిన చర్యలు తీసుకుంటున్నది. శాస్త్రీయ పరిశోధనల ద్వారా వ్యవసాయ, ఉద్యాన పంటల ఉత్పాదకతలను పెంచడానికి ప్రయత్నిస్తున్నది. వ్యవసాయ అనుబంధరంగాల్లో ఉపాధి అవకాశాలు పెంచడం, రైతులకు అదనపు ఆదాయం పెంచడమే లక్ష్యంగా పనిచేస్తున్నది. ఉద్యాన విశ్వవిద్యాలయం, అటవీ కళాశాల ఏర్పాటు వ్యవసాయ అభివృద్ధికి ఇతోధికంగా తోడ్పడుతాయి.

(వ్యాసకర్త: శాస్త్రవేత్త, ఉద్యాన విశ్వవిద్యాలయం)

అటవీ కళాశాల, పరిశోధన కేంద్రాన్ని కూడా ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారు. దేశవ్యాప్తంగా అటవీ విస్తీర్ణం పెరుగాలి. పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించాలంటే, వాతావరణంలో వస్తున్న మార్పులకు అడ్డుకట్ట వేయాలంటే అడవుల శాతం పెరుగాలి. దీనికి అనుగుణంగా పెద్ద సంఖ్యలో అటవీ శాస్త్ర నిపుణులు అవసరం. అయితే ప్రస్తుతం దేశంలో కేవలం వేళ్ల మీద లెక్కించగలిగే సంఖ్యలోనే అటవీ కళాశాలలు ఉన్నాయి. ఉత్తరాఖండ్, తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాల్లో పేరుగాంచిన అటవీ కళాశాలలున్నాయి. వీటిలో తమిళనాడులోని మెట్టుపాల్సంలోని అటవీ కళాశాలలో చదివిన విద్యార్థులు వందకుపైగా భారత ప్రభుత్వం నిర్వహించే ఇండియన్ ఫారెస్ట్ సర్వీసెస్‌కు ఎంపికయ్యారు. తెలంగాణ బిడ్డలు కూడా అన్ని రంగాల్లో ముందుండాలని ముఖ్యమంత్రి పదేపదే చెబుతుంటారు. అందుకే వారిని తీర్చిదిద్దేందుకు అవసరమైన అటవీ కళాశాల, పరిశోధన సంస్థను చొరవ తీసుకొని ఏర్పాటుచేశారు.

అస్థిరతా చరిత్రలో మరో ఘట్టం

అంతర్జాతీయం

మార్టిన్ డబ్ల్యు. బ్రియెనెన్

బొలివియాలో తిరుగుబాటు వల్ల దేశాధ్యక్షుడు పదవీచ్యుతుడు కావడం ఇది మొదటిసారి కాదు. ఇవో మొరేల్స్ కన్నా ముందున్న గొంజాలో సాంచెజ్ డి లొజాదా, కార్లోస్ మెసా ప్రజల నిరసనల మధ్య రాజీనామా చేయవలసి వచ్చింది. 1870 నుంచి ఏడుగురు బొలివియా అధ్యక్షులు తిరుగుబాట్ల మూలంగా రాజీనామా చేయవలసి వచ్చింది. బొలివియాలో ప్రజల శక్తి అత్యంత బలమైనది. 2005లో దేశాధ్యక్ష పదవికి రాజీనామా చేసిన మెసా తమ దేశం పరిపాలనా సాధ్యమైంది కాదని స్పష్టంచేశారు. ఇప్పుడు బొలివియా తాత్కాలిక అధ్యక్షురాలిగా జీమైన్ అనీజ్ అధికారం చేపట్టారు. ఆమె పరిస్థితి కూడా ఇదేవిధంగా ఉన్నది. నవంబర్ 11వ తేదీన ఆమె అధికారం చేపట్టిన నాటినుంచి తీవ్ర నిరసనలు సాగుతున్నాయి. శాసన వ్యవస్థలోని ఉభయసభల్లోనూ పదవీచ్యుతుడైన మొరేల్స్ నాయకత్వంలోని సోషలిస్టు పార్టీకి మూడింట రెండువంతుల మెజారిటీ ఉన్నది. బొలివియాలో ప్రతిపక్షం అత్యంత బలహీనంగా ఉన్నది. ఈ ప్రతిపక్షానికి చెందిన సెనేటర్ అనీజ్. ఈమెకు దేశాధ్యక్ష పదవి చేపట్టినప్పటికీ ఏ మాత్రం శక్తిమంతురాలు కాదు. ఆమె ఎటువంటి అధికారాలు లేవు. చట్టసభల ద్వారా ఏ బిల్లును ఆమోదించుకునే పరిస్థితి లేదు. మరోవైపు ఆమెకు వ్యతిరేకంగా రోజూ నిరసనలు సాగుతూనే ఉన్నాయి.

బొలివియా చరిత్ర పొడుగునా నిరసనలే కనిపిస్తాయి. భూమి పుత్రులు, గ్రామీణ రైతులకు అధికారంలో భాగస్వామ్యం లేదు. వారికి తమ గొంతు వినిపించే అవకాశం లేదు. 1952లో బొలివియా విప్లవం చోటు చేసుకున్న తర్వాత భూమి పంపిణీ అయినా, 1883లో చిలీ ఆక్రమించుకున్న తీరప్రాంతాన్ని తిరిగి స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేయడమైనా, చమురు, సహజవాయువు నిక్షేపాలను జాతీయం చేయాలని కోరడమైనా.. ఇవన్నీ వీధుల్లో నిరసనల ద్వారా సాధించుకున్నవే. బొలివియాలో పరిపాలనావ్యవస్థలు అత్యంత బలహీనమైనవి. పాలన సమర్థవంతంగా సాగాలంటే కొంతమేరకైనా ప్రజల భాగస్వామ్యం ఉండాలె. వారి వాదనలకు చోటు లభించాలె. బొలివియా భూమిపుత్రులు భారీ ఊరేగింపులు సాగిస్తారు. రోడ్లను దిగ్బంధం చేస్తారు. నగర ప్రాంతాలకు ఆహారం, ఇంధనం చేరకుండా రవాణాను అడ్డుకుంటారు. రహదారులపై బాంబులు పేలుస్తారు. ఈ విధంగా నగరాల్లో జనజీవనాన్ని స్తంభింపజేయగలరు. భూమిపుత్రులు సాగించే ఈ పోరాటాల వల్ల పలు ప్రభుత్వాలు ఉక్కిరిబిక్కిరి అయ్యాయి. బొలివియాలో ఇటువంటి ఉద్యమాల ద్వారానే ఇవో మొరేల్స్ అధికారానికి వచ్చారు. 2003లో, 2005లో సాగిన ఉద్యమాలలో మొరేల్స్ ఉన్నత నాయకుడిగా ఎదిగారు. ఆనాటి దేశాధ్యక్షులను పదవీచ్యుతులను చేయడంలో ఈ ఉద్యమాలు కీలక పాత్ర వహించాయి. అయితే మొరేల్స్‌కు వ్యతిరేకంగా కూడా ఇటువంటి ఉద్యమమే వచ్చింది. దీంతో ఆయన కూడా రాజీనామా చేయకతప్పలేదు.

అక్టోబర్ 20వ తేదీన జరిగిన ఎన్నికల్లో తాను విజయం సాధించినట్టు మొరేల్స్ ప్రకటించుకున్నారు. ఈ ఎన్నికలలో ఆయన విజయం సాధించారనడంలో సందేహమేమీ లేదు. అయితే ఆయన పది శాతం తేడాతో గెలిచారా లేదా అనేది. పది శాతం తేడా లేకపోతే మళ్ళా పోటీ పడవలసి వస్తుంది. పన్నెండేండ్ల కింద దేశాధ్యక్షుడిగా ఉన్న కార్లోస్ మెసాను తన నిరసనల ద్వారా గద్దె దింపి మొరేల్స్ అధికారానికి వచ్చారు. ఇటీవలి ఎన్నికలలో అదే కార్లోస్‌తో ఆయన తలపడవలసి వచ్చింది. మొరేల్స్ పది శాతం తేడాతో విజయం సాధించారని ఆయన మద్దతుదారులు అంటున్నారు. ప్రతిపక్ష నాయకులు, ఆర్గనైజేషన్ అమెరికన్ స్టేట్స్ (ఓఏఎస్) ప్రతినిధులు మాత్రం తేడా స్వల్పంగానే ఉన్నదని, మళ్ళా పోలింగ్ జరుపవలసిందేనని అంటున్నారు. నిరసనలు తీవ్ర రూపం దాల్చడంతో తాను మళ్ళా ఎన్నికలు జరుపడానికి సిద్ధమని మొరేల్స్ ప్రకటించారు. ఈలోగా పోలీసులు తిరుగుబాటు చేశారు. ఇదే అదనుగా ప్రతిపక్షాలు హింసాయుత ఆందోళనకు దిగాయి. మొరేల్స్‌కు వ్యతిరేకంగా సాగుతున్న ఆందోళనలను అదుపు చేయడానికి తాము రంగంలోకి దిగబోమని సైన్యం ప్రకటించింది. ప్రతిపక్ష ప్రదర్శనకారులు దోపిడీలకు, విధ్వంసాలకు పాల్పడ్డా సైన్యం చూస్తూ ఉన్నదే తప్ప నివారించలేదు. అధికార పార్టీ సభ్యుల ఇండ్ల కూల్చివేత కూడా సాగింది. పోలీసులు, సైన్యం సహాయ నిరాకరణ చేయడంతో మొరేల్స్ దేశాధ్యక్ష పదవికి రాజీనామా చేయకతప్పలేదు. పరిపాలనారంగంపై ఆయన అదుపు కోల్పోయారనేది స్పష్టమైపోయింది.

ప్రతిపక్షాలు మొరేల్స్ గద్దెదిగాలని భావించాయి. కానీ కార్లోస్‌కు వారి మద్దతు పూర్తిగా లేదు. మరోవైపు ఇప్పటికీ మొరేల్స్ మాత్రమే బొలివియాలో బలమైన నాయకుడు. పథ్నాలుగేండ్లు పాలించడం వల్ల, భూమి పుత్రులున్న ప్రాంతాలను సహజవాయువు కేందాల స్థాపనకు అప్పగించడం వల్ల ఆయన ప్రతిష్ఠ సన్నగిల్లినప్పటికీ, ఇప్పటికీ ఆయన అత్యంత ప్రజాదరణ కలిగి ఉన్నారు. ఇప్పుడాయన మెక్సికోలో తలదాచుకున్నారు. అక్కడినుంచి ట్వీట్స్ ద్వారా తమ మద్దతుదారులకు సూచనలు ఇస్తున్నారు. తాత్కాలిక అధ్యక్షురాలికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేయమ

నెహ్రూ-లియాఖత్ ఒప్పందం ఏమిటి?

న్యూఢిల్లీ: పౌరసత్వ సవరణ బిల్లుపై లోక్‌సభలో సోమవారం చర్చ సందర్భంగా హోం మంత్రి అమిత్‌షా పలుమార్లు నెహ్రూ-లియాఖత్ ఒప్పందాన్ని ప్రస్తావించారు. ఆ ఒప్పందం విఫలమైందన్నారు. ఆ ఒప్పంద స్ఫూర్తిని పాక్ కొనసాగించి ఉంటే ఈ బిల్లు అవసరం ఉండేది కాదన్నారు. భారత్, పాక్ ప్రధానులైన నెహ్రూ, లియాఖత్ అలీ ఖాన్ 1950లో ఢిల్లీలో ఒక ఒప్పందంపై సంతకాలు చేశారు. దాని ప్రకారం 1.శరణార్థులు స్వదేశం వెళ్లి తమ ఆస్తులను అమ్ముకొని సురక్షితంగా తిరిగి వచ్చేందుకు అనుమతించాలి. 2. అపహరించిన మహిళలను, లూటీ చేసిన సొమ్మును తిరిగివ్వాలి. 3. బలవంతపు మత మార్పిడులను గుర్తించరాదు. 4. మైనారిటీలకు హక్కులు కల్పించాలి. వీటిని అమలు చేసేందుకు ఉభయ దేశాలలో మైనారిటీ కమిషన్లను ఏర్పాటుచేశారు. ఈ ఒప్పందాన్ని వ్యతిరేకిస్తూ.. నాడు నెహ్రూ మంత్రివర్గంలో పరిశ్రమల శాఖ మంత్రిగా ఉన్న శ్యామా ప్రసాద్‌ముఖర్జీ తన పదవికి రాజీనామా చేశారు. ఆయన ఏర్పాటు చేసిన భారతీయ జన సంఘ్, బీజేపీగా రూపాంతరం చెందిన సంగతి తెలిసిందే.

నేడు రాజ్యసభకు 'పౌరసత్వ' బిల్లు

- ఆమోదంపై బీజేపీ ధీమా
- శివసేన, జేడీ(యూ), అన్నాడీఎంకే వైఖరిపై అస్పష్టత

న్యూఢిల్లీ: లోక్‌సభలో ఆమోదం పొందిన పౌరసత్వ సవరణ బిల్లును ప్రభుత్వం బుధవారం రాజ్యసభలో ప్రవేశపెట్టనుంది. లోక్‌సభలో సంపూర్ణ మెజారిటీతో బిల్లును ఆమోదింపజేసుకున్న బీజేపీ.. రాజ్యసభలో ఉన్న స్వల్ప మెజారిటీతో బిల్లును గట్టెక్కిస్తుందా అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. రాజ్యసభలో కూడా బిల్లు నిర్విఘ్నంగా ఆమోదం పొందుతుందని బీజేపీ దీమా వ్యక్తం చేస్తున్నది. రాజ్యసభలో ప్రస్తుతం 240 మంది సభ్యులుండగా, బిల్లు ఆమోదం పొందడానికి కనీసం121 మంది మద్దతు తెలుపాలి. అయితే లోక్‌సభలో బిల్లుకు మద్దతు తెలిపిన జేడీయూ, శివసేన, అన్నాడీఎంకేల వైఖరి ప్రస్తుతం ప్రశ్నార్థకంగా మారింది. ఎన్డీయే భాగస్వామ్యపక్షాలలో బీజేపీకి 83, అన్నాడీఎంకే-11, ఎల్జేపీ 1, ఆర్పీఐ-1, అకాలీదళ్ -3, జేడీయూ-6, ఏజీపీ-1, బీపీఎఫ్-1, పీఎంకే-1 చొప్పున సీట్లు ఉన్నాయి. ఇవి కాకుండా లోక్‌సభలో బిల్లుకు బీజేడీ (7), శివసేన (3), వైసీపీ (2), టీడీపీ (2) మద్దతు తెలిపాయి. ఆరుగురు ఇండిపెండెంట్ సభ్యుల్లో నలుగురు, నామినేటెడ్ సభ్యుల్లో ముగ్గురు బిల్లుకు మద్దతునిచ్చే అవకాశం ఉంది. దీంతో మద్దతిచ్చే సభ్యుల సంఖ్య 129 ఉండటంతో బిల్లు ఆమోదం పొందేవీలుంది. మరోవైపు 20 మంది సభ్యులున్న శివసేన, జేడీయూ, అన్నాడీఎంకే తమ నిర్ణయాన్ని పునఃపరిశీలించుకుంటే.. బీజేపీకి ఇక్కట్లు తప్పకపోవచ్చు.

జిన్నాను సమాధి నుంచి లేపుతున్న సర్కార్

పౌరసత్వ బిల్లుపై అసదుద్దీన్ విమర్శ

న్యూఢిల్లీ: పౌరసత్వ సవరణ బిల్లుతో కేంద్ర ప్రభుత్వం పాకిస్థాన్ వ్యవస్థాపకుడు మహమ్మద్ అలీ జిన్నాను సమాధి నుంచి లేపుతున్నదని ఏఐఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ పేర్కొన్నారు. ఢిల్లీలో మంగళవారం జరిగిన లోక్‌మత్ జాతీయ సదస్సులో ఆయన మాట్లాడుతూ, పౌరసత్వ సవరణ బిల్లును పార్లమెంట్ ఆమోదించినా.. దానిపై తన వైఖరిని వెల్లడించేందుకు దేశంలోని అన్ని ప్రాంతాలకు వెళతానని చెప్పారు. 'ఈ బిల్లుతో ఎటువంటి సందేశాన్ని ఇవ్వదలచుకున్నారు? రాజకీయంగా ముస్లింలను ఇప్పటికే అణచివేస్తున్నారు. ఇప్పుడు గెంటి వేయడానికి ప్రయత్నిస్తున్నారు' అంటూ ధ్వజమెత్తారు. ఈ బిల్లుపై శివసేన 'భాంగ్రా రాజకీయాలు' చేస్తున్నదని విమర్శించారు. లోక్‌సభలో మద్దతు తెలిపి రాజ్యసభలో షరతులు విధించడం 'భాంగ్రా రాజకీయాలకు' నిదర్శనమన్నారు.

బిల్లుపై భగ్గు

గువాహటిలో టైర్లకు నిప్పుపెట్టిన ఆందోళనకారులు

ఈశాన్యం రణరంగం

- పౌరసత్వ బిల్లుకు వ్యతిరేకంగా నిరసనలు
- స్తంభించిన జనజీవనం
- బంద్‌తో దవాఖానకు వెళ్లే మార్గం లేక అసోంలో పసికందు మృతి

గువాహటి/ అగర్తల/ఈటానగర్: వివాదాస్పద పౌరసత్వ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా పలు విద్యార్థి సంఘాలు, వామపక్ష సంఘాలు చేపట్టిన ఆందోళనలతో ఈశాన్య రాష్ట్రాలు రణరంగాన్ని తలపించాయి. నిరసనకారులు రహదారులను దిగ్బంధించడంతో.. దవాఖానకు వెళ్లే మార్గం లేక రెండు నెలల పసికందు దారిలోనే మరణించాడు. మత పీడనకు గురై పొరుగున ఉన్న పాక్, బంగ్లాదేశ్, ఆఫ్ఘన్ నుంచి భారత్‌కు శరణార్థులుగా వచ్చిన ముస్లిమేతరులకు దేశ పౌరసత్వ కల్పనకు ఉద్దేశించిన పౌరసత్వ సవరణ బిల్లును సోమవారం లోక్‌సభ ఆమోదించిన విషయం తెలిసిందే. ఈ బిల్లును బుధవారం రాజ్యసభలో ప్రవేశపెట్టనున్నారు. దీంతో ఆల్ అసోం స్టూడెంట్స్ యూనియన్(ఏఏఎస్‌యూ), నార్త్ ఈస్ట్ స్టూడెంట్స్ ఆర్గనేషన్(ఎన్‌ఈఎస్‌వో) చేపట్టిన బంద్‌తో అసోంలోని బ్రహ్మపుత్ర లోయలో జనజీవనం స్తంభించింది. పలు వామపక్ష సంఘాలు విడిగా బంద్‌కు పిలుపునిచ్చాయి. గువాహటిలో భారీ ర్యాలీలు జరిపారు. ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, సీఎం సర్బానంద సోనోవాల్ దిష్టిబొమ్మలను దగ్ధం చేశారు. అసోం రాష్ట్ర సచివాలయం, అసెంబ్లీ ఎదుట నిరసనకారులకు, భద్రతా బలగాలకు మధ్య ఘర్షణలు జరిగాయి. డులియాజన్‌లో ఆయిల్ ఇండియా లిమిటెడ్ ఉద్యోగులను వారి కార్యాలయం లోకి వెళ్లకుండా అడ్డుకోవడంతో జరిగిన గొడవలో ముగ్గురు ఆందోళనకారులు గాయపడ్డారు. బంద్‌తో అసోంలో పలు రైళ్లు నిలిచిపోయాయి. బీజేపీ, అసోం గణ పరిషత్, దూరదర్శన్ కేంద్ర ప్రధాన కార్యాలయాలతోపాటు రాష్ట్ర మంత్రి హిమంత బిశ్వశర్మకు చెందిన ప్రైవేట్ టీవీ చానల్ భవనాన్ని నిరసనకారులు చుట్టుముట్టారు. కాగా, పౌరసత్వ బిల్లుపై సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని ఏఏఎస్‌యూ తెలిపింది.

ఢిల్లీలోనూ నిరసనలు

పౌరసత్వ బిల్లుకు వ్యతిరేకంగా ఢిల్లీలోనూ పలు పార్టీలు, విద్యాసంఘాలు, ప్రజాసంఘాలు ఆందోళన చేపట్టాయి. నార్త్‌ఈస్ట్ స్టూడెంట్స్ యూనియన్, సీపీఎం ఢిల్లీ విభాగం జంతర్‌మంతర్ వద్ద నిరసన చేపట్టాయి. అంతకుముందు సీపీఎం ఎంపీలు పార్లమెంట్ ఆవరణలో గాంధీ విగ్రహం వద్ద ఆందోళన చేశారు. పౌరసత్వ బిల్లును వెనక్కి తీసుకోవాలని బ్యానర్లు ప్రదర్శించారు.

జోధ్‌పూర్‌లో పాక్ హిందువుల సంబురాలు

పౌరసత్వ బిల్లును లోక్‌సభ ఆమోదించడంతో జోధ్‌పూర్‌లోని పాక్ హిందూ శరణార్థులు సంబురాలు చేసుకున్నారు. రాజ్యసభలోనూ ఆమోదం పొందాలని ఆకాంక్షించారు. పాక్ నుంచి 2005లో భారత్‌కు వచ్చిన ప్రేమ్‌చంద్ మాట్లాడుతూ.. 'ప్రభుత్వం మాకు కొత్త జీవితాన్నిచ్చింది. భారత్‌లో గౌరవప్రదంగా జీవించేందుకు అవకాశమిచ్చినందుకు కేంద్ర మంత్రి అమిత్ షాకు, బీజేపీ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం' అని చెప్పారు.

త్రిపురలో ఇంటర్నెట్ సేవలు నిలిపివేత

త్రిపురలోని ధలాయీ జిల్లాలో గిరిజనేతరులకు చెందిన మార్కెట్‌కు ఆందోళనకారులు నిప్పు పెట్టారు. ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదని పోలీసులు తెలిపారు. వదంతులు వ్యాప్తిచేయకుండా 48 గంటలపాటు ఇంటర్నెట్ సర్వీసులను నిలిపివేస్తున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. సెపహిజాలా జిల్లాలోని బిశ్రమ్‌గంజ్‌లో ఆందోళనకారులు రహదారిని దిగ్బంధించడంతో దవాఖానకు వెళ్లే మార్గం లేక రెండు నెలల శిశువు ప్రాణాలు కోల్పోయాడు. బంద్ కారణంగా ధలాయీ, పశ్చిమ త్రిపుర, ఖోవాయ్ జిల్లాలో జనజీవనం స్తంభించింది. రాష్ట్రమంతటా రైలు సేవలు నిలిచిపోయాయి. ఆల్ అరుణాచల్ ప్రదేశ్ స్టూడెంట్స్ యూనియన్ (ఏఎంఎస్‌యూ) చేపట్టిన బంద్‌తో అరుణాచల్‌లో విద్యాసంస్థలు, బ్యాంకులు, వ్యాపార, వాణిజ్య సంస్థలు, మూతబడ్డాయి. మణిపూర్‌లో ఆల్‌మణిపూర్ స్టూడెంట్స్ యూనియన్ నిర్వహించిన బంద్‌కు స్పందన లభించింది. మేఘాలయ రాజధాని షిల్లాంగ్‌లో నిరసనకారులు టైర్లకు నిప్పుపెట్టారు. మావ్లాయ్‌లో పోలీస్ వాహనాన్ని ధ్వంసం చేశారు.

పౌరసత్వ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా అసోంలోని గువాహటిలో నిరసన చేపట్టిన అసోంకు చెందిన సినీ నటులు, కళాకారులు

ప్రజాస్వామ్యానికి ముప్పు

- రాజ్యాంగంపై దాడి: రాహుల్‌గాంధీ
- ప్రభుత్వ ఎజెండాపై పోరాడుతాం: ప్రియాంక
- బిల్లును సవరిస్తేనే మద్దతు తెలుపుతాం: శివసేన
- మద్దతుపై జేడీయూలో విభేదాలు



న్యూఢిల్లీ, డిసెంబర్ 10: లోక్‌సభలో పౌరసత్వ (సవరణ) బిల్లు ఆమోదం పొందడంపై పలు రాజకీయ పార్టీలు, విద్యావేత్తలు, మేధావులు మండిపడుతున్నారు. బిల్లును వెనుకకు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ బిల్లు రాజ్యాంగంపై జరిగిన దాడి అని, దానికి మద్దతు తెలిపేవారు దేశ పునాదులను ధ్వంసం చేస్తున్నారని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. సోమవారం అర్ధరాత్రి పౌరసత్వ సవరణ బిల్లును లోక్‌సభ ఆమోదించిన సంగతి తెలిసిందే. దీంతో భారత్.. అసహనం, సంకుచిత మనస్తత్వం గలవారితో రాజీ పడిందన్న విషయం ధ్రువపడిందని కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి ప్రియాంక గాంధీ పేర్కొన్నారు. ఈ దేశానికి స్వాతంత్ర్యం సాధన కోసం మన పూర్వీకులు తమ రక్తాన్ని ధారపోశారని తెలిపారు. ఎంతో పోరాడి సాధించుకున్న స్వాతంత్ర్యం ద్వారా సమానత్వ హక్కును, మనకిష్టమైన మతాన్ని ఆచరించే హక్కును కూడా పొందామని ఆమె గుర్తు చేశారు. మన రాజ్యాంగం, మన పౌరసత్వం, బలమైన-సమైక్య భారత్‌ను రూపొందించాలన్న కల మన అందరిదని మరో ట్వీట్‌లో పేర్కొన్నారు. రాజ్యాంగాన్ని ఓ పద్ధతి ప్రకారం ధ్వంసం చేయాలనుకుంటున్న ఈ ప్రభుత్వ ఎజెండాకు వ్యతిరేకంగా పోరాడుతామని ప్రియాంక స్పష్టం చేశారు. రాజ్యాంగ ప్రజాస్వామ్యానికి ఈ బిల్లు ఓ శాపమని కాంగ్రెస్ ప్రతినిధి రణ్‌దీప్ సుర్జేవాలా వ్యాఖ్యానించారు.

మత ప్రాతిపదికన దేశాన్ని విభజించాలని, హిందుత్వ దేశంగా మార్చాలన్న తమ ఎజెండాకు మరింత పదును పెట్టేందుకే మోదీ సర్కార్ ఈ బిల్లును తెచ్చిందని సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి విమర్శించారు. లోక్‌సభలో తమ ప్రశ్నలకు ప్రభుత్వం స్పష్టత నిచ్చేవరకు ఈ బిల్లుకు రాజ్యసభలో మద్దతు తెలుపబోమని శివసేన అధ్యక్షుడు, మహారాష్ట్ర సీఎం ఉద్ధవ్ ఠాక్రే పేర్కొన్నారు. లోక్‌సభలో ఆ బిల్లుకు శివసేన మద్దతు తెలిపింది. తాము సూచించిన మార్పులను ప్రభు త్వం పరిశీలించకుంటే తమ వైఖరిని పునరాలోచించుకోవాల్సి వస్తుందని ఉద్ధవ్ ఠాక్రే హెచ్చరించారు.

నితీశ్‌పై ప్రశాంత్ కిశోర్ అసంతృప్తి

పౌరసత్వ సవరణ బిల్లుపై జేడీ(యూ)లో విభేదాలు పొడసూపాయి. బిల్లుకు తమ పార్టీ మద్దతుపై జేడీయూ ఉపాధ్యక్షుడు ప్రశాంత్ కిషోర్, ప్రధాన కార్యదర్శి పవన్ వర్మ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ బిల్లు ప్రజలను మత ప్రాతిపదికన విభజిస్తుందని ప్రశాంత్ కిశోర్ అన్నారు. తమ పార్టీ నియమావళిలోని మొదటి పేజీలో లౌకికత్వం అనే పదం మూడుసార్లు ఉం దని, గాంధేయవాద సిద్ధాంతాలను నాయక త్వం అనుసరించాల్సి ఉందన్నారు. బిల్లుకు మద్దతుపై పార్టీ అధ్యక్షుడు నితీశ్‌కుమార్ పునరాలోచించాలని పవన్ వర్మ సూచించారు.

లంక తమిళులకు పౌరసత్వం ఇవ్వాలి!

దేశంలో మూడు దశాబ్దాలకుపైగా నివసిస్తున్న శ్రీలంక తమిళ శరణార్థులకు భారత పౌరసత్వం ఇవ్వాలని శ్రీశ్రీ రవిశంకర్, ప్రముఖ గీత రచయిత వైరముత్తు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

పార్లమెంట్ బయట వామపక్ష పార్టీల ఎంపీల ఆందోళన

అమిత్‌షాపై ఆంక్షలు విధించాలి

- పౌరసత్వ సవరణ బిల్లును భారత పార్లమెంట్ ఆమోదిస్తే చర్యలు తీసుకోవాలి
- ఇది తప్పుడు దిశలో ప్రమాదకరమైన మలుపు
- బిల్లుపై అమెరికా కమిషన్ వ్యాఖ్యలు
- జోక్యం చేసుకునే హక్కు యూఎస్‌సీఐఆర్‌ఎఫ్‌కి లేదు: భారత్

వాషింగ్టన్, డిసెంబర్ 10: మత ప్రాతిపదికన పౌరసత్వ సవరణ బిల్లుకు భారత పార్లమెంట్ ఆమోదం తెలిపితే.. ఆ దేశ హోం మంత్రి అమిత్‌షాతోపాటు ఇతర కీలక నాయకత్వంపై ఆంక్షలు విధించాలని అమెరికాకు చెందిన యూఎస్ కమిషన్ ఆన్ ఇంటర్నేషనల్ రిలీజియస్ ఫ్రీడం (యూఎస్‌సీఐఆర్‌ఎఫ్) ట్రంప్ సర్కార్‌కు సూచించింది. దీనిపై భారత్ తీవ్రస్థాయిలో మండిపడింది. తమ అంతర్గత వ్యవహారాలలో జోక్యం చేసుకునే అర్హత ఆ సంస్థకు లేదని స్పష్టం చేసింది. లోక్‌సభ ఆమోదించిన పౌరసత్వ సవరణ బిల్లు ముస్లిమేతర శరణార్థులకు పౌరసత్వం కల్పించేందుకు అవకాశం ఇస్తుందని యూఎస్‌సీఐఆర్‌ఎఫ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. 'ఈ బిల్లు తప్పుడు దిశలో వెళుతున్న ఓ ప్రమాదకరమైన మలుపు' అని పేర్కొంది. భారత్‌కు ఘనమైన లౌకిక చరిత్రకు, రాజ్యాంగంలో కల్పించిన సమానత్వ హక్కుకు ఈ బిల్లు వ్యతిరేకంగా ఉన్నదని తెలిపింది. బిల్లును పార్లమెంట్ ఆమోదిస్తే హోం మంత్రి అమిత్‌షాతోపాటు ఇతర కీలక నాయకత్వంపై ఆంక్షలు విధించే అంశాన్ని పరిశీలించాలని యూఎస్‌సీఐఆర్‌ఎఫ్ సిఫారసు చేసింది. అమెరికా 1998లో స్థాపించిన యూఎస్‌సీఐఆర్‌ఎఫ్ ఓ స్వతంత్ర సంస్థ. వివిధ దేశాల్లో మత స్వేచ్ఛకు ఎదురవుతున్న ఆ టంకాలను సమీక్షించి తీసుకోవాల్సిన చర్యలపై అమెరికా అధ్యక్షుడికి సిఫారసులు చేస్తుంది. గుజరాత్ హత్యాకాండ నేపథ్యంలో 2005లో ఆ రాష్ట్ర సీఎంగా ఉన్న మోదీకి అమెరికా వీసా మంజూరు చేయరాదని ఈ సంస్థే సిఫారసు చేసింది.

భారత్ ఖండన

పౌరసత్వ సవరణ బిల్లుపై అమెరికా కమిషన్ యూఎస్‌సీఐఆర్‌ఎఫ్ వ్యాఖ్యలు విచారకరమని భారత్ పేర్కొంది. ఈ అంశంపై ఆ సంస్థకు ఎటువంటి అవగాహన లేదని, కేవలం పక్షపాతం, వివక్షతో వ్యాఖ్యలు చేసిందని తెలిపింది. బిల్లుపై యూఎస్‌సీఐఆర్‌ఎఫ్ ప్రకటనలో కచ్చితత్వం లేదు, అది అనవసరమైనది అని విదేశాంగ శాఖ ప్రతినిధి రవీశ్‌కుమార్ అన్నారు. కాగా, భారత ప్రభుత్వ పౌరసత్వ సవరణ బిల్లు.. మతం చాటున పొరుగు దేశాలలో జోక్యంచేసుకోవాలన్న దాని కపట బుద్ధిని వెల్లడిస్తున్నదని పాకిస్థాన్ విమర్శించింది.

దేశాన్ని విభజిస్తుంది

- బిల్లును వెనుకకు తీసుకోవాలి
- ప్రభుత్వానికి 600 మందికి పైగా శాస్త్రవేత్తలు, మేధావుల విజ్ఞప్తి

రామచంద్రగుహ

అపర్ణాసేన్

పౌరసత్వ సవరణ బిల్లు రాజ్యాంగ విరుద్ధం, వివక్షాపూరితమని, అది దేశాన్ని విభజించేదిగా ఉందని, అందువల్ల వెంటనే వెనుకకు తీసుకోవాలని 600 మందికి పైగా శాస్త్రవేత్తలు, రచయితలు, కళాకారులు, మాజీ న్యాయమూర్తులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వారు ఒక వినతిపత్రంపై సంతకాలు చేశారు. ఈ బిల్లు దేశాన్ని 'రాజ్యాంగ విరుద్ధమైన జాతి'గా మారుస్తుందని ప్రముఖ విద్యావేత్త ప్రతాప్ భాను మెహతా వ్యాఖ్యానించారు. ఈ బిల్లు చట్టంగా మారితే తాను 'సహాయ నిరాకరణ' చేస్తానని పౌర హక్కుల కార్యకర్త హర్ష్ మందర్ పేర్కొన్నారు. 'నేను ముస్లింగా రిజిస్టర్‌గా చేసుకుంటాను. ఆ తరువాత ఎన్నార్సీకి ఎటువంటి పత్రాలు ఇవ్వను' అని మందర్ ట్వీట్ చేశారు. అమిత్ షా తీరును విద్యావేత్త రామచంద్ర గుహ విమర్శించారు. నాయకులు అధికారం కోసం మాతృదేశ బట్టలూడదీస్తున్నారని జాతీయ అవార్డు గ్రహీత జాహ్ను బారువా విమర్శించారు. బిల్లును నిరసిస్తూ అస్సాం ఫిలిం అవార్డుల పోటీ నుంచి తన సినిమా 'భోగా ఖిరికీ'ని ఉపసంహరించుకుంటున్నానని తెలిపారు. సంతకం చేసినవారిలో నయనతార సెహగల్, అరుంధతీరాయ్, అమితవ్ ఘోష్, టీఎం కృష్ణ, సుధీర్ పట్వర్ధన్, నీలిమా షేక్, అపర్ణా సేన్, నందితా దాస్, రొమిలా థాపర్, ప్రభాత్ పట్నాయక్, తీస్తా సెతల్వాడ్, అరుణా రాయ్, రిటైర్డ్ జస్టిస్ ఏపీ షా, జీఎన్ డేవి, నందినీసుందర్, వజాహత్ హబీబుల్లా తోపాటు దేశ, విదేశాలకు చెందిన యూనివర్సిటీల ప్రొఫెసర్లు, శాస్త్రవేత్తలు ఉన్నారు.

బిల్లుతో అసోంలో స్థానికులకు నష్టం కలుగదు

కేంద్ర ప్రభుత్వం వివరణ

న్యూఢిల్లీ: పౌరసత్వ సవరణ బిల్లుతో అసోంలో బెంగాలీ మాట్లాడే ప్రజల ఆధిపత్యం పెరుగుతున్నది ఒట్టి భ్రమ మాత్రమేనని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ బిల్లు వల్ల అసోంకు చెందిన స్థానికుల ప్రయోజనాలకు కూడా విఘాతం కలుగదని తెలిపింది. బిల్లు నేపథ్యంలో అసోంలో పలు వదంతులు వ్యాపిస్తున్నాయని పేర్కొంటూ.. వాటికి ట్విట్టర్ ద్వారా వివరణ ఇచ్చేందుకు ప్రయత్నించింది.

సంస్కృత విభాగానికి ఫిరోజ్‌ఖాన్ రాజీనామా

బీహెచ్‌యూ ఆర్ట్స్ విభాగంలో చేరిక

వారణాసి, డిసెంబర్ 10: బనారస్ హిందూ విశ్వవిద్యాలయం (బీహెచ్‌యూ) సంస్కృత విభాగానికి (ఎస్పీడీవీ) ప్రొఫెసర్ ఫిరోజ్‌ఖాన్ రాజీనామా చేశారు. వారణాసిలోని బీహెచ్‌యూలో ఎస్పీడీవీలో సంస్కృతాన్ని హిందూ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తే బోధించాలంటూ విద్యార్థులు కొన్ని రోజులుగా ఆందోళన చేపడుతున్న విషయం తెలిసిందే. అయినా యూనివర్సిటీ యాజమాన్యం మాత్రం ఫిరోజ్‌ఖాన్‌కు మద్దతుగా నిలిచింది. విద్యార్థుల ఆందోళన నేపథ్యంలో కొన్ని రోజులుగా పాఠాలు చెప్పని ఫిరోజ్‌ఖాన్ చివరికి సంస్కృత విభాగానికి రాజీనామా చేసి అదే యూనివర్సిటీకి చెందిన ఆర్ట్స్ విభాగంలో చేరారు. సంస్కృత విద్యా ధర్మ విజ్ఞాన్ విభాగం (ఎస్పీడీవీ) డీన్ బిందేశ్వర్ ప్రసాద్ మిశ్రా మాట్లాడుతూ ఫిరోజ్‌ఖాన్ ఆర్ట్స్ విభాగంలో చేరిన విషయం వాస్తవమేనని, అక్కడ కూడా ఆయన సంస్కృతాన్నే బోధిస్తారని తెలిపారు.

కుప్పకూలిన చిలీ సైనిక విమానం

38 మంది ఆచూకీ గల్లంతు

రోదిస్తున్న విమాన ప్రమాద బాధితుడి బంధువు

శాంటియాగో, డిసెంబర్ 10: చిలీలో విషాదం చోటుచేసుకున్నది. పుంటా ఎరెనాస్ అనే నగరంలో గల వైమానిక స్థావరం నుంచి 38 మందితో అంటార్కిటికాలోని తమ వైమానిక స్థావరానికి బయలుదేరిన మిలిటరీ రవాణా విమానం మార్గ మధ్యంలోనే కూలిపోయింది. స్థానిక కాలమానం ప్రకారం సోమవారం సాయంత్రం 4:55 గంటలకు బయలుదేరిన 'సీ-130 హెర్క్యులస్' విమానంతో 6.13 గంటలకు రేడియో సంబంధాలు తెగిపోయాయని చిలీ వాయుసేన పేర్కొంది. విమానంతో రేడియో సంబంధాలు నెలకొల్పేందుకు చేసిన ప్రయత్నాలేవీ ఫలించలేదని, దీంతో ఆ విమానం కూలిపోయి ఉంటుందని భావిస్తున్నట్లు ట్వీట్ చేసింది. విమానంలో ఉన్న 38 మందిలో 18 మంది విమాన సిబ్బంది చిలీ వాయుసేన, సైన్యానికి చెందిన వాళ్లు. మిగతా వారిలో ప్రైవేట్ సంస్థ సిబ్బంది, చిలీ యూనివర్సిటీకి చెందిన వారు తదితరులు ఉన్నారు. విమాన శకలాల కోసం గగనతలంలోనూ, సముద్ర జలాల్లోనూ గాలింపు సాగిస్తున్నట్లు చిలీ వాయుసేన వివరించింది. దేశ అధ్యక్షుడు సెబాస్టియన్ పినెరా స్పందిస్తూ ఎప్పటికప్పుడు రక్షణ, అంతరంగిక వ్యవహారాల మంత్రులతో సమీక్షిస్తున్నట్లు ట్వీట్ చేశారు. నాలుగు ఇంజిన్లు గల ఈ విమానంలో ఎమర్జెన్సీ పొజిషనింగ్ సిస్టమ్ కూడా ఉన్నదని ఫోర్త్ ఎయిర్ బ్రిగేడ్ కమాండర్ ఈక్వెర్డో మాస్‌క్వెరియా చెప్పారు. కానీ ఎమర్జెన్సీ వ్యవస్థ పని చేయలేదన్నారు. ప్రతికూల వాతావరణం వల్ల దక్షిణ అమెరికా-అంటార్కిటికా మధ్య గల డ్రాకే ప్యాసేజ్ మార్గంలో విమానం కూలిపోయి ఉంటుందని భావిస్తున్నామన్నారు.

నేడే నింగిలోకి పీఎస్‌ఎల్వీ సీ-48

- సాయంత్రం 3.25కి రీశాట్-2బీఆర్1 ప్రయోగం
- మరో చారిత్రక మైలురాయికి చేరువైన ఇస్రో
- ఇది పీఎస్‌ఎల్వీ 50వ మిషన్
- శ్రీహరికోట నుంచి చేపడుతున్న 75వ ప్రయోగం

లాంచ్‌ప్యాడ్‌పై సిద్ధంగా ఉన్న పీఎస్‌ఎల్వీ సీ-48

చెన్నై, డిసెంబర్ 10: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) మరో చారిత్రక మైలురాయికి చేరువైంది. ఇస్రో కదనాశ్వమైన పోలార్ లాంచింగ్ శాటిలైట్ వెహికల్ (పీఎస్‌ఎల్వీ) 50వ ప్రయోగానికి సర్వంసిద్ధమైంది. ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లా శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ అంతరిక్ష ప్రయోగ కేంద్రం (షార్) నుంచి పీఎస్‌ఎల్వీ సీ-48 ద్వారా రాడార్ ఇమేజింగ్ ఎర్త్ అబ్జర్వేషన్ శాటిలైట్ 'రీశాట్-2బీఆర్1' ప్రయోగానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. శ్రీహరికోట నుంచి 75వ ప్రయోగం కావడం మరో విశేషం. మంగళవారం సాయంత్రం 4.40కు మొదలైన కౌంట్‌డౌన్ 23 గంటలు కొనసాగనుంది. బుధవారం మధ్యాహ్నం 3.25 గంటలకు పీఎస్‌ఎల్వీ సీ-48 నింగిలోకి దూసుకెళ్లనుంది. ఈ రాకెట్ ద్వారా రిశాట్-2బీఆర్1తోపాటు అమెరికాకు చెందిన ఆరు, ఇజ్రాయెల్, ఇటలీ, జపాన్‌కు చెందిన ఒక్కో ఉపగ్రహాలను నింగిలోకి ప్రవేశపెట్టనున్నారు. 628 కిలోల బరువున్న రిశాట్-2బీఆర్1 ఉపగ్రహం.. వ్యవసాయం, అటవీ, విపత్తు నిర్వహణ వంటి రంగాల్లో ఉపయోగపడనుంది. ఐదేండ్లపాటు సేవలందిస్తుంది. గత మే 22న ప్రయోగించిన రిశాట్-2బీకి కొనసాగింపుగా దీన్ని ప్రయోగిస్తున్నారు. ఇస్రో చైర్మన్ కే శివన్ మంగళవారం తిరుమల శ్రీవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

పీఎస్‌ఎల్వీ విజయీభవ!

ఇస్రో ప్రయోగాల్లో పీఎస్‌ఎల్వీ రాకెట్‌కు ప్రత్యేక స్థానమున్నది. ప్రపంచంలోనే అత్యంత విజయవంతమైన రాకెట్లలో ఒకటిగా దీనికి పేరుంది. 49 ప్రయోగాల్లో కేవలం రెండు మాత్రమే విఫలమయ్యాయి. మూడో తరం లాంచ్ వెహికల్ అయిన పీఎస్‌ఎల్వీ.. చంద్రయాన్-1, మంగళ్‌యాన్ మిషన్లను విజయవంతం చేసింది. ఇప్పటి వరకు ఇస్రో 310 విదేశీ ఉపగ్రహాలను నింగిలోకి చేర్చగా తాజా ప్రయోగం విజయవంతమైతే ఆ సంఖ్య 319కి చేరుతుంది.

ఆత్మపరిశీలన చేసుకుందాం

- మానవ హక్కుల అసలు ఉద్దేశాన్ని గ్రహిద్దాం
- రాష్ట్రపతి కోవింద్

న్యూఢిల్లీ: మానవ హక్కుల అసలు ఉద్దేశాన్ని గ్రహించి ఆ మేరకు వాటిని ఆచరిస్తున్నామా లేదా అన్నది ఆత్మపరిశీలన చేసుకుందామని రాష్ట్రపతి కోవింద్ పిలుపునిచ్చారు. ప్రతి ఏటా డిసెంబర్ 10న నిర్వహించే ప్రపంచ మానవ హక్కుల దినోత్సవంలో భాగంగా ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో మంగళవారం జరిగిన జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్సీ) కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సమాజంలో మహిళలపై జరుగుతున్న దారుణాలను ప్రస్తావిస్తూ కొంత భావోద్వేగానికిలోనయ్యారు. అందరికీ సమాన హక్కులుండాలన్న

నేడు వరంగల్‌కు యంగ్‌వన్ చైర్మన్ రాక

కాకతీయ టెక్స్‌టైల్ పార్కు సందర్శన

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కొరియాకు చెందిన యంగ్‌వన్ కార్పొరేషన్ చైర్మన్ కిహాక్‌సంగ్ బుధవారం వరంగల్‌లోని కాకతీయ మెగాటెక్స్‌టైల్ పార్కును సందర్శించనున్నారు. పార్కులో పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధంగా ఉన్న నేపథ్యంలో ఆయన ఈ పర్యటనకు వస్తున్నారు. ఉదయం 7గంటలకు శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు చేరుకుని.. అక్కడినుంచి ప్రభుత్వం ఏర్పాటుచేస్తున్న ప్రత్యేక హెలికాప్టర్‌లో టెక్స్‌టైల్‌పార్కుకు వెళ్తారు. అనంతరం హైదరాబాద్‌లోని ఐటీసీ కాకతీయ హోటల్‌లో రాష్ట్ర పరిశ్రమలశాఖ ముఖ్య కార్యదర్శితో చర్చిస్తారు.

మూడురోజులు పొడి వాతావరణం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో రాగల మూడురోజులపాటు వాతావరణం పొడిగా ఉంటుంది. చాలాచోట్ల రాత్రిపూట కనిష్ఠ ఉష్ణోగ్రతలు 17 నుంచి 20 డిగ్రీల వరకు, పగటిపూట గరిష్ఠ ఉష్ణోగ్రతలు 29 నుంచి 31 డిగ్రీల సెల్సియస్ వరకు నమోదవుతున్నాయి. హైదరాబాద్‌లో కనిష్ఠ ఉష్ణోగ్రత 18 నుంచి 20 డిగ్రీలు, గరిష్ఠ ఉష్ణోగ్రత 28 నుంచి 30 డిగ్రీలుగా రికార్డయింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా భీమ్‌పూర్ మండలం అర్లి(టి) గ్రామంలో చలి వణికిస్తున్నది. ఇక్కడ 11.5 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ఉమ్మడి ఆదిలాబాద్‌తోపాటు రంగారెడ్డి, సంగారెడ్డి, నిర్మల్, కుమ్రంభీం జిల్లాలోని పలుప్రాంతాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 12 నుంచి 13 డిగ్రీలుగా నమోదవుతున్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో తూర్పు, ఆగ్నేయ దిశ నుంచి చలిగాలులు వీస్తున్నాయి. హిందూ మహాసముద్రం దానిని ఆనుకుని కోమోరిన్ ప్రాంతంలో ఏర్పడిన ఉపరితల ద్రోణి కొనసాగుతున్నది.

గ్రేటర్‌లో స్వల్పంగా తగ్గిన చలి

రంగారెడ్డి జిల్లా, నమస్తే తెలంగాణ: గ్రేటర్ హైదరాబాద్‌లో చలి తీవ్రత స్వల్పంగా తగ్గింది. మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు గరిష్ఠ ఉష్ణోగ్రత 29.1 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రత 20.2 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైనట్టు వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు.

ఆదిలాబాద్ జిల్లా అర్లి(టి)లో 11.5 డిగ్రీలు

కాలనీలను కమ్మేసిన పొగ మంచు

మన్సూరాబాద్: హైదరాబాద్ మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని పలుకాలనీలను మంగళవారం పొగమంచు కమ్మేసింది. ఉదయం 6 నుంచి 8 గంటల వరకు పొగమంచు దట్టంగా వ్యాపించడంతో పదిమీటర్ల దూరంలో ఉన్న వ్యక్తులు, వాహనదారులు కనిపించని పరిస్థితి ఉత్పన్నమైంది.

మన్సూరాబాద్ డివిజన్ పరిధిలో పొగ మంచుతో మసకబారిన జడ్జెస్‌కాలనీలోని ఓ అపార్ట్‌మెంట్

ఆపదలో అస్త్రం హాక్‌ఐ

ఎన్నెన్నో ఫీచర్లు.. మరెంతో రక్షణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఇంటర్నెట్ లేకపోయినా హాక్‌ఐ ద్వారా అత్యవసరసేవలు అందుకునేలా ఇటీవల కొత్త ఫీచర్‌ను తెలంగాణ పోలీసులు జతచేశారు. ఆపత్కర సమయాల్లో పోలీసులకు సులువుగా సమాచారం ఇచ్చే ఎస్వోఎస్ (సేవ్ అవర్ సోల్)ను కీలక ఆప్షన్‌గా చెప్పుకోవచ్చు. ఈ హాక్‌ఐ మొబైల్ యాప్ ప్రధానంగా పది ఫీచర్స్ ఉన్నాయి.

రిపోర్ట్ ఏ వయోలేషన్: ఎవరైనా ట్రాఫిక్, ఇతర నిబంధనలు ఉల్లంఘిస్తే.. ఆ సమాచారాన్ని వీడియో లేదా ఫొటో లేదా ప్రదేశం రూపం లో ఈ యాప్‌లోని 'రిపోర్ట్ ఏ వయోలేషన్' ఆప్షన్‌లో నమోదుచేస్తే ఆ సమాచారం పోలీసులకు చేరుతుంది.

'ఉమెన్ ట్రావెల్ మోడ్ సేఫ్': మహిళల ఒంటరి ప్రయాణ సమయాల్లో వాహనం నంబర్, ఎక్కడి నుంచి వెళ్తున్నారనే వివరాలను 'ఉమెన్ ట్రావెల్ మోడ్ సేఫ్' ఆప్షన్‌లో నమోదు చేస్తే క్షేమంగా గమ్యం చేరేవరకు ఆయాపరిధిలోని పోలీసులు అలర్ట్‌గా ఉంటారు.

వెహికిల్‌సర్చ్: సెకండ్‌హ్యాండ్ వాహనం కొనుగోలు చేసేటప్పుడు ఆ వాహనం నంబర్‌ను 'వెహికిల్‌సర్చ్ ఆప్షన్'లో పొందుపరిస్తే.. దానిపై ఉన్న కేసుల వివరాలు లభిస్తాయి.

సీనియర్ సిటిజన్ ఆప్షన్: ఒంటరిగా ఉండే వృద్ధులకు బాసటగా ఉండేలా హాక్‌ఐలో 'సీనియర్ సిటిజన్ ఆప్షన్' పొందుపర్చారు. వృద్ధులకువారి పరిధిలోని బీట్‌కానిస్టేబుళ్లు, లీగల్‌సర్వీసులు, హోంకేర్ సర్వీస్ ఇలా సమాచారమంతా అందుబాటులో ఉంటుంది.

రిజిస్టర్ విత్ పోలీస్: హాక్‌ఐలో ఉన్న మరో అద్భుత ఫీచర్ ఇది. కిరాయిదారులు, పనిమనిషి, డ్రైవర్, తోటమాలి, వాచ్‌మెన్ ఇలా మొత్తం 29 క్యాటగిరీల్లో సేవలు అందించేవారు ఇంటికి వస్తే ఆ వివరాలు 'రిజిస్టర్ విత్ పోలీస్'లో నమోదుచేసుకోవచ్చు. అందులో ఆధార్ నంబరతోసహా పలు ఆ వివరాలు నమోదైన తర్వాత స్థానిక బ్లూ కోల్ట్స్, పెట్రోకార్ సిబ్బంది మనఇంటికి వచ్చి ఆ వ్యక్తి వివరాలు పరిశీలించి వెళ్తారు. దీంతో ఆయా వ్యక్తులకు తమపై పోలీసుల నజర్ ఉందన్న భయం ఉంటుంది. తాజాగా జరిగిన బంజారాహిల్స్ చోరీ ఘటనలో ఆ యజమాని హాక్‌ఐలో రిజిస్టర్ విత్ పోలీస్ సేవలు వినియోగించుకుని ఉంటే ఆ దొంగ గంటల్లోనే పట్టుబడి ఉండేవాడు.

ఆర్టీసీ ఉద్యోగులకు 'పవర్‌ఫుల్ బోర్డ్'

ఈ నెల 15లోగా సంక్షేమ బోర్డు ఏర్పాటు

- ప్రతి డిపో నుంచి ఇద్దరు ఉత్తమ ఉద్యోగులకు చోటు
- డిపోలవారీగా ప్రతినెలా సమీక్షలు
- సమస్యల పరిష్కారానికి బస్‌భవన్‌లో ప్రత్యేకాధికారి
- సరుకు రవాణాకు ప్రభుత్వ శాఖలతో ఒప్పందాలు
- ఈడీలతో సమీక్షలో ఆర్టీసీ ఇంచార్జి ఎండీ సునీల్‌శర్మ ఆదేశాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

రాష్ట్రంలో ఆర్టీసీ ఉద్యోగుల కోసం ఈ నెల 15లోగా సంక్షేమ బోర్డును ఏర్పాటుచేసేందుకు చర్యలు తీసుకోవాలని టీఎస్‌ఆర్టీసీ ఇంచార్జి ఎండీ సునీల్‌శర్మ అధికారులను ఆదేశించారు. ఆ వెంటనే డిపోలవారీగా కార్మికులతో సమీక్షలు నిర్వహించాలని చెప్పినట్లు సమాచారం. ఇందుకు సంబంధించిన అంశాలపై మంగళవారం ఆయన ఆర్‌అండ్‌బీ కార్యాలయంలో ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. ఆర్టీసీ ఉద్యోగులకు ప్రగతిభవన్ వేదికగా సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీల అమలు తీరుపై పరిశీలించారు. సీఎం కేసీఆర్ సూచన మేరకు ఆర్టీసీలో సంక్షేమ బోర్డు ఏర్పాటుపై అధికారులు ఇప్పటికే విధివిధానాలు ఖరారుచేశారు. 97 డిపోల నుంచి ఇద్దరి చొప్పున, మూడు వర్క్‌షాపుల నుంచి మరో ఇద్దరు చొప్పున మొత్తం 200 మందితో ఉద్యోగుల సంక్షేమ బోర్డు ఏర్పాటుకానున్నది. ఉద్యోగుల ప్రవర్తన, నిజాయితీ, విధులు నిర్వర్తిస్తున్న తీరు తదితర అంశాల ఆధారంగా ప్రతి డిపో నుంచి ఇద్దరు ఉత్తమ ఉద్యోగులను డిపో మేనేజర్ ఎంపికచేస్తారు. ప్రతి రీజియన్‌లోని పది రకాల క్యాటగిరీల నుంచి ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ సహా అన్ని వర్గాలకు సంక్షేమ బోర్డులో చోటు కల్పించడంతోపాటు మొత్తంగా మహిళలకు 33 శాతం ప్రాతినిధ్యం లభించేలా చూస్తారు. డిపోలవారీగా నెలకొకసారి, రీజియన్‌వారీగా రెండు నెలలకు ఒకసారి, కార్పొరేషన్‌వారీగా ప్రతి నాలుగు నెలలకు ఒకసారి సమీక్షలు జరుగుతాయి. సంక్షేమ బోర్డు సూచించిన సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకొనేలా బస్‌భవన్‌లో ప్రత్యేకంగా ఓ అధికారిని నియమిస్తారు. యూనియన్ల ప్రమేయం లేకుండానే ఉద్యోగుల సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించడంలో సంక్షేమ బోర్డు కీలకపాత్ర పోషించనున్నది.

సరుకు రవాణాకు ప్రభుత్వ శాఖలతో ఒప్పందాలు

టీఎస్‌ఆర్టీసీలో సరుకు రవాణాను ప్రవేశపెట్టడంపై కూడా సునీల్‌శర్మ ఈడీలతో చర్చించారు. దీన్ని ఏ మార్గాల్లో ప్రారంభించాలి, ఎలా చేయాలి అనే అంశాలపై విధివిధానాలు ఖరారుచేయాలని, సరుకు రవాణా కోసం వ్యవసాయ, పౌరసరఫరాలు, విద్య తదితర ప్రభుత్వ శాఖలతో ఒప్పందాలు కుదుర్చుకొనేందుకు చర్యలు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. సరుకు రవాణా కోసం ప్రత్యేకంగా కొన్ని బస్సులను వినియోగించుకోవాలని, తొలుత ప్రభుత్వశాఖల సరుకులను, ఆ తర్వాత కాలంలో ప్రైవేటు కార్గోను రవాణాచేసేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని సునీల్‌శర్మ సూచించారు.

హెచ్చార్సీకి సైబరాబాద్ పోలీసుల నివేదిక

- దిశ కేసులో సేకరించిన సాంకేతిక, శాస్త్రీయఆధారాలు అందజేత
- నాలుగోరోజూ కొనసాగిన విచారణ
- నేడు హెచ్చార్సీ బృందం తిరుగుపయనం
- ఢిల్లీ వెళ్లిన సైబరాబాద్ సీపీ సజ్జనార్

సికింద్రాబాద్‌లోని గాంధీ దవాఖాన మార్చురీ వద్ద పోలీసుల బందోబస్తు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: దిశ నిందితుల ఎన్‌కౌంటర్‌పై జాతీయ మానవ హక్కుల సంఘం (ఎన్‌హెచ్చార్సీ) విచారణ నాలుగోరోజూ కొనసాగింది. మంగళవారం సైబరాబాద్ పోలీసులు తెలంగాణ రాష్ట్ర పోలీస్ అకాడమీలో హెచ్చార్సీ విచారణకు హాజరయ్యారు. ఈ సందర్భంగా దిశ నిందితుల ఎన్‌కౌంటర్‌పై హెచ్చార్సీ బృందానికి నివేదిక అందజేసినట్టు సమాచారం. గతనెల 27న దిశను నలుగురు నిందితులు కిడ్నాప్ చేయడం, ఆమెపై లైంగికదాడికి పాల్పడి, హత్యచేయడంతోపాటు, మృతదేహం కాల్చివేతకు సంబంధించి సేకరించిన సాంకేతిక, శాస్త్రీయఆధారాలన్నింటినీ అందజేసినట్టు తెలిసింది. ఘటన జరిగినరోజు నుంచి కేసు ఛేదనలో అత్యంత కీలకంగా ఉపయోగపడిన నిందితులు, లారీ కదలికలు, మార్గమధ్యంలో బంక్ వద్ద పెట్రోల్ కొనుగోలుచేయడం, బాధితురాలి స్కూటీని, లారీని వదిలివెళ్లిన ప్రదేశాల సీసీటీవీ పుటేజీలను నివేదికతోపాటు జతచేసినట్టు తెలిసింది. ఘటనా స్థలంలో సేకరించిన ఫోరెన్సిక్ ఆధారాలు, దిశ వస్తువుల వివరాలు, రక్తపు మరకలకు సంబంధించిన డీఎన్‌ఏ రిపోర్టులను కూడా అందజేశారు. ఈ సందర్భంగా హెచ్చార్సీ బృందం అడిగిన పలు ప్రశ్నలకు సైబరాబాద్ పోలీసులు సమాధానమిచ్చారు. పోలీస్ ఉన్నతాధికారులతోపాటు సీన్ రీకన్‌స్ట్రక్షన్ కోసం తీసుకెళ్లిన పోలీస్ బృందంలో గాయపడిన ఎస్సై, కానిస్టేబుల్ నుంచి ఇప్పటికే సేకరించిన వివరాలను హెచ్చార్సీ బృందం నమోదు చేసుకున్నట్టు తెలిసింది. ఈ నెల 6న దిశ నిందితుల ఎన్‌కౌంటర్ తర్వాత సైబరాబాద్ పోలీసులకు నోటీసులు పంపిన ఎన్‌హెచ్చార్సీ వెనువెంటనే రంగంలోకి దిగింది. శనివారం శంషాబాద్ విమానాశ్రయం చేరుకున్న బృందం అక్కడి నుంచి నేరుగా మహబూబ్‌నగర్ ప్రభుత్వ దవాఖానకు వెళ్లి.. ఎన్‌కౌంటర్ మృతదేహాలను పరిశీలించడంతోపాటు వారి కుటుంబసభ్యుల నుంచి వివరాలు సేకరించింది. సాయంత్రం 6 గంటలకు చటాన్‌పల్లిలో ఘటనలు జరిగిన ప్రాంతాన్ని పరిశీలించింది. ఆదివారం నుంచి తెలంగాణ పోలీస్ అకాడమీలో ఎన్‌కౌంటర్ మృతుల కుటుంబసభ్యులు, దిశ తండ్రి, సోదరి, మృతదేహాలకు పంచానామా నిర్వహించిన నలుగురు తాసిల్దార్లు, క్లూస్‌టీం సభ్యులను విడివిడిగా విచారించి వివరాలు సేకరించింది. గచ్చిబౌలి కేర్ దవాఖానలో చికిత్సపొందున్న ఎస్సై వెంకటేశ్వర్లు, కానిస్టేబుల్ అరవింద్‌రెడ్డి నుంచి వివరాలు సేకరించింది. ఎన్‌హెచ్చార్సీ బృందం బుధవారం ఉదయం ఢిల్లీకి పయనమయ్యే అవకాశాలున్నట్టు సమాచారం. ఎన్‌కౌంటర్‌పై సుప్రీంకోర్టులో వేసిన వ్యాజ్యాలపై విచారణ నేపథ్యంలో సైబరాబాద్ సీపీ సజ్జనార్ మంగళవారం ఢిల్లీ వెళ్లారు. బుధవారం ఆయన సుప్రీంకోర్టుకు హాజరుకానున్నట్టు అధికారులు తెలిపారు.

గాంధీ మార్చురీ వద్ద భారీ బందోబస్తు

బన్సీలాల్‌పేట్: చటాన్‌పల్లి ఎన్‌కౌంటర్ మృతదేహాలను భద్రపర్చిన గాంధీ దవాఖాన మార్చురీ వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు. మంగళవారం గోపాలపురం ఏసీపీ వెంకటరమణ పర్యవేక్షణలో చిలుకలగూడ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ ఎన్ సంజయ్‌కుమార్ నేతృత్వంలో మార్చురీ వద్ద భారీ బందోబస్తు నిర్వహించారు. రోజువారీ పోస్ట్‌మార్టం కార్యకలాపాలు యథావిధిగా కొనసాగేలా చర్యలు తీసుకున్నారు. దవాఖాన సిబ్బంది మినహా ప్రధాన గేటు దాటి ఎవరినీ లోపలకు అనుమతించలేదు. మార్చురీలోకి వెళ్లే వారి నుంచి సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

ఆ రాత్రి ఏం జరిగింది?

- చటాన్‌పల్లి ఎన్‌కౌంటర్‌పై సిట్ దర్యాప్తు ప్రారంభం
- ఆపరేషన్ డిసెంబర్ 6పైనే ప్రత్యేక దృష్టి
- దిశ ఘటనపై నమోదయిన ఎఫ్ఐఆర్‌ల సేకరణ
- అత్యంత గోప్యంగా విచారణ

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:

దిశ కేసులోని నిందితుల ఎన్‌కౌంటర్‌పై రాచకొండ పోలీసు కమిషనర్ మహేశ్ భగవత్ నేతృత్వంలోని స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీం (సిట్) తన దర్యాప్తును ప్రారంభించింది. ఇందులోభాగంగా దిశ లైంగికదాడి, హత్యపై షాద్‌నగర్, శంషాబాద్ పీఎస్‌ల పరిధిలో నమోదయిన ఎఫ్ఐఆర్‌లను సేకరించింది. నిందితుల ఎన్‌కౌంటర్‌పై షాద్‌నగర్‌లో నమోదైన మరోకేసు ఎఫ్ఐఆర్‌ను కూడా తీసుకున్నది. ఈ ఎఫ్ఐఆర్‌లలోఉన్న అంశాలను సూక్ష్మంగా పరిశీలించనున్నది. సిట్‌లో ఉన్న ఏడుగురు సభ్యులకు వివిధ అంశాలపై బాధ్యతలను అప్పగించారు. క్లూస్ టీం సేకరించిన ఆధారాలు, త్రీడీ దృశ్యాల చిత్రీకరణ వంటి వాటిని కూడా పరిశీలించనున్నారు. ప్రధానంగా డిసెంబరు 6న ఏం జరిగింది అనే దానిపై ప్రత్యేక దృష్టి సారించి.. వాస్తవ పరిస్థితులను బయటపెట్టనున్నారు. ఆరోజు జరిగిన పరిణామాలను విశ్లేషించేందుకు 'అపరేషన్ డిసెంబర్ 6' పేరుతో కేసు దర్యాప్తును చేపడుతున్నారు. కోర్టు అనుమతితో డిసెంబర్ 4వ తేదీన నిందితులను కస్టడీలోకి తీసుకున్న పోలీసులు వారిని ఎక్కడకు తీసుకెళ్లి విచారించారు. ఆ రెండు రోజుల విచారణపై ప్రాథమికంగా తమ వాంగ్మూలంలో ఏమి వెల్లడించారు. నిందితులందర్నీ ఒకేసారి విచారించారా? లేదా విడివిడిగా విచారించారా? వాంగ్మూలం రికార్డు సమయంలో చిత్రీకరించే వీడియోను కూడా సిట్ అధికారులు పరిశీలించనున్నారు. 6వ తేదీన నిందితులను తీసుకుని ఎంతమంది పోలీసులు చటాన్‌పల్లి వెళ్లారు. వారికి ఎవరు నాయకత్వం వహించారు. ఎక్కడి నుంచి ప్రయాణం ప్రారంభించారు. అందులో ఎంతమంది వద్ద ఆయుధాలు, మొబైల్ ఫోన్లు ఉన్నాయి అనే వివరాలను సేకరిస్తున్నారు.

అన్‌డిస్ట్లోజ్డ్ ప్రాంతం నుంచి బయలుదేరిన పోలీసులు చటాన్‌పల్లికి ఎంత సమయంలో చేరుకున్నారు? అక్కడికి వెళ్లాక ఎంత సేపటికి దుండగులు ఎదురుతిరిగారు? అనే అంశాలను మ్యాపింగ్ చేయనున్నారు. ఇందుకోసం హైదరాబాద్ నుంచి చటాన్‌పల్లికి వెళ్లే దారిలో ఉన్న సీసీ కెమెరాలను కూడా సిట్ బృందం సేకరిస్తున్నట్టు తెలిసింది. సాంకేతిక పరిజ్ఞానంతో కూడా సిట్ బృందం మరోసారి క్లైమ్‌సీన్‌ను సృష్టించనున్నది. నిందితుల శరీరంలోకి దూసుకెళ్లిన తూటాలు, సంఘటన స్థలంలో దొరికిన తూటాలను పరిశీలించనున్నారు. ఇందుకోసం నిందితుల మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించిన వైద్యులను కూడా పోలీసులు ప్రశ్నించడంతోపాటు వారి నుంచి అధికారికంగా పలు పత్రాలను సేకరించనున్నారు. సైబరాబాద్ పోలీసులు కమిషనర్ ఎదురుకాల్పులు జరిగినప్పుడు మొత్తం 10 మంది పోలీసులు ఉన్నారని చెప్పిన నేపథ్యంలో వారిని ప్రశ్నించనున్నారు. ఇప్పటికే కొంతమందిని ప్రశ్నించిన సిట్ బృందం వారి స్టేట్‌మెంట్లను రికార్డు చేసినట్టు సమాచారం. వారం రోజుల్లో పూర్తిచేసి దర్యాప్తు నివేదికను ప్రభుత్వానికి అందించే అవకాశం ఉన్నది.

దిశ ఘటనలో మరో రెండు పిల్స్

దిశ ఘటన పరిణామాలపై హైకోర్టులో మరో రెండు ప్రజాప్రయోజన వ్యాజ్యాలు దాఖలయ్యాయి. దిశ ఘటనలో నిందితులను ఎన్‌కౌంటర్ చేయడం రాజ్యాంగవిరుద్ధమని పేర్కొంటూ తెలంగాణ సివిల్ లిబర్టీస్ కమిటీ అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ పిల్ దాఖలుచేశారు. పోలీసులు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోవడం ద్వారా నిందితుల జీవించేహక్కును, వ్యక్తిగత స్వేచ్ఛను హరించారని పేర్కొన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం పోలీసుల చర్య చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. మరోవైపు పిల్లలు, మహిళలపై పెరిగిపోతున్న నేరాలకు అడ్డుకట్ట వేసేవిధంగా చర్యలు తీసుకోవాలని హైకోర్టు బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మలుగారి సుదర్శన్ రాసిన లేఖను హైకోర్టు సూమోటో ప్రజాప్రయోజన వ్యాజ్యంగా స్వీకరించింది. మహిళలు, పిల్లలపై నేరాలను అడ్డుకొనేందుకు హైకోర్టు సిట్టింగ్ న్యాయమూర్తి లేదా మాజీ న్యాయమూర్తి నేతృత్వంలో జ్యుడీషియల్ కమిషన్‌ను నియమించాలని సుదర్శన్ కోరారు. ఫిర్యాదు స్వీకరణలో నిర్లక్ష్యం చేసే పోలీసులపై కఠినచర్యలు తీసుకోవాలని అన్నారు. అన్ని పిటిషన్లపై గురువారం విచారణ జరిగే అవకాశం ఉన్నది.

అంతా సైలెంట్

సిట్ బృందం దర్యాప్తు అంతా గోప్యంగా జరుగుతున్నది. దర్యాప్తుచేస్తున్న ఏ ఒక్క అంశం కూడా బయటకు రావద్దని కచ్చితమైన ఆదేశాలు ఉన్నాయి. దీంతో సిట్ దర్యాప్తు విషయాలపై అధికారిక సమాచారం రావడం లేదు. మీడియాకు కూడా లీక్ కావద్దని ఆదేశాలు ఉన్నట్టు తెలిసింది. పోలీసు అధికారులు మీడియా ఫోన్లకు కూడా స్పందించడం లేదు. ఒకవేళ ఫోన్ ఎత్తినా మీరు అడగొద్దు.. మేం చెప్పొద్దంటూ కట్ చేసేస్తున్నారు. విశ్వసనీయంగా సమాచారం వచ్చినా దానిని అధికారికంగా ధ్రువీకరించడం లేదు. సున్నితమైన అంశం కావటంతో దర్యాప్తు అధికారులు విచారణకు వెళ్లే సమయంలో సివిల్ దుస్తుల్లో వెళ్తున్నట్టు సమాచారం.

సాంకేతిక లోపంతో నిలిచిన గౌతమి ఎక్స్‌ప్రెస్

మరో రైలులో ప్రయాణికుల తరలింపు

కేసముద్రంటౌన్: సాంకేతిక లోపంతో గౌతమి ఎక్స్‌ప్రెస్ మహబూబాబాద్ జిల్లా కేసముద్రం రైల్వేస్టేషన్‌లో మంగళవారం తెల్లవారుజామున నిలిచింది. లింగంపల్లి నుంచి కాకినాడ వెళ్లే గౌతమి ఎక్స్‌ప్రెస్ డోర్నకల్ - కాజీపేట జంక్షన్‌లోని నెక్కొండ రైల్వే స్టేషన్ దాటిన తరువాత బీ-3 బోగి ఒక వైపు వంగినట్టు టీసీ, ప్రయాణికులు గుర్తించి డ్రైవర్‌కు సమాచారమిచ్చారు. దీంతో డ్రైవర్ కేసముద్రం రైల్వేస్టేషన్ వద్ద రైలు నిలిపివేశారు. సమాచారమందుకున్న సిబ్బంది గౌతమి ఎక్స్‌ప్రెస్ నుంచి బీ-3 ఏసీ బోగిని తొలగించి రైలును పంపించారు. కాగా గౌతమి ఎక్స్‌ప్రెస్ కేసముద్రం రైల్వేస్టేషన్‌కు సోమవారం రాత్రి 1.45 నిమిషాలకు వచ్చి ఉదయం 5.20 గంటలకు వెళ్లిపోయింది. దీంతో సుమారు నాలుగు గంటల పాటు ప్రయాణికులు చలిలో తీవ్ర ఇబ్బందులుపడ్డారు. బీ-3 ఏసీ బోగీలోని ప్రయాణికులను నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్‌లో పంపించారు. దీంతో పలు రైల్లు ఆలస్యంగా నడిచాయి.

Telangana State Co-operative Marketing Federation Ltd.,

CORRIGENDUM-II

In continuation to the tender notification dated 20.11.2019, the tender floated in tender platform http://tender.telangana.gov.in for the Tender Id-154425 and the Corrigendum issued dated on 28.11.2019. Following are the partial modifications on dates of submission of bid, opening of Technical bid and opening of Financial Bid for Online sealed tendering on disposal of Agricultural Commodities procured by TS MARKFED & HACA 2018-19.

(1) Bid submission end date: 20.12.2019 up to 05:00 PM. (2) Opening of Technical bid date: 21.12.2019 from 11:00 AM. (3) Opening of Financial Bid date: 23.12.2019 at 02:00 PM.

For online registration and further details please contact Mr. Sandeep Ph: 8096685509 and 7337318404 (Service providers M/s.Vupadhi Techno Services Pvt. Ltd). For further details please contact. Ph: 7288879806, and 7288879829.

Sd/-
Dt. 10.12.2019 MANAGING DIRECTOR

తెలంగాణ ప్రభుత్వం
అటవీ శాఖ, ముఖ్య అటవీ సంరక్షణాధికారి కార్యాలయము, నిజామాబాద్ సర్కిల్, నిజామాబాద్

లెఖ నెం.4092/2016/యం.3. టెండరు ప్రకటన తేది:04-12-2019

రిజిస్టర్ కాబడిన కాంట్రాక్టర్లు, బీడీ తయారు చేయువారు, ఎగుమతి చేయువారు, మొదలగు వారి నుండి 2017 బీడీ ఆకుల సీజన్లో బీడీ ఆకులు సేకరించబడి, అగ్రిమెంట్ రద్దు చేయబడిన **యూనిట్ నంబరు మరియు పేర్లు** (9) 259 మంచిప్ప, 261 నిజాంసాగర్, 262 పిట్లం, 263 వడ్లపేట్, 264 హన్మాజీపేట్, 265 తెల్లాపూర్, 268 తిమ్మాయిపేట్, 269 వెల్లుట్ల, 270 యెల్లారెడ్డి యూనిట్ల నుండి బీడీ ఆకుల కొనుగోలు చేయుటకు సీలు వేయబడిన టెండర్లు ఆహ్వానించడమైనది. టెండరు తీసుకొను వివరములు (6వ టెండరు) 12-12-2019 మ. 1.00 గం.ల వరకు. (7వ టెండరు) 19-12-2019 మ. 1.00 గం.ల వరకు. టెండరు తెరుచుట మరియు తుది నిర్ణయము తీసుకొను వివరములు : (6వ టెండరు) 12-12-2019 మ. 4.00 గం.ల వరకు. (7వ టెండరు) 19-12-2019 మ. 4.00 గం.ల వరకు. ఇతర వివరములకు పైన తెలిపిన కార్యాలయంలో సంప్రదించగలరు.

DIPR RO No. 1931-DP/CL/Advt/1/2019-20, Dt: 10/12/2019 సం/- ముఖ్య అటవీ సంరక్షణాధికారి

తెలంగాణ ప్రభుత్వము
సూపరింటెండింగ్ ఇంజినీర్ కార్యాలయం, గిరిజన సంక్షేమం, హైదరాబాద్

NIT No. SE/TW/HYD/243to248/2019-20 ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన తేది: 09-12-2019 (2వ,3వ పిలుపు)

పనుల సంఖ్య (6), పనుల పేరు: దిగువ సంతకందారు పరిధిలో బిటి రోడ్ వేయుట, 13 ప్యాసింజర్ సామర్థ్యం గల లిఫ్టుల 2 నం.లు. సరఫరా మరియు అమర్చుట, లైటెనింగ్ అరెస్టర్ ఏర్పాటు చేయుట మరియు ఇతర అన్ని సివిల్ పనులు. మొత్తం ECV: రూ. 3.74 కోట్లు. బిడ్ దాఖలు ప్రారంభ & ముగింపు తేది:12-12-2019న సా. 5.00 గం. నుండి 20-12-2019న మ. 3.00 గం.వరకు. సాంకేతిక బిడ్ తెరుచు తేది: 20-12-2019న సా. 4.00 గం. వాణిజ్య బిడ్ తెరుచు తేది: 21-12-2019న సా. 5.00 గం., తదుపరి వివరాలను ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్: https://tender.telangana.gov.in//లో చూడవచ్చును.ఫోన్ నెం. 040-23315950, ఇమెయిల్: ID:setwhyd13@gmail.com.

సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్, గిరిజన సంక్షేమం, 5వ అంతస్తు, DSS భవన్, మాసాబ్ ట్యాంక్, హైదరాబాద్

DIPR R.O.No. 1925 DP/CL/Advt/1/2019-20 తేది: 10-12-2019

గిరిజన ప్రాంతాలకు రోడ్లు వేయండి

- ఎంపీల నుంచి ఎక్కువ ప్రతిపాదనలు స్వీకరించాలి
- టీఆర్ఎస్ లోక్‌సభ పక్షనేత నామా నాగేశ్వర్‌రావు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన (పీఎంజీఎస్‌వై) కింద గిరిజన ప్రాంతాలకు రోడ్డు సౌకర్యం కల్పించేందుకు ఎక్కువ నిధులు కేటాయించాలని టీఆర్ఎస్ లోక్‌సభ పక్షనేత, ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వర్‌రావు డిమాండ్‌చేశారు. పార్లమెంట్ సమావేశాల్లో భాగంగా మంగళవారం ఆయన లోక్‌సభలో మాట్లాడుతూ.. పీఎంజీఎస్‌వైతో రహదారి అందుబాటులో లేని మారుమూల గ్రామాలకు రోడ్డు అనుసంధానం చేయడం చాలా మంచి కార్యక్రమమని అన్నారు. దీనికింద రాష్ట్రాలకు రెండు, మూడు వేల కి.మీ. అంటూ పరిమితులు పెట్టకుండా, గిరిజన ప్రాంతాల్లో రహదారి సౌకర్యం కల్పించేందుకు పరిమితి లేకుండా ఎక్కువ ప్రతిపాదనలు స్వీకరించాలని సంబంధిత మంత్రిని ఆయన కోరారు. ఇప్పటికీ దేశంలో చాలా గ్రామాలకు రోడ్డు అనుసంధానం లేదని, కొన్ని గ్రామీణ ప్రాంతాల్లో బస్సు, రైలును కూడా చూడని ప్రజలు ఉన్నారని చెప్పారు. స్పందించిన కేంద్ర మంత్రి.. పీఎంజీఎస్‌వై కింద రోడ్ల మంజూరులో ఎంపీలకే ప్రాధాన్యం ఇస్తామని, నామా ప్రతిపాదించిన రోడ్లను మంజూరుచేయడంతోపాటు నిధులు విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. పరిమితులు లేకుండా రోడ్ల ప్రతిపాదనలు తీసుకొనే అంశంపై సానుకూలంగా స్పందించారు.

ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్ల పొడిగింపు బిల్లుకు టీఆర్ఎస్ మద్దతు

ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లు మరో పదేండ్లు పొడిగించేందుక

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామికి హుండీ ద్వారా రూ.93.56 లక్షల ఆదాయం సమకూరింది. మంగళవారం ఆలయ ఓపెన్‌స్లాబ్‌పై నిర్వహించిన లెక్కింపులో 128 గ్రాముల బంగారం, 7.2 కిలోల వెండి వచ్చిందని, ఇది కేవలం 14 రోజులదేనని ఈవో కృష్ణవేణి తెలిపారు. - వేములవాడ కల్చరల్

మానవ నిర్మిత గొప్ప రాతికట్టడం ఎన్నెస్పీ

ప్రాజెక్టు ఎస్ఈ మధుసూధన్

నాగార్జునసాగర్ పైలాన్ వద్ద పూజలు నిర్వహిస్తున్న ఎన్నెస్పీ ఎస్ఈ మధుసూధన్, అధికారులు, సిబ్బంది

నందికొండ: మానవ నిర్మిత గొప్ప రాతి కట్టడం నాగార్జునసాగర్ డ్యాం అని ఎన్నెస్పీ ఎస్ఈ మధుసూధన్ పేర్కొన్నారు. నాగార్జునసాగర్ ప్రాజెక్ట్‌కు పునాది వేసి 64 ఏండ్లు పూర్తయిన సందర్భంగా మంగళవారం నాగార్జునసాగర్ పైలాన్‌కాలనీలో డ్యాం శంకుస్థాపన పిల్లర్ వద్ద ఎన్నెస్పీ సిబ్బందితో కలిసి ఆయన పూజలు నిర్వహించారు. అమరవీరుల స్తూపానికి, డ్యాం నిర్మాణంలో పాలుపంచుకున్న ఇంజినీర్ మీర్‌జాఫర్ అలీ విగ్రహానికి పూలమాల వేసి, డ్యాం నిర్మాణంలో ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళులర్పించారు. 1955లో డ్యాంకు శంకుస్థాపన జరిగిందని.. 12 ఏండ్ల పాటు 4 వేల మంది కార్మికులు నిరంతరం పని చేశారని ఎస్ఈ తెలిపారు. స్వదేశీ ఇంజినీర్ల పరిజ్ఞానం, మానవశక్తితో నిర్మించిన రాతి అనకట్టల్లో నాగార్జునసాగర్ ప్రాజెక్టు ప్రపంచంలోనే మొదటిదన్నారు. ఈసారి డ్యాంలో పుష్కలంగా నీరుండటంతో రెండు పంటలకు నీటి కొరత లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఈఈ యలమంద, ఎంపీపీ అనురాధరెడ్డి, ఎస్‌పీఎఫ్ ఆర్ఐ పవన్‌కుమార్, డీఈలు సాల్మన్, విజయకుమార్, సుదర్శన్‌రావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీ ద్వారా గోదావరి జలాలు తరలిరావడంతో సూర్యాపేట జిల్లాలోని ఆత్మకూర్(ఎస్) మండలం రామన్నగూడెంలోని రామసముద్రం చెరువు 20 ఏండ్ల తర్వాత నిండుకుండలా మారి అలుగుపోస్తున్నది. ఈ సందర్భంగా గ్రామస్థులు, టీఆర్ఎస్ నాయకులు మంగళవారం చెరువు వద్ద సీఎం కేసీఆర్, మంత్రి జగదీశ్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. - ఆత్మకూర్ ఎస్

ఎదురెక్కిన గోదారమ్మ

కార్మిక క్షేత్రానికి కాళేశ్వర జలాలు

మేడిగడ్డ నుంచి 172 కిలోమీటర్లు ఎగువకు

బ్యాక్‌వాటర్‌తో పాపికొండలను తలపిస్తున్న సిరిసిల్ల శివారు

కరీంనగర్ ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ: గోదారి కొత్త నడక నేర్చింది. అపరభగీరథుడు సీఎం కేసీఆర్ సంకల్పబలంతో మేడిగడ్డ నుంచి తనదిశను మార్చుకొని పయనించింది. బరాజ్‌లు, పంప్‌హౌస్‌లు దాటుకుంటూ ఎదురెక్కింది. రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలంలోని శ్రీరాజరాజేశ్వర (మధ్యమానేరు) జలాశయాన్ని నిండుకుండలా మార్చి, మానేరు వాగుమీదుగా ఎదురెక్కింది. దాదాపుగా 17 కిలోమీటర్ల దూరంలో ఉన్న సిరిసిల్ల జిల్లా కేంద్రాన్ని తాకింది. మొత్తంగా గోదారి మేడిగడ్డ నుంచి 172 కిలోమీటర్ల దూరంలో మెట్ట ప్రాంతమైన రాజన్న సిరిసిల్ల జిల్లాను ముద్దాడింది. సముద్రమట్టానికి దాదాపుగా 1,250 అడుగుల ఎత్తులో ఉన్న ఈ ప్రాంతానికి గోదావరి జలాలు రావడం చరిత్రను తిరగరాసినట్టయింది.

ఎస్సారార్ ప్రాజెక్టుకు జలకళ

కాళేశ్వరం జలాల రాకతో శ్రీరాజరాజేశ్వర జలాశయం జలకళను సంతరించుకొన్నది. నంది, గాయత్రి పంప్‌హౌస్‌ల మీదుగా గోదావరి తరలివస్తుండడంతో నీటిమట్టం క్రమంగా పెరుగుతున్నది. ప్రాజెక్టు సామర్థ్యం 25.873 టీఎంసీలు కాగా, మంగళవారం సాయంత్రం 6 గంటల వరకు 23.109 టీఎంసీలకు చేరింది. మరో రెండు మూడు రోజుల్లో జలాశయం నిండనున్నది. మంగళవారం ఎల్ఎండీ జలాశయానికి అధికారులు రివర్స్ స్లూయిస్(తూములు) ద్వారా నీటిని విడుదల చేశారు. ప్రాజెక్టు పరీశీలనలో భాగంగా సాంకేతికపరంగానే దిగువకు నీటిని వదులుతున్నట్టు ఈఈ అశోక్‌కుమార్ తెలిపారు.

ఆహ్లాదకరంగా మానేరు వంతెన

శ్రీరాజరాజేశ్వర ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ సిరిసిల్ల-తంగళ్లపల్లి మానేరు వంతెనను దాటి ఎదురెళ్తున్నాయి. మానేరు వంతెన దాటి సిరిసిల్లలోని గంగమ్మ ఆలయం, బతుకమ్మ ఘాట్లకు చేరనున్నాయి. ఇప్పటికే సిరిసిల్ల శివారులోని రామప్ప ఆలయం నీట మునగగా, తంగళ్లపల్లి మండలం చింతలఠాణ గుట్టలు, రామప్ప గుట్టల మధ్య జలదృశ్యం కనువిందు చేస్తున్నది. సిరిసిల్ల మానేరు వంతెన రాజమండ్రి బ్రిడ్జిలా కనిపిస్తున్నది. కాళేశ్వరజలాలతో రైతుల పాదాలు కడుగుతామని సీఎం కేసీఆర్ చెప్పిన మాటను నిజం చేశారు. ఎస్సారార్ ప్రాజెక్టు నీటితో మానేరు వంతెనకు 24 గంటలు నీరుండేలా చర్యలు తీసుకోవడంతోపాటు మానేరువంతెనను రాజమండ్రిలోని జల దృశ్యంలా.. కోనసీమ, పాపికొండల అందాలు ఉట్టిపడేలా పర్యాటకంగా మారుస్తామని మంత్రి కేటీఆర్ చెప్పిన విధంగానే జలాలను తెచ్చి మాటను నిలుపుకున్నారు.

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రానికి సమీపంలోని ఎస్సార్ఆర్ జలాశయం ఏరియల్ వ్యూ (ఇన్‌సెట్‌లో) నిండుగా కనిపిస్తున్న మానేరు వాగు

కొనసాగుతున్న ఎత్తిపోతలు

కాళేశ్వరం ఆరోప్యాకేజీ పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలంలోని నంది పంప్‌హౌస్ నుంచి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. మంగళవారం 4, 6 పంపులు 6,300 క్యూసెక్కుల నీటిని నంది రిజర్వాయర్‌కు ఎత్తిపోయగా, అక్కడి నుంచి జంట సొరంగాల ద్వారా గాయత్రిపంప్‌హౌస్‌కు చేరుతున్నాయి. 1, 3 బాహుబలి పంపుల నుంచి గ్రావిటీ, వరదకాల్వల మీదుగా ఎస్సార్ఆర్ జలశాయానికి జలాలు పరుగులు తీస్తున్నాయి.

మంత్రి కేటీఆర్ ఔదార్యం

బాలిక వైద్యానికి ఆర్థికసాయం

బాలిక అనుశ్రీ

సిరిసిల్ల రూరల్ : రాష్ట్ర ఐటీ, మున్సిపల్, పరిశ్రమలశాఖ మంత్రి కేటీఆర్ మరోసారి ఔదార్యం చాటుకున్నారు. వినికిడి సమస్యతో బాధపడుతున్న 4వ తరగతి చదువుతున్న బాలిక వైద్యానికి భరోసా అందించారు. ఆపరేషన్‌కు సహాయం చేస్తానని మాటిచ్చారు. రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం సారంపల్లికి చెందిన శంకర్-దివ్య దంపతుల కుమార్తె అనుశ్రీ (11) నాలుగో తరగతి చదువుతున్నది. శంకర్ ఉపాధి కోసం దుబాయ్ వెళ్లగా.. అనుశ్రీ చిన్న వయస్సులోనే ఒక చెవి వినికిడి శక్తిని పూర్తిగా కోల్పోగా మరో చెవి 30 శాతం మాత్రమే వినిపిస్తుండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నది. ఆపరేషన్ చేయిస్తేనే వినికిడి వస్తుందని వైద్యులు తెలిపారు. ఆపరేషన్‌కు రూ.9.08 లక్షలు ఖర్చవుతుందని చెప్పడంతో విద్యార్థిని తల్లి దివ్య ఆందోళన చెందింది. అనుశ్రీ కుటుంబసభ్యులు స్థానిక టీఆర్ఎస్ నేతలు ఎరవెల్లి వెంకటరమణారావు, గండ్ర రమేశ్‌రావు, విడుగురాళ్ల బాలరాజుకు విషయం చెప్పగా వారు.. మంగళవారం అనుశ్రీని మంత్రి కేటీఆర్ వద్దకు తీసుకెళ్లి సమస్యను వివరించారు. స్పందించిన మంత్రి రెండ్రోజుల్లో ఆపరేషన్ ఏర్పాట్లు చేయిస్తామని భరోసా కల్పించారు. దీంతో మంత్రి కేటీఆర్‌కు రుణపడి ఉంటామని మంత్రికి అనుశ్రీ తల్లి దివ్య కృతజ్ఞతలు తెలిపారు.

బాన్సువాడ మండలం కొత్తబాది కస్తూర్బా పాఠశాలలో ఉప్మా నాసిరకంగా ఉండడంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి

బ్రాహ్మణుల సంక్షేమానికి కృషి

స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి

బాన్సువాడ, నమస్తే తెలంగాణ: బ్రాహ్మణుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదని స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన బాన్సువాడ పట్టణంలోని టీచర్స్‌కాలనీలో నిర్మిస్తున్న బ్రాహ్మణ సంఘం భవన నిర్మాణ పనులను పరిశీలించారు. సీఎం కేసీఆర్ అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నారన్నారు. అనంతరం బ్రాహ్మణ సంఘ సభ్యులు స్పీకర్ ను సన్మానించారు. అంతకు ముందు ఆయన కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలం కొత్తబాది కస్తుర్బాగాంధీ పాఠశాలను పరిశీలించారు. అక్కడవండిన ఉప్మా నాసిరకంగా ఉండడంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మరుగుదొడ్లు పరిశుభ్రంగా లేకపోవడం, ఫ్యాన్లు, లైట్లు పని చేయకపోవడంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలకు సిఫారసు చేస్తానని హెచ్చరించారు.

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సత్యవతి రాథోడ్, చిత్రంలో ఎర్రోళ్ల శ్రీనివాస్, తదితరులు

ఎస్సీ, ఎస్టీ సమస్యలకు సత్వర పరిష్కారం

మంత్రి సత్యవతి రాథోడ్

మహబూబాబాద్, నమస్తే తెలంగాణ: దళిత, గిరిజనుల సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని గిరిజన, స్త్రీశిశు సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్ పేర్కొన్నారు. మంగళవారం మహబూబాబాద్ కలెక్టరేట్‌లో ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ నేతృత్వంలో నిర్వహించిన సమీక్షకు మంత్రి హాజరై మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన పెండింగ్ కేసులను పరిష్కరించేందుకు కమిషన్ కవచంలా పని చేస్తున్నదని అన్నారు. అనంతరం ఎర్రోళ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడిన తరువాత ఎస్సీ, ఎస్టీ కమిషన్ ద్వారా ఆరు వేల కేసులను పరిష్కరించి రూ. 40 కోట్ల నష్టపరిహారం ఇప్పించామని చెప్పారు. సమావేశంలో కమిషన్ సభ్యులు విద్యాసాగర్, రామ్ బాల్ నాయక్, జెడ్పీ చైర్‌పర్సన్ అంగోత్ బిందు, ఎమ్మెల్యే శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కరీంనగర్‌లో గ్రామపంచాయతీలకు అందజేసిన ట్రాక్టర్‌నడుపుతున్న మంత్రి గంగుల

పట్టణాలకు దీటుగా పల్లెల అభివృద్ధి

మంత్రి గంగుల కమలాకర్

కరీంనగర్ కార్పొరేషన్, నమస్తే తెలంగాణ: పట్టణాలకు దీటుగా పల్లెలు అభివృద్ధి చెందాలనీ, ఆ దిశగా రాష్ట్ర సర్కారు కృషి చేస్తున్నదని బీసీ సంక్షేమ, పౌరసరఫరాలశాఖ మంత్రి గంగుల కమలాకర్ పేర్కొన్నారు. మంగళవారం కరీంనగర్ జిల్లాలో పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో మంత్రి పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలోని ఎంపీపీ కార్యాలయంలో గ్రామ పంచాయతీలకు మంజూరైన ట్రాక్టర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పల్లెల్లో ఆరోగ్యకరమైన వాతావరణం రూపొందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణకు పంచాయతీలపై భారం పడకుండా ఉండాలనే సీఎం కేసీఆర్ సబ్సిడీపై ట్రాక్టర్లను అందించారని చెప్పారు. అనంతరం చొప్పదండి ఝాన్సీ విద్యాలయంలో సైన్స్ ఫెయిర్ ముగింపు సమావేశానికి హాజరై, మాట్లాడారు. విజ్ఞాన ప్రదర్శనలు తాత్కాలికం కాకుండా భవిష్యత్ తరాలకు దారిచూపేలా ఉండాలని సూచించారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఏనుగు రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మణ్‌వి అర్థరహిత విమర్శలు

మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

మహబూబాబాద్ జిల్లా తొర్రూరులో మాట్లాడుతున్న మంత్రి దయాకర్‌రావు

తొర్రూరు, నమస్తే తెలంగాణ/వరంగల్ అర్బన్ కలెక్టరేట్: రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి చూసి ఓర్వలేక బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ అర్థరహిత విమర్శలు చేస్తున్నారని రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరులో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రూ.వేల కోట్లు వెచ్చించి తెలంగాణలో ప్రాజెక్టులు కడుతుంటే కేంద్రం ఒక్క పైసా కూడా ఇవ్వలేదని మంత్రి ఆరోపించారు. రాష్ట్రంలో ఆర్థిక సంక్షోభం మీద మాట్లాడే బీజేపీ నాయకులు కేంద్రంలో ఉన్న సంక్షోభంపై ఎందుకు మాట్లాడడం లేదని విమర్శించారు. పింఛన్ల పంపిణీలో కేంద్రం వాటా చెల్లించడం లేదన్నారు. ఐదేండ్లలో రాష్ట్రం నుంచి రూ.2.71లక్షల కోట్లు తీసుకున్న కేంద్రం రాష్ట్రానికి ఇచ్చింది మాత్రం కేవలం రూ.32 వేల కోట్లు అని చెప్పారు. ఇతర రాష్ట్రాలు తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధిని పొగుడుతున్నాయని, రాష్ట్రానికి స్వచ్ఛభారత్ తదితర విషయాల్లో ఎన్నో అవార్డులు వచ్చాయని గుర్తు చేశారు. అంతకుముందు మంత్రి అంతర్జాతీయ మానసిక దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని హన్మకొండ బాలసముద్రంలోని మల్లికాంబ మనోవికాస కేంద్రంలో మానసిక దివ్యాంగులు తయారు చేసిన వస్తువులను పరిశీలించి బాగున్నాయని కితాబు ఇచ్చారు. కార్యక్రమంలో ఆగ్రోస్ చైర్మన్ లింగపల్లి కిషన్‌రావు, కార్పొరేటర్లు కే మాధవిరెడ్డి, మిర్యాలకార్ దేవేందర్ పాల్గొన్నారు.

సిద్దిపేట రైతుబజార్‌లో ఇర్కోడు మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో తయారు చేసిన చికెన్, మటన్ పచ్చళ్లు, ఇతర మాంసం పదార్థాల స్టాళ్లను మంగళవారం జెడ్పీ చైర్‌పర్సన్ వేలేటి రోజారాధాకృష్ణ శర్మ, జాతీయ మాంసం పరిశోధన సంస్థ డైరెక్టర్ వైద్యనాథన్‌తో కలిసి మంత్రి హరీశ్‌రావు ప్రారంభించారు. మన సిద్దిపేట బ్రాండ్ పేరుతో ప్రజలకు నాణ్యమైన మాంసం ఉత్పత్తులు అందజేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. - సిద్దిపేట కలెక్టరేట్, నమస్తే తెలంగాణ

హైదరాబాద్ మంత్రుల నివాస ప్రాంగణంలోని మంత్రి జగదీశ్‌రెడ్డి నివాసంలో మంగళవారం సాయంత్రం సూర్యాపేట నియోజకవర్గ పరిధిలోని పెన్‌పహాడ్, చివ్వెంల, ఆత్మకూర్(ఎస్) మండలాలలో అంతర్గత రహదారుల నిర్మాణంపై పంచాయతీ రాజ్ ఈఈ జోగారెడ్డి, డీఈ మనోహర్, అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. - హైదరాబాద్, నమస్తే తెలంగాణ

కుర్మ భూపాల్, గులాబ్‌రాణా (ఫైల్)

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురి మృతి

పాపన్నపేట/ఏటూరునాగారం: వేర్వేరురోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృతి చెందారు. మెదక్ జిల్లా పాపన్నపేట మండలంలోని శానాయిపల్లి శివారులో మంగళవారం తెల్లవారుజామున ఆగిఉన్న లారీని ఆటో ఢీకొట్టిన ఘటనలో రామతీర్థం గ్రామానికి చెందిన డ్రైవర్ కుర్మ భూపాల్(22) అక్కడికక్కడే మృతి చెందగా మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. మెదక్ ఏరియా దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యలో ఉత్తరప్రదేశ్ మీరట్ జిల్లాకు చెందిన గులాబ్ రాణా(22) మృతి చెందాడు. పాపన్నపేటకు చెందిన వంశీగౌడ్, ఉత్తరప్రదేశ్‌కు చెందిన అథిక్ రహమాన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తునట్టు ఎస్సై తెలిపారు. ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలోని చిన్నబోయినపల్లి-తాడ్వాయి మధ్యలో మంగళవారం రాత్రి కారు అదుపు తప్పి చెట్టుకు ఢీకొట్టిన ఘటనలో మంచిర్యాలకు చెందిన సూర్యకళ(40), కుమార్తె బెస్లీ విక్టోరియా(19) మృతి చెందారు. కుమారుడు విక్టర్ దయాల్‌కు గాయాలయ్యాయి. వీరు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరుకు వివాహానికి వెళ్తుండగా ప్రమాదానికి గురయ్యారు.

చలికాలం

జిల్లా	కనిష్ఠం	గరిష్ఠం			
			నాగర్‌కర్నూల్	17.0	29.1
			జగిత్యాల	17.0	30.0
			జనగామ	17.1	28.0
ఆదిలాబాద్	13.2	29.3	నల్లగొండ	17.2	30.4
వికారాబాద్	13.2	32.4	ములుగు	18.5	30.0
మెదక్	15.0	32.3	సూర్యాపేట	18.0	28.0
వనపర్తి	15.9	33.7	జయశంకర్ భూపాలపల్లి	18.0	29.0
కుమ్రంభీం ఆసిఫాబాద్	16.0	31.0	మహబూబాబాద్	18.0	29.0
మంచిర్యాల	16.0	32.8	జోగులాంబ గద్వాల	18.2	31.0
కరీంనగర్	16.9	34.2	సంగారెడ్డి	18.4	29.2
సిద్దిపేట	17.0	28.0	నిజామాబాద్	18.4	30.2
రంగారెడ్డి	17.0	28.0	మహబూబ్‌నగర్	18.5	29.2
రాజన్న సిరిసిల్ల	17.0	29.0	నారాయణపేట	18.5	29.2
కామారెడ్డి	17.0	29.0	వరంగల్ అర్బన్	18.5	30.0
యాదాద్రి భువనగిరి	17.0	29.0	భద్రాద్రి కొత్తగూడెం	19.0	30.0
పెద్దపల్లి	17.0	29.0	ఖమ్మం	19.0	30.0
వరంగల్ రూరల్	17.0	29.0	హైదరాబాద్	20.2	29.1
నిర్మల్	17.0	29.0	మేడ్చల్	20.2	29.1

నిర్మల్ కోర్టుకు అక్బరుద్దీన్ ఓవైసీ

కోర్టుకు హాజరవుతున్న అక్బరుద్దీన్ ఓవైసీ

నిర్మల్ అర్బన్, నమస్తే తెలంగాణ: గతంలో వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన కేసులో ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ మంగళవారం నిర్మల్ కోర్టుకు హాజరయ్యారు. నిర్మల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల(ఎన్టీఆర్ మినీ స్టేడియం)లో 2012 డిసెంబర్ 24న నిర్వహించిన ఓ బహిరంగ సభలో ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ వివాదాస్పద వ్యాఖ్యలు చేయగా, నిర్మల్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ నేపథ్యంలో కేసులో భాగంగా నిర్మల్ కోర్టుకు హాజరయ్యారు. జూనియర్ సివిల్ జడ్జి రామలింగం ఎదుట హాజరైన అక్బరుద్దీన్ తన కేసును నాంపల్లి కోర్టుకు బదిలీ చేసుకున్నారు.

క్రీడాభివృద్ధికి ప్రభుత్వం అన్నివిధాలా కృషి చేస్తున్నదని క్రీడాశాఖ మంత్రి డాక్టర్ వీ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఆదివారం మహబూబ్‌నగర్ టీఎన్‌జీవోస్ భవనం ఇండోర్ స్టేడియంలో రాష్ట్ర స్థాయి అండర్-14 బాల బాలికల ఎస్‌జీఎఫ్ షటిల్ బ్యాడ్మింటన్ టోర్నీ ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. బాలుర విభాగంలో విజేతగా ఖమ్మం, బాలికల విభాగంలో హైదరాబాద్ నిలువగా, విజేతలకు ట్రోఫీలను ప్రదానం చేశారు. -మహబూబ్‌నగర్ స్పోర్ట్స్

రైతు భూమిలో బయటపడిన ఇనుప ఖనిజం!

బయట పడిన రాళ్లను చూపిస్తున్న రైతు

బచ్చన్నపేట : జనగామ జిల్లా బచ్చన్నపేట మండలంలోని వీఎస్ఆర్‌నగర్‌కు చెందిన చిన్నోళ్ల నర్సయ్య వ్యవసాయ భూమిలో ఇనుప ఖని జంఆనవాళ్లు బయటపడ్డాయి. కట్కూరు శివారులో నర్సయ్యకు 12 ఎకరాల భూమి ఉండగా 8 ఎకరాల్లో సాగు చేస్తున్నాడు. నీరు లేక 4 ఎకరాలు బీడుగా ఉండేది. ఇటీవల గోదావరి జలాల రాకతో దానిని సాగులోకి తెచ్చేందుకు ట్రాక్టర్‌తో పనులు చేస్తుండగా చిన్నచిన్న రాళ్లు బయటపడ్డాయి. మామూలు రాళ్లకు భిన్నంగా వీటి నుంచి ఇనుములా శబ్దం వస్తుండటంతోపాటు అయస్కాంతంలా అతుక్కుంటున్నాయి. దీంతో వాటిని చూసేందుకు చుట్టుపక్కల గ్రామాల వారు తరలివస్తున్నారు.

సిరీస్‌కు సై

నేడు వాంఖడే వేదికగా భారత్, వెస్టిండీస్ ఫైనల్ పోరు

రోహిత్

ఎక్కడ పోగొట్టుకున్నామో అక్కడే వెతుక్కోవాలన్న చందంగా.. మూడేండ్ల క్రితం పొట్టి ప్రపంచకప్ సెమీఫైనల్లో కరీబియన్ల చేతిలో ఓడిన చోటే వారిని చిత్తుచేసి సిరీస్ పట్టాలని టీమ్‌ఇండియా ఉవ్విళ్లూరుతున్నది. ముంబై వేదికగా టీ20 వరల్డ్‌కప్ (2016) సెమీస్‌లో వెస్టిండీస్ చేతిలో ఓడిన భారత్.. మూడో మ్యాచ్ నెగ్గి సిరీస్ కైవసం చేసుకోవాలని చూస్తున్నది. ఛేజింగ్‌లో దుమ్మురేపుతున్నా.. లక్ష్యాన్ని నిర్దేశించడంలో మాత్రం మనవాళ్లు విఫలమవుతున్నారు. బలమైన బ్యాటింగ్ లైనప్ ఉన్న విరాట్ సేన.. బౌలింగ్, ఫీల్డింగ్‌పై కాస్త దృష్టిపెడితే మూడేండ్ల క్రితం పరాజయానికి ప్రతీకారం తీర్చుకోవడం పెద్ద కష్టమేంకాదు. మరోవైపు వాంఖడేలో అపార అనుభవం ఉన్న పొలార్డ్ సారథ్యంలో సత్తాచాటి సిరీస్ కొల్లగొట్టాలని కరీబియన్లు కృతనిశ్చయంతో ఉన్నారు.

ముంబై: సొంతగడ్డపై చాన్నాళ్ల తర్వాత టీమ్ ఇండియా చావోరేవో స్థితిలో నిలిచింది. భారత్, వెస్టిండీస్ మధ్య జరుగుతున్న మూడు టీ20ల సిరీస్‌లో ఇరు జట్లు చెరో మ్యాచ్ నెగ్గడంతో పోరు రసవత్తరంగా మారింది. భాగ్యనగరంలో భారత్ పైచేయి సాధిస్తే.. తిరువనంతపురంలో విండీస్ లెక్క సరిచేసింది. చివరి మ్యాచ్‌లో గెలిచిన వారికే ట్రోఫీ దక్కుతుంది. గత మ్యాచ్ విజయం ఇచ్చిన ఉత్సాహంలో విండీస్ కదనానికి సై అంటుంటే.. తొలి టీ20లో గెలిచినా ఫీల్డింగ్ సమస్యలతో సతమతమవుతున్న విరాట్ సేన్ సిరీస్ ఒడిసిపట్టాలని చూస్తున్నది. మూడేండ్ల క్రితం టీ20 ప్రపంచకప్ సెమీఫైనల్లో విండీస్ చేతిలో ఓడాక ఇరు జట్లు తొలిసారి వాంఖడేలో తలపడనున్నాయి. ఆ మ్యాచ్‌లో విండీస్‌ను గెలిపించిన సిమన్స్.. తాజాగా రెండో టీ20లోనూ సత్తాచాటి మంచి జోరుమీదున్నాడు. ఐపీఎల్లో ముంబైకి ప్రాతినిధ్యం వహించే పొలార్డ్‌కు వాంఖడే కొట్టిన పిండే.

హిట్‌మ్యాన్ హిట్టైతే.. ముంబై మోతెక్కాల్సిందే

ఈ సిరీస్‌లో ఇప్పటి వరకు పెద్దగా ప్రభావం చూపని హిట్‌మ్యాన్ రోహిత్ శర్మ సొంత మైదానంలో సత్తాచాటాలని ఉవ్విళ్లూరుతుంటే.. మరో ఓపెనర్ లోకేశ్ రాహుల్ ఫామ్ కొనసాగించాలని చూస్తున్నాడు. తొలి మ్యాచ్‌లో సూపర్ ఇన్నింగ్స్‌తో జట్టును గెలిపించిన కెప్టెన్ కోహ్లీ.. గత మ్యాచ్‌లో కీలక సమయంలో ఔటై నిరాశపరిచాడు. అయితే లక్ష్యఛేదనలో రన్‌రేట్ ప్రకారం ముందుకు సాగే టీమ్‌ఇండియా.. ఒకవేళ మొదట బ్యాటింగ్ చేయాల్సి వస్తే విండీస్ ముందు భారీ స్కోరు నిలపాల్సిన అవసరముంది. హిట్టర్లతో దట్టంగా ఉన్న కరీబియన్ టీమ్‌కు కనీసం రెండొందల స్కోరైనా లేకపోతే మ్యాచ్ మన చేతుల్లో నుంచి వెళ్లిపోతుందనేది గత మ్యాచ్‌లోనే అర్థమైంది. తిరువనంతపురంలో పంత్ కొన్ని చక్కటి షాట్లు ఆడినా.. అతడి స్థాయికి అది తక్కువే. సంజూ శాంసన్ వంటి ఆటగాడు బెంచ్‌పై ఎదురుచూస్తున్న నేపథ్యంలో పంత్ ఈ మ్యాచ్‌లో మెరుపులు మెరిపించకపోతే.. జట్టులో స్థానం గల్లంతయ్యే అవకాశాలున్నాయి. బ్యాటింగ్ ఆర్డర్‌లో ప్రమోషన్ పొంది మంచి ఇన్నింగ్స్‌తో అలరించిన ముంబై ఆల్‌రౌండర్ శివం దూబే అదే జోరు కొనసాగిస్తే మిడిలార్డర్‌లో భారత్ బెంగ తీరుతుంది. శ్రేయస్ అయ్యర్, జడేజా కూడా ఓ చేయి వేస్తే భారీ స్కోరు ఖాయమే. బౌలింగ్‌లో అందరి దృష్టి సుందర్‌పైనే నిలువనుంది. పవర్‌ప్లేలో వికెట్లు పడగొడతాడనుకున్న సుందర్ పెద్దగా ప్రభావం చూపలేకపోతున్నాడు. గత ఐదు మ్యాచ్‌ల్లో అతడు కేవలం 3 వికెట్లే పడగొట్టాడు. పరుగులు నియంత్రించగలుగుతున్నా 'బ్రేక్ త్రూ'లు ఇప్పించడంలో విఫలమవుతున్నాడు. ఇలాగే కొనసాగితే చైనామన్ కుల్దీప్ కోసం తన స్థానాన్ని త్యాగం చేయక తప్పదు. భువనేశ్వర్, దీపక్ చాహర్ వీలైనంత త్వరగా లయ అందిపుచ్చుకోవాల్సిన అవసరముంది.

జోరుమీదున్న విండీస్

కొత్త కెప్టెన్ కీరన్ పొలార్డ్ సారథ్యంలో వెస్టిండీస్ సరికొత్తగా కనిపిస్తున్నది. బౌలింగ్‌లో కాస్త బలహీనంగా ఉన్నా.. బ్యాటింగ్‌లో మాత్రం కరీబియన్లకు తిరుగులేదు. సిమన్స్, లూయిస్, కింగ్, హెట్‌మైర్, పూరన్, పొలార్డ్, హోల్డర్ అంతా మంచి టచ్‌లో ఉండటం విండీస్‌కు కలిసొచ్చే అంశం. ముంబై ఇండియన్స్ తరపున వాంఖడేలో పొలార్డ్ లెక్కకు మిక్కిలి మ్యాచ్‌లు ఆడి ఉండటం ఆ జట్టుకు కలిసిరానుంది. మైదానంతో పొలార్డ్‌కు ఉన్న అనుభవం తమ బౌలర్లకు సహకరిస్తుందని ఆ జట్టు కోచ్ సిమన్స్ అంటున్నాడు. కరీబియన్ ప్రీమియర్‌లీగ్‌లో సత్తాచాటి జాతీయ జట్టులోకి వచ్చిన బ్రండన్ కింగ్ తనదైన రోజున రస్సెల్‌ను మించిన రచ్చ చేయడంలో సిద్ధహస్తుడు. పేసర్లు హోల్డర్, కాట్రెల్, కెస్రిక్‌తో పాటు లెగ్ స్పిన్నర్ హేడెన్ వాల్ష్ రాణిస్తే.. టీమ్‌ఇండియాకు కష్టాలు తప్పకపోవచ్చు.

పొలార్డ్

ఫీల్డింగ్ దశ మారేనా..!

సిరీస్‌లో ఇరు జట్లు ఒక్కో మ్యాచ్ గెలిచి సమంగానే ఉన్నా ఒత్తిడి మాత్రం భారత్ పైనే ఎక్కువగా ఉంది. ఈ సిరీస్‌లో టీమ్ ఇండియా బ్యాటింగ్ ప్రదర్శన బాగానే ఉన్నా.. ఫీల్డింగ్, బౌలింగ్‌లో మాత్రం మనవాళ్లు నిరాశ పరుస్తున్నారు. హైదరాబాద్ మ్యాచ్‌లో నాలుగు క్యాచ్‌లు వదిలేసిన మనవాళ్లు.. తిరువనంతపురంలో మూడు క్యాచ్‌లు నేలపాలు చేశారు. ముఖ్యంగా వాషింగ్టన్ సుందర్ మరీ డైలమాలో కనిపిస్తున్నాడు. చురుకైన ఆఫ్‌స్పిన్‌తో పాటు చివర్లో ధాటిగా ఆడగల సత్తా ఉందని జట్టులోకి తీసుకున్న సుందర్.. ఫీల్డింగ్‌లో నిరాశ పరుస్తున్నాడు. తొలి టీ20లో నేరుగా చేతిలోకి రావాల్సిన బంతిని తప్పుగా అంచనా వేసి వదిలేయడంతో పాటు బౌండ్రీ వద్ద చేతికి చిక్కిన బంతిని నేలపాలు చేశాడు. ఇక రెండో మ్యాచ్‌లో నైతే.. చేతిలో పడ్డ క్యాచ్‌ను జారవిడిచి సిమన్స్‌కు లైఫ్ ఇచ్చాడు. ఈ నేపథ్యంలో తీవ్ర ఒత్తిడిలో ఉన్న వాషింగ్టన్ ఎలాంటి ప్రదర్శన చేస్తాడనేది కీలకంగా మారింది. దీనికి తోడు మిగతావాళ్లు కూడా మైదానంలో చురుగ్గా స్పందించకుంటే.. భారీ స్కోర్లు చేసినా ఫలితం ఉండదని ఇప్పటికే కోహ్లీ పరోక్ష హెచ్చరికలు జారీచేశాడు.

1 చాహల్ మరొక్క వికెట్ తీస్తే భారత్ తరపున అంతర్జాతీయ టీ20ల్లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా నిలుస్తాడు. ప్రస్తుతం అతడు అశ్విన్ (52)తో కలిసి సంయుక్తంగా అగ్రస్థానంలో ఉన్నాడు.

పొలార్డ్ నాయకత్వంలో వెస్టిండీస్ జట్టు సరికొత్తగా కనిపిస్తున్నది. ముంబై ఇండియన్స్ తరపున ఆడేటప్పుడు పొలార్డ్‌ను దగ్గర నుంచి గమనించా. అతడిలో మంచి సారథి ఉన్నాడు. పొట్టి ప్రపంచకప్‌నకు ఇంకా చాలా సమయం ఉంది. నా దృష్టిలో ఇప్పటి నుంచే దాని గురించి ఆలోచించడం తొందరపాటవుతుంది. ప్రస్తుతం ఈ సిరీస్ పైనే మా దృష్టి. మొదట బ్యాటింగ్ చేసేటప్పుడైనా.. చేజింగ్‌లోనైనా.. నా బ్యాటింగ్‌లో ఎలాంటి మార్పు ఉండదు. ఆరంభంలో కాస్త నెమ్మదిగా ఆడి ఆ తర్వాత జోరు పెంచడమే నా నైజం.

- రోహిత్ శర్మ, భారత వైస్ కెప్టెన్

రాత్రి 7 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో

తుది జట్లు (అంచనా)

భారత్: కోహ్లీ (కెప్టెన్), రోహిత్, రాహుల్, పంత్, అయ్యర్, దూబే, జడేజా, సుందర్, దీపక్, భువనేశ్వర్, చాహల్.

వెస్టిండీస్: పొలార్డ్ (కెప్టెన్), సిమన్స్, లూయిస్, కింగ్, హెట్‌మైర్, పూరన్, హోల్డర్, పియర్, కెస్రిక్, కాట్రెల్, వాల్ష్.

పిచ్, వాతావరణం

'వాంఖడే పిచ్‌కు వంక పెట్టేదేముంది'అని వెస్టిండీస్ కోచ్ ఫిల్ సిమన్స్ అన్నాడంటేనే వికెట్ ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. వాతావరణం చల్లగా ఉండనుంది. మ్యాచ్‌కు వరుణుడి ముప్పు లేదు.

ఆ మ్యాచ్ గుర్తుందా..!

2016, మార్చి 31. వాంఖడే వేదికగా భారత్, వెస్టిండీస్ మధ్య టీ20 ప్రపంచకప్ సెమీఫైనల్. టాస్ గెలిచిన విండీస్ కెప్టెన్ డారెన్ సమీ.. టీమ్‌ఇండియాను బ్యాటింగ్‌కు ఆహ్వానించాడు. విరాట్ కోహ్లీ (89 నాటౌట్)తో పాటు ఓపెనర్లు రోహిత్ శర్మ (43), రహానే (40) రాణించడంతో భారత్ నిర్ణీత ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 192 పరుగులు చేసింది. బుమ్రా, నెహ్రా, హార్దిక్, అశ్విన్, జడేజాతో కూడిన బౌలింగ్ దళం విండీస్‌ను నిలువరించడం ఖాయమే.. ఇక భారత్ ఫైనల్లో అడుగుపెట్టినట్లే అని అంతా అనుకున్నారు. అందుకు తగ్గట్లే.. యూనివర్సల్ బాస్ క్రిస్ గేల్ (5), సామ్యూల్స్ (8) త్వరగానే పెవిలియన్ చేరారు. కానీ ఆ తర్వాతే మొదలైంది అసలు బాదుడు.. చార్లెస్ (52; 7 ఫోర్లు, 2 సిక్సర్లు), సిమన్స్ (51 బంతుల్లో 82 నాటౌట్; 7 ఫోర్లు, 5 సిక్సర్లు), రస్సెల్ (20 బంతుల్లో 43 నాటౌట్; 3 ఫోర్లు, 4 సిక్సర్లు) ఆకాశమే హద్దుగా చెలరేగిపోవడంతో మరో రెండు బంతులు మిగిలుండగానే విండీస్ విజయం సాధించింది. అదే ఊపులో ఫైనల్లో ఇంగ్లండ్‌ను చిత్తు చేసి విశ్వ విజేతగా నిలిచింది.

మంగళవారం ప్రగతి భవన్‌లో వివాహ విందు ఆహ్వాన పత్రికను సీఎం కేసీఆర్‌కు అందజేస్తున్న హెచ్‌సీఏ అధ్యక్షుడు మహమ్మద్ అజారుద్దీన్, అసదుద్దీన్, సానియా మీర్జా, ఇమ్రాన్ మీర్జా

మా ఇంటి వివాహ విందుకు రండి

సీఎం కేసీఆర్‌కు అజర్, సానియా ఆహ్వానం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తమ ఇంట ఈనెల 12వ తేదీన జరిగే వివాహ విందుకు హాజరు కావాలని హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) అధ్యక్షుడు మహమ్మద్ అజారుద్దీన్, టెన్నిస్ స్టార్ సానియా మీర్జా కలిసి సీఎం కేసీఆర్‌ను ఆహ్వానించారు. మంగళవారం ప్రగతిభవన్‌లో సీఎంను మర్యాదపూర్వకంగా కలుసుకున్న అజర్, సానియా కుటుంబ సభ్యులు ఆహ్వాన పత్రికను అందజేశారు. అజారుద్దీన్ కొడుకు మహమ్మద్ అసదుద్దీన్ పెండ్లి సానియా సోదరి ఆనమ్ మీర్జాతో బుధవారం జరుగనుంది.

శ్రీజ, స్నేహిత్‌కు సన్మానం

మంగళవారం హైదరాబాద్‌లో టీటీ ప్లేయర్లు శ్రీజ, స్నేహిత్‌ను సన్మానిస్తున్న రాష్ట్ర క్రీడా, పర్యాటక శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్, సాట్స్ చైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి తదితరులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ ఆట ప్రతినిధి: జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాష్ట్ర ఖ్యాతిని ఇనుమడింపజేసిన టేబుల్ టెన్నిస్ వర్ధమాన ఆటగాళ్లు ఫిడేల్ ఆర్ స్నేహిత్, ఆకుల శ్రీజకు తగిన గుర్తింపు లభించింది. జాతీయ స్థాయి యూత్ టీటీ చాంపియన్‌గా నిలిచిన స్నేహిత్‌తో పాటు దక్షిణాసియా క్రీడల్లో స్వర్ణ పతకాలతో సత్తాచాటిన శ్రీజను రాష్ట్ర క్రీడా, పర్యాటక శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ మంగళవారం ఘనంగా సన్మానించారు. రాష్ట్ర పురపాలక, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ సూచన మేరకు రైల్వే టీటీ కోచ్‌గా ఉన్న సోమనాథ్ ఘోష్‌ను సాట్స్‌కు తీసుకొచ్చిన తర్వాత మెరుగైన ఫలితాలు వస్తున్నాయన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ సారథ్యంలో రాష్ట్రం క్రీడా హబ్‌గా రూపొందుతున్నదని అన్నారు. టోక్యో (2020) ఒలింపిక్స్‌కు రాష్ట్రం నుంచి ఎక్కువ మంది ప్రాతినిధ్యం వహించే విధంగా ప్రోత్సహిస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీజ, స్నేహిత్ కుటుంబసభ్యులతో పాటు సాట్స్ చైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి, టీటీ అసోసియేషన్ కార్యదర్శి ప్రకాశ్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

వన్డే జట్టులో మయాంక్!

న్యూఢిల్లీ: టీమ్‌ఇండియా టెస్టు ఓపెనర్ మయాంక్ అగర్వాల్ వన్డే జట్టులో అడుగు పెట్టే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. గాయం కారణంగా విండీస్‌తో పరిమిత ఓవర్ల సిరీస్‌కు దూరమైన ధవన్ స్థానంలో మయాంక్ వన్డే జట్టులో చోటు దక్కించుకోనున్నాడు. ముస్తాక్ అలీ టోర్నీ సందర్భంగా గాయపడిన ధవన్ కోలుకోవడానికి మరికొంత సమయం పట్టేలా కనిపిస్తున్నది. ముందు చిన్న గాయమే అనుకున్నా దాని తీవ్రత అధికంగా ఉండటంతో అతడి స్థానంలో సుదీర్ఘ ఫార్మాట్‌లో దుమ్మురేపుతున్న మయాంక్‌కు చాన్స్ ఇవ్వనున్నట్లు ఓ బీసీసీఐ అధికారి తెలిపారు. టీ20 సిరీస్ అనంతరం ఈనెల 15 నుంచి భారత్, వెస్టిండీస్ మూడు వన్డేలు ఆడనున్న విషయం తెలిసిందే.

అంధుల జాతీయ క్రికెట్ జట్టుకు ఎంపికైన మహబూబ్‌నగర్ జిల్లా లింగనపల్లి గ్రామానికి చెందిన మాధవులును మంగళవారం హైదరాబాద్‌లో అభినందిస్తున్న రాష్ట్ర క్రీడా, పర్యాటక శాఖ మంత్రి వీ శ్రీనివాస్ గౌడ్

ఆట విరామంలో బిడ్డకు పాలు

తల్లిప్రేమ చాటిన మిజోరం ప్లేయర్

మిజోరం: మాతృప్రేమ గొప్పతనాన్ని మరోసారి ప్రపంచానికి చాటింది మిజోరంకు చెందిన ఓ వాలీబాల్ ప్లేయర్. మ్యాచ్ విరామంలో ఏడు నెలల తన బిడ్డకు పాలిచ్చి ఆకలి తీర్చింది. ఆ తర్వాత మళ్లీ ఆటలోకి దిగి కర్తవ్యాన్ని పూర్తి చేసింది. ఇందుకు సంబంధించిన ఫొటోలను ఒకరు సోషల్ మీడియాలో పోస్ట్ చేయగా.. నెటిజన్లు ఆ క్రీడాకారిణిపై ప్రశంసలు కురిపిస్తున్నారు. మిజోరం స్టేట్ గేమ్స్‌లో తైకుమ్ వాలీబాల్ జట్టు తరపున లాల్‌వెంట్ లుయాంగీ ఆడుతున్నది. తన ఏడు నెలల శిశువుతోనే పోటీకి దిగింది. ఆకలితో తన బిడ్డ ఏడ్వడం చూసిన ఆమె విరామం సమయంలో వాలీబాల్ కోర్టు సమీపంలోనే పాలిచ్చింది. నెటిజన్లు లాల్‌వెంట్ లుయాంగీని ప్రశంసలతో ముంచెత్తారు. విశేష స్పందన గమనించిన నిర్వాహకులు క్రీడలకు మస్కట్‌గా ఎంపిక చేశారు. మిజోరం క్రీడాశాఖ మంత్రి రోమావియా.. ఆ క్రీడాకారిణికి రూ.10వేల ప్రోత్సాహకాన్ని ప్రకటించారు.

ధోనీ విశ్రాంతి తీసుకుంటున్నాడంతే...

రవిశాస్త్రి

న్యూఢిల్లీ : టీమ్‌ఇండియా మాజీ కెప్టెన్ ధోనీ రిటైర్మెంట్ అంశంపై హెడ్‌కోచ్ రవిశాస్త్రి స్పందించాడు. మహీ ప్రస్తుతం విశ్రాంతి తీసుకుంటున్నాడని, వచ్చే ఏడాది ఐపీఎల్‌లో తప్పనిసరిగా ఆడుతాడని చెప్పాడు. ఆ తర్వాత టీమ్‌ఇండియాలో ఆడగలనని ధోనీ అనుకుంటే అందుకు అడ్డు ఉండదని స్పష్టం చేశాడు. బుధవారం ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన శాస్త్రి పలు అంశాలపై అభిప్రాయాలను వ్యక్తం చేశాడు. 'ధోనీ ఓ దిగ్గజం. అతడి గురించి తెలిసిన వ్యక్తిగా చెబుతున్నా.. జట్టుకు భారంగా ఉండాలని మహీ ఎప్పుడూ అనుకోడు. ప్రస్తుతం విశ్రాంతి తీసుకోవాలని అనుకుంటున్నాడు. ఐపీఎల్‌లో ఆడుతాడు. ఆ తర్వాత టీమ్‌ఇండియాకు ఇంకా ఆడగలనని ధోనీ అనుకుంటే అందులో గందరగోళం ఏమీ లేదు' అని శాస్త్రి అన్నాడు.

టైటిల్ నిలుపుకునేందుకు..

డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలో పీవీ సింధు.. నేటి నుంచి బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ ఫైనల్స్

గ్వాంగ్జూ : భారత స్టార్ షట్లర్ పీవీ సింధు సంవత్సరాంతపు బ్యాడ్మింటన్ సమరానికి సంసిద్ధమైంది. అన్ని విభాగాల్లో అగ్ర స్టార్లు పోటీపడే బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ ఫైనల్స్ టోర్నీ బుధవారం ఇక్కడ ప్రారంభం కానుంది. రేస్ టు గ్వాంగ్జూ ర్యాంకింగ్స్ టాప్-8లో ఉన్న ప్లేయర్లకే ఈ టోర్నీలో తలపడే అవకాశం ఉండగా.. సింధు 15వ స్థానంలో నిలిచినా ప్రపంచ చాంపియన్‌షిప్ గెలిచిన కారణంగా అర్హత సాధించింది. ఈ టోర్నీలో భారత్ తరపున తెలుగమ్మాయే ఏకైక ప్లేయర్‌గా బరిలో ఉంది. గతేడాది ఈ టోర్నీ విజేతగా నిలిచిన సింధు.. ఈసారి ఎలాగైనా టైటిల్ నిలబెట్టుకోవాలని పట్టుదలగా ఉంది. అయితే, ఈ ఏడాది ఆగస్టులో ప్రపంచ చాంపియన్‌గా అవతరించిన తర్వాత పీవీ సింధు స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేకపోయింది. టోర్నీల్లో అధిక శాతం ప్రాథమిక రౌండ్లలోనే వైదొలుగుతూ తీవ్రంగా నిరాశ పరిచింది. కొరియా, పుజౌ చైనా ఓపెన్లలో తొలి రౌండ్లలో, చైనా సూపర్, డెన్మార్క్, హాంకాంగ్ ఓపెన్ టోర్నీల్లో రెండో రౌండ్‌లోనే నిష్క్రమించింది. ఫ్రెంచ్ ఓపెన్‌లో మాత్రమే క్వార్టర్స్ వరకు వెళ్లగలిగింది.

తీవ్రమైన ప్రాక్టీస్

సాధారణ టోర్నీల్లో రాణించలేకపోతున్నంత మాత్రాన పీవీ సింధుని తక్కువ అంచనా వేయడానికి లేదు. పడిలేచిన కెరటంలా ప్రధాన టోర్నీల్లో అద్భుతంగా ఆడడం ఆమెకు అలవాటే. ఈ ఏడాది అప్పటి వరకు ఒక్క టోర్నీలోనూ టైటిల్ గెలువకున్నా.. ఆగస్టులో జరిగిన ప్రపంచ చాంపియన్‌షిప్‌ను అద్భుత ఆటతీరుతో కైవసం చేసుకొని సింధు చరిత్ర సృష్టించిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత ఎడతెరిపి లేని టోర్నీలతో వెనుకబడినా.. వరల్డ్ టూర్ ఫైనల్స్‌లో సత్తా చాటాలన్న కసితో మూడు వారాలుగా తీవ్రమైన ప్రాక్టీస్ చేస్తున్నది. కీలకమైన సమయాల్లో పొరపాట్ల వల్లే కొన్ని టోర్నీల్లో నష్టపోవాల్సి వచ్చిందని, వాటిని సరిదిద్దుకొని పునరావృతం కానీయనని ఇటీవలే చెప్పిన సింధు... దక్షిణ కొరియా కోచ్ పార్క్ టే సంగ్ దిశానిర్దేశంలో తీవ్రంగా శ్రమిస్తున్నది. వరల్డ్ టూర్ ఫైనల్స్ టైటిల్‌ను నిలుపుకోవడంతో ఫామ్‌ను పుణికిపుచ్చుకొని ఒలింపిక్స్ సంవత్సరంలో ఘనంగా అడుగుపెట్టాలని సింధు పట్టుదలగా ఉంది.

సింధు X యమగుచి

వరల్డ్ టూర్ ఫైనల్స్ మహిళల సింగిల్స్ గ్రూప్-ఏలో చోటు దక్కించుకున్న సింధు తొలిపోరులో అకానే యమగుచి(జపాన్)తో బుధవారం తలపడనుంది. ఇండోనేషియా, జపాన్ ఓపెన్ టైటిళ్లతో జపాన్ ప్లేయర్ ఈ ఏడాది ప్రారంభంలో మంచి ఫామ్‌ను కనబరిచింది. అయితే గాయాల కారణంగా ఆ తర్వాత సరైన ప్రదర్శన చేయలేకపోయినా.. మళ్లీ పుంజుకొని ఇటీవల కొరియా మాస్టర్స్, హాంకాంగ్ ఓపెన్‌లో సెమీస్ చేరగలిగింది. అయితే, యమగుచితో 10సార్లు తలపడితే ఆరుసార్లు సింధునే గెలిచింది. కానీ గత రెండు పర్యాయాలు యమగుచినే విజయం సాధించడంతో తెలుగమ్మాయి మరింత జాగ్రత్తగా ఆడాల్సిన అవసరం ఉంది. మహిళల సింగిల్స్ గ్రూప్-ఏలో సింధు, యమగుచితో పాటు చెన్ యూఫీ, హే బింగ్ జియావో(చైనా) ఉన్నారు.

గుజరాత్ 295/9

మెహదీ హసన్ (4/78)

హైదరాబాద్, నమస్తే తెలంగాణ ఆట ప్రతినిధి: ఆరంభంలో విజృంభించిన హైదరాబాద్ బౌలర్లు ఆ తర్వాత పట్టు సడలించడంతో రంజీ ట్రోఫీ మొదటి మ్యాచ్‌లో మన జట్టుపై గుజరాత్ తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సాధించింది. ఆట మొదటి రోజే హైదరాబాద్ 233 పరుగులకు ఆలౌట్ కాగా.. మంగళవారం ఆట ముగిసే సమయానికి గుజరాత్ 295/9తో నిలిచింది. మన్‌ప్రీత్ జునేజా (94), రుజుల్ భట్ (65) రాణించారు. మన బౌలర్లలో మెహదీ హసన్ 4, మహమ్మద్ సిరాజ్ 3 వికెట్లు పడగొట్టారు. ప్రస్తుతం చేతిలో ఓ వికెట్ ఉన్న గుజరాత్.. హైదరాబాద్ కంటే 62 పరుగుల ఆధిక్యంలో ఉంది. రూష్ కలారియా (21) క్రీజులో ఉన్నాడు. విజయవాడ వేదికగా ఆంధ్రతో జరుగుతున్న మ్యాచ్‌లో విదర్భ తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సాధించింది.

త్రిశతక భారత్

దక్షిణాసియా గేమ్స్‌లో 312 పతకాలతో రికార్డు

వికాస్

కఠ్మాండు(నేపాల్) : అత్యుత్తమ పతకాల రికార్డుతో దక్షిణాసియా గేమ్స్‌లో భారత్ జైత్రయాత్ర ముగించింది. ఈనెల 1వ తేదీన ప్రారంభమైన టోర్నీ మంగళవారంతో ముగియగా.. వరుసగా భారత్ 13వ సారి కూడా పతకాల పట్టికలో అగ్రస్థానంలో నిలిచింది. 2016లో 309 పతకాలు సాధించగా.. ఈసారి ఆ రికార్డును చెరిపివేస్తూ మొత్తం 312 (174 స్వర్ణాలు, 93రజతాలు, 45 కాంస్యాలు) దక్కించుకొని కొత్త చరిత్ర సృష్టించింది. ఆతిథ్య నేపాల్(206, 51స్వర్ణాలు), శ్రీలంక (251, 40స్వర్ణాలు) ఆ తర్వాతి స్థానంలో నిలిచాయి. ఇక చివరి రోజు పోటీల్లో భారత ప్లేయర్లు 15 బంగారు సహా మొత్తం 18 పతకాలు కైవసం చేసుకున్నారు. మంగళవారం జరిగిన ఏడు ఫైనల్స్‌లో మన బాక్సర్లు ఆరు పసిడి, ఓ కాంస్య పతకంతో సత్తాచాటారు. పురుషుల విభాగంలో వికాస్ కృష్ణన్(69కేజీలు), స్పర్శ్ కుమార్ (52కేజీలు), నరేందర్(+91కేజీలు), మహిళల విభాగంలో పింకీ రాణి (51కేజీలు), సోనియా లాథూర్ (57కేజీలు), మంజూ బంబోరియా (64కేజీలు) స్వర్ణాలు కైవసం చేసుకోగా పురుషుల విభాగంలో వరీందర్ సింగ్ (60కేజీలు) రజతంతో సరిపెట్టుకున్నాడు. ఇక పురుషుల, మహిళల బాస్కెట్‌బాల్ పోటీల్లో రెండు స్వర్ణాలు, స్క్వాష్ రెండు విభాగాల్లో ఓ పసిడి మరో రజతం భారత్‌కు దక్కాయి.

రాజకీయ ప్రోద్బలమే

రష్యా అధ్యక్షుడు పుతిన్

లుసాన్ : ఒలింపిక్స్ పరిధిలోని ప్రధాన క్రీడా టోర్నీల నుంచి తమ దేశాన్ని నాలుగేండ్ల పాటు అంతర్జాతీయ డోపింగ్ నిరోధ ఏజెన్సీ(వాడా) నిషేధించడాన్ని రష్యా అగ్రనేతలు తీవ్రంగా తప్పుబడుతున్నారు. రాజకీయ ప్రోద్బలంతోనే రష్యాపై వాడా నాలుగేండ్ల నిషేధం విధించిందని ఆ దేశ అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ మంగళవారం అసంతృప్తి వ్యక్తం చేశారు. వాడా చర్య ఒలింపిక్స్ ఒప్పందాలకు వ్యతిరేకమని ఆగ్రహించారు. డోపింగ్ విషయంలో రష్యన్ ఒలింపిక్ కమిటీని వాడా తప్పుబట్టలేదని, అలాంటప్పుడు రష్యా పతకంతోనే తమ అథ్లెట్లు విశ్వక్రీడల్లో పాల్గొనాల్సిందని పుతిన్ చెప్పారు. రష్యా వ్యతిరేక అజెండాలో భాగమే వాడా చర్యలని ఆ దేశ ప్రధాని దిమిత్రి మద్వెదెవ్ సైతం విమర్శించిన సంగతి తెలిసిందే. మాస్కోలోని ల్యాబ్‌లో అథ్లెట్ల డోపింగ్ వివరాలను తారుమారు చేసి తమకు అందించారన్న ఆరోపణలతో రష్యాపై వాడా నాలుగేండ్ల పాటు నిషేధం విధించిన సంగతి తెలిసిందే..

పారాలింపియన్ల పరిస్థితేంటి..

రష్యాను వాడా నిషేధించడంతో టోక్యో 2020 పారాలింపిక్స్‌లో ఆ దేశ అథ్లెట్ల ప్రాతినిధ్యంపై సందిగ్ధత నెలకొంది. ఈ నేపథ్యంలో ఈ విషయంపై స్పష్టమైన మార్గనిర్దేశాల కోసం వేచిచూస్తున్నామని అంతర్జాతీయ పారాలింపిక్స్ కమిటీ(ఐపీసీ) వెల్లడించింది.

సెన్సెక్స్	నిఫ్టీ
40,240	11,857
↘ 248	↘ 81

ముడి చమురు (బ్రెంట్) ↗ 64.51 డాలర్లు

విలీనాలపై బ్యాంక్ ఉద్యోగుల ధర్నా

న్యూఢిల్లీ, డిసెంబర్ 10: విలీనాలపై ప్రభుత్వ రంగ బ్యాంకుల ఉద్యోగ సంఘాలు మంగళవారం అఖిల భారత ధర్నా నిర్వహించాయి. ఇక్కడ జరిగిన ఈ ఒక్కరోజు ఆందోళనకు మొత్తం 9 బ్యాంక్ యూనియన్లూ మద్దతిచ్చాయి. యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యూఎఫ్‌బీయూ) ఆధ్వర్యంలోని ఏఐబీవోసీ, ఏఐబీఈఏ, నేషనల్ ఆర్గనైజేషన్ ఆఫ్ బ్యాంక్ వర్కర్స్ తదితర సంఘాలు ఈ నిరసన చేపట్టాయి. దురదృష్టవశాత్తు బ్యాంకులను ప్రభుత్వం లక్ష్యంగా చేసుకుందని, విలీనం చేస్తూ పెద్ద సంఖ్యలో బ్రాంచీలను మూసేస్తున్నారని ఏఐబీవోసీ ఈ సందర్భంగా మండిపడింది. డిపాజిట్లపై వడ్డీరేట్లను తగ్గిస్తూ, కస్టమర్లపై సర్వీస్ చార్జీలను పెంచుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేసింది. బ్యాంకింగ్ రంగం ఎదుర్కొంటున్న సవాళ్లకు, దేశ ఆర్థిక వ్యవస్థలో నెలకొన్న సమస్యలకు విలీనాలతో పరిష్కారం లభించదని ఓ ప్రకటనలో పేర్కొన్నది. ఈ ఏడాది ఆగస్టులో 10 ప్రభుత్వ రంగ బ్యాంకులను 4 బ్యాంకులుగా విలీనం చేస్తున్నట్లు మోదీ సర్కారు ప్రకటించిన విషయం తెలిసిందే. ఇప్పటికే ఎస్బీఐలో దాని అనుబంధ బ్యాంకులను, భారతీయ మహిళా బ్యాంక్‌ను కలిపేసిన కేంద్రం.. బ్యాంక్ ఆఫ్ బరోడాలో విజయా, దేనా బ్యాంక్‌లను విలీనం చేసిన సంగతి విదితమే.

ఉల్లిపైనే ఆధారం!

ఆర్బీఐ తదుపరి ద్రవ్యసమీక్షపై బ్యాంక్ ఆఫ్ అమెరికా అంచనా.. ధరలు తగ్గితేనే వడ్డీరేట్ల కోతకు అవకాశం

ముంబై, డిసెంబర్ 10: ఉల్లి సెగ సామాన్యులకే కాదు.. సాక్షాత్తూ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ)కూ తగులుతున్నది. ఆర్బీఐ ద్రవ్యపరపతి విధానాన్ని ఉల్లి ధరలు ప్రభావితం చేస్తున్నాయి మరి. దేశవ్యాప్తంగా రికార్డు స్థాయిలో పలుకుతున్న ఉల్లిగడ్డ ధరలు.. ఏకంగా రిజర్వ్ బ్యాంక్ సమీప లక్ష్యాలనే తారుమారు చేసేశాయి. మందగించిన వృద్ధిరేటు బలోపేతమే లక్ష్యంగా వడ్డీరేట్లను తగ్గిస్తూపోయిన ఆర్బీఐని.. ఉల్లిగడ్డ ధరలు ఒక్కసారిగా ద్రవ్యోల్బణం వైపునకు మళ్లించాయి. ఈ క్రమంలోనే జీడీపీ ఆరేండ్ల కనిష్ఠాన్ని తాకినప్పటికీ ఇటీవలి ద్రవ్యసమీక్షలో ఆర్బీఐ వరుస వడ్డీరేట్ల కోతలకు బ్రేక్ పడింది. రాబోయే ద్రవ్యసమీక్షలపైనా ఈ తరహా ప్రభావమే ఉంటుందని అమెరికా బ్రోకరేజీ దిగ్గజం బ్యాంక్ ఆఫ్ అమెరికా సెక్యూరిటీస్ అంచనా వేస్తున్నది. దేశ ఆర్థిక వ్యవస్థలో మందగమనం నెలకొన్న నేపథ్యంలో జీడీపీని గాడిలో పెట్టేందుకు మునుపెన్నడూ లేనివిధంగా రెపో, రివర్స్ రెపో వడ్డీరేట్లను ఆర్బీఐ తగ్గిస్తూ వచ్చిన సంగతి విదితమే. ఈ ఏడాది జరిగిన ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్షల్లో రెపో, రివర్స్ రెపోలు గరిష్ఠంగా 135 బేసిస్ పాయింట్లు దిగివచ్చాయి. ఈ నెల జరిగిన సమీక్షలోనూ కీలక వడ్డీరేట్లు మరింత తగ్గుతాయన్న అంచనాలు పెద్ద ఎత్తున వినిపించాయి. కానీ ద్రవ్యోల్బణం గణాంకాలు పెరుగుతున్న సంకేతాలు స్పష్టంగా కనిపించడంతో వడ్డీరేట్ల జోలికి ఆర్బీఐ వెళ్లలేకపోయింది. ఇది అటు బ్యాంకులుగానీ, ఇటు వ్యాపార, పరిశ్రమ వర్గాలుగానీ, చివరకు దేశ, విదేశీ ఆర్థిక నిపుణులుగానీ ఊహించని పరిణామం. ఈ నేపథ్యంలో వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరిగే ద్వైమాసిక ద్రవ్యసమీక్షలోనూ వడ్డీరేట్లు తగ్గకపోవచ్చని బ్యాంక్ ఆఫ్ అమెరికా అన్నది.

మంగళవారం జైపూర్ మార్కెట్లో ఉల్లిగడ్డలను పరుతున్న మహిళలు

అసలుకే ఎసరు

ఆర్బీఐ ప్రధాన లక్ష్యం ద్రవ్యోల్బణం అదుపే. అయితే గతేడాది అనూహ్య పరిణామాల మధ్య రిజర్వ్ బ్యాంక్ గవర్నర్‌గా వచ్చిన శక్తికాంత దాస్.. ఈ లక్ష్యాన్ని పక్కనబెట్టి జీడీపీని ఎజెండాగా తీసుకున్నారు. ఈ క్రమంలోనే వరుసగా ఐదు ద్రవ్యసమీక్షల్లో రెపో, రివర్స్ రెపోలను తగ్గించి పరిశ్రమకు ఊరట కలిగించారు. అయితే ఉల్లిగడ్డ ధరలతో ద్రవ్యోల్బణం మళ్లీ విజృంభిస్తుండటంతో దాస్ దృష్టి కూడా ద్రవ్యోల్బణం మీదకు మళ్లింది. అసలే ఆర్థిక వ్యవస్థ మందగమనంలో ఉన్న వేళ.. ద్రవ్యోల్బణం కూడా అదుపు తప్పితే ప్రమాదమని దాస్ గ్రహించినట్లు విశ్లేషకులు చెబుతున్నారు. అందుకే అందరి అంచనాలనూ తలకిందులు చేస్తూ వడ్డీరేట్లను యథాతథంగా ఉంచారని అంటున్నారు. కొన్నిచోట్ల కిలో ఉల్లి రూ.200 దిశగా పరుగులు పెడుతున్నది. దీంతో రిటైల్ ద్రవ్యోల్బణంపై ఆర్బీఐకి గుబులు పట్టుకున్నది. వడ్డీరేట్ల కోతలు ఉంటేగింటే ఏప్రిల్‌లో నేనని బ్యాంక్ ఆఫ్ అమెరికా అంటున్నది. గత నెల 177 శాతం పెరిగిన ఉల్లి ధరలు. ఈ నెల 371 శాతానికి ఎగిశాయని, ఈ నెల రూ.60కి, వచ్చే నెల రూ.40కి కిలో ధర పడిపోయినా.. ద్రవ్యోల్బణం రేటు 5.4 శాతంగా ఉండొచ్చని చెప్పింది. దీంతో ఫిబ్రవరి సమీక్షలోనూ ఆర్బీఐ వడ్డీరేట్లకు వెళ్లకపోవచ్చని బ్యాంక్ ఆఫ్ అమెరికా నిపుణులు చెప్పారు.

మరో నాలుగు బ్యాంకుల వడ్డీరేట్ల తగ్గింపు

20 బేసిస్ పాయింట్ల వరకు కోత

వడ్డీరేట్ల తగ్గింపు జాబితాలోకి తాజాగా మరో నాలుగు బ్యాంకులు చేరాయి. ఇప్పటికే బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ ఇండియా తగ్గించగా..ఇదే జాబితాలోకి ప్రభుత్వరంగ సంస్థ బ్యాంక్ ఆఫ్ బరోడా, యూకో, యూనియన్ బ్యాంకులు చేరగా, ప్రైవేట్ రంగం నుంచి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ జతైంది. మార్జినల్ కాస్ట్ ఆఫ్ లెండింగ్ రేటు(ఎంసీఎల్‌ఆర్)ని 20 బేసిస్ పాయింట్ల వరకు తగ్గించినట్లు బీవోబీ ప్రకటించింది. ఈ తగ్గింపు గురువారం నుంచి అమలులోకి రానున్నట్లు ఒక ప్రకటనలో వెల్లడించింది. బ్యాంక్ తీసుకున్న తాజా నిర్ణయంతో ఏడాది కాలపరిమితి కలిగిన రిటైల్ రుణాలపై వడ్డీరేటు 5 బేసిస్ పాయింట్లు కోత విధించడంతో రుణరేటు 8.25 శాతానికి తగ్గనున్నది. వీటితోపాటు ఒక్కరోజు, నెల రోజుల రుణాలపై వడ్డీరేటు 20 బేసిస్ పాయింట్లు తగ్గించడంతో రేటు 7.65 శాతానికి తగ్గింది. మూడు, ఆరు నెలల రుణాలపై వడ్డీరేటును 10 బేసిస్ పాయింట్లు తగ్గించడంతో ఎంసీఎల్‌ఆర్ 7.80 శాతానికి, 8.10 శాతానికి తగ్గాయి. అలాగే హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 15 బేసిస్ పాయింట్లు తగ్గించడంతో ఎంసీఎల్‌ఆర్ 8.15 శాతానికి తగ్గింది. మంగళవారం నుంచి అమలులోకి వచ్చేలా ఎంసీఎల్‌ఆర్‌ని 10 బేసిస్ పాయింట్లు తగ్గించినట్లు మరో బ్యాంకైన యూకో బ్యాంక్ ప్రకటించింది. దీంతో ఏడాది రుణాలపై వడ్డీరేటు 8.40 శాతం నుంచి 8.30 శాతానికి తగ్గింది. వీటితోపాటు ఒక్కరోజు, నెల, మూడు, ఆరు నెలల రుణాలపై వడ్డీరేటు 10 బేసిస్ పాయింట్లు కోత విధించింది. యూనియన్ బ్యాంక్ వడ్డీరేట్లను 5-10 బేసిస్ పాయింట్లు కోత విధించింది. గత ద్రవ్య పరపతి సమీక్షలో రిజర్వు బ్యాంక్ వడ్డీరేట్లను యథాతథంగా ఉంచినప్పటికీ ప్రధాన బ్యాంకులు వడ్డీరేట్లను తగ్గించడం విశేషం.

రూ.2 వేల నోట్లను వెనక్కి తీసుకోబోం

రాజ్యసభలో స్పష్టం చేసిన కేంద్రం

న్యూఢిల్లీ, డిసెంబర్ 10: రూ.2 వేల నోట్లను ప్రభుత్వం వెనక్కి తీసుకోబోతున్నదంటూ వస్తున్న వార్తలను కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి అనురాగ్ ఠాకూర్ ఖండించారు. చలామణి నుంచి రూ.2 వేల నోటును ఉపసంహరించుకోవాలన్న ఆలోచనేమీ లేదని స్పష్టం చేశారు. ఈ విషయంలో ప్రజలు అనవసరంగా ఆందోళన చెందాల్సిన పని లేదని భరోసా ఇచ్చారు. మంగళవారం రాజ్యసభలో ఆయన మాట్లాడుతూ.. 'చాలామంది ఒక విషయంలో భయాందోళనకు గురవుతున్నట్లు తెలుస్తున్నది. నిజానికి అంతగా భయపడాల్సిన అవసరం లేదు' అంటూ భవిష్యత్తులో రూ.2 వేల నోట్లను రద్దు చేసేందుకు ప్రభుత్వం యోచిస్తున్నదన్న వార్తలపై ఠాకూర్ స్పందించారు. సమాజ్‌వాదీ పార్టీ సభ్యుడు విషాంభర్ ప్రసాద్ నిషాద్ మాట్లాడుతూ 'రూ.2 వేల నోటుతో మళ్లీ నల్లధనం పెరిగిపోయింది. అందుకే తిరిగి రూ.1,000 నోటును చలామణిలోకి ప్రభుత్వం తీసుకురాబోతున్నదని ప్రజలు అనుకుంటున్నారు' అని అన్నారు. దీంతో మంత్రి పైవిధంగా వివరణ ఇచ్చారు. పాత పెద్ద నోట్ల రద్దుతో నల్లధనానికి చెక్ పెట్టామని, నకిలీ కరెన్సీని కూడా నిర్మూలించగలిగామన్న ఆయన తీవ్రవాదానికి ఆర్థిక చేయూత అందకుండా చేశామని, సంప్రదాయ ఆర్థిక వ్యవస్థను డిజిటల్ బాట పట్టించామని, నగదు రహిత లావాదేవీలను పెంచామని పేర్కొన్నారు. నవంబర్ 8, 2016న రూ.500, 1,000 నోట్ల చలామణిని కేంద్రంలోని నరేంద్ర మోదీ సర్కారు రద్దు చేసిన విషయం తెలిసిందే. వీటి స్థానంలో కొత్త రూ.500, 2,000 నోట్లను పరిచయం చేసిన సంగతీ విదితమే. కాగా, నవంబర్ 4, 2016 నాటికి చలామణిలో రూ.17 లక్షల 74,187 కోట్ల నగదు ఉందని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. ఈ నెల 2 నాటికి రూ.22 లక్షల 35,648 కోట్ల నగదు ఉందని ఓ లిఖితపూర్వక సమాధానంగా రాజ్యసభకు స్పష్టం చేశారు.

ఒరాకిల్ డైరెక్టర్‌గా సిక్కా

వాషింగ్టన్, డిసెంబర్ 10: ఇన్ఫోసిస్ మాజీ సీఈవో విశాల్ సిక్కా.. గ్లోబల్ టెక్నాలజీ దిగ్గజం ఒరాకిల్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లలో ఒకరిగా నియమితులైయ్యారు. కృత్రిమ మేధస్సు (ఏఐ), మెషీన్ లెర్నింగ్‌లో అంతర్జాతీయ నిపుణుడిగా పేరున్న సిక్కా అనుభవం.. తమకు ఎంతగానో ఉపయోగపడగలదన్న ఆశాభావాన్ని ఈ సందర్భంగా ఓ ప్రకటనలో ఒరాకిల్ చైర్మన్, సీటీవో లర్రీ ఎల్లీసన్ వ్యక్తం చేశారు. ఒరాకిల్ లక్ష్యాలు ఏమిటీ? అన్నది సిక్కాకు స్పష్టంగా తెలుసని, అలాంటి వ్యక్తి సంస్థ బోర్డులోకి రావడం మాకు ఎంతో లాభదాయకమని సంస్థ సీఈవో సఫ్రా కాట్జ్ అన్నారు. ఇక ప్రపంచంలోని ప్రతి ప్రముఖ, భారీ సంస్థకు ఒరాకిల్ డేటాబేసే ప్రధాన ఆధారంగా ఉందని సిక్కా అన్నారు. ప్రస్తుతం ఉన్న క్లౌడ్ కంపెనీల్లో నాలుగు పెద్దవని, వీటిలో సింగిల్ యూనిఫైడ్ క్లౌడ్‌లో ఎంటర్‌ప్రైజెస్ అప్లికేషన్ సూయిట్స్, సెక్యూర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ టెక్నాలజీస్ సేవలను అందిస్తున్నది ఒరాకిల్ మాత్రమేనన్నారు. ఇటీవలే తన ఏఐ స్టార్టప్ వయనై సిస్టమ్స్‌ను సిక్కా ప్రారంభించారు. అంతకుముందు ఎస్ఏపీలో ఉన్నతోద్యోగిగా ఉన్న సిక్కా.. దేశీయ ఐటీ రంగ దిగ్గజాల్లో ఒకటైన ఇన్ఫోసిస్ చీఫ్ ఎగ్జిక్యూటివ్‌గా కూడా పని చేసిన విషయం తెలిసిందే. ఇన్ఫో వ్యవస్థాపకులతో తలెత్తిన భేదాభిప్రాయాలు సిక్కా రాజీనామాకు దారితీసిన సంగతి విదితమే.

మూడు నెలల్లో వెయ్యి వాహనాలు

అందుబాటులోకి తీసుకురానున్న 'ఈ-యానా'

హైదరాబాద్, డిసెంబర్ 10: రోజు రోజుకు పెరిగిపోతున్న కాలుష్యాన్ని నియంత్రించే ఉద్దేశంలో భాగంగా వీజీ ఆర్కెడో ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్..విద్యుత్‌తో నడిచే టాక్సీలను మార్కెట్లోకి విడుదల చేసింది. ఈ-యానా బ్రాండ్‌తో విడుదల చేసిన ఈ ఆటోలు, బైకులతో కాలుష్యం ఉండదని కంపెనీ డైరెక్టర్ జీ విజయ కుమార్ తెలిపారు. ఇప్పటికే కరీంనగర్, వరంగల్‌ల్లో 100 వాహనాలను అందుబాటులోకి తీసుకొచ్చిన సంస్థ.. ఈ క్రమంలో హైదరాబాద్ మార్కెట్లోకి ప్రవేశించిందన్నారు. వచ్చే మార్చి నాటికి రాష్ట్రంలో పది నగరాల్లో వెయ్యి వాహనాలు అందుబాటులోకి తీసుకురావాలనుకుంటున్నట్లు ఆయన ప్రకటించారు. మూడేండ్ల క్రితం సౌర విద్యుత్ సొల్యూషన్స్ విభాగంలోకి అడుగు పెట్టిన సంస్థ..గతేడాది ఎలక్ట్రిక్ వాహన రంగంలోకి ప్రవేశించింది. దీంట్లోభాగంగా కెనిటిక్ గ్రీన్‌తో కలిసి ఈ-ఆటోలను తయారు చేస్తుండగా, ఒకినావాతో కలిసి ఈ-బైకులు, ఎక్సికామ్‌తో కలిసి బ్యాటరీలను తయారు చేస్తున్నది. ఈ విద్యుత్‌తో నడిచే వాహనాలను ఈ-యాన్ యాప్ ద్వారా బుకింగ్ చేసుకునే అవకాశాన్ని సంస్థ కల్పించింది. ఇందుకోసం ప్రత్యేకంగా డిజైన్ చేసిన యాప్‌ను రాష్ట్ర ఐటీ కార్యదర్శి జయేశ్ రంజన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..దేశంలో ఈవీల పాలసీని ప్రవేశపెట్టిన తొలి రాష్ట్రం తెలంగాణేనని, రాష్ట్రవ్యాప్తంగా 60 చార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఎల్5 విభాగానికి చెందిన మూడు చక్రాల వాహనం గరిష్ఠంగా గంటకు 25 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించనున్నది.

చుట్టుముట్టిన ఆర్థిక భయాలు

సెన్సెక్స్ 248, నిఫ్టీకి 81 పాయింట్ల పతనం

ముంబై, డిసెంబర్ 10: స్టాక్ మార్కెట్ల పతనం కొనసాగుతున్నది. వరుసగా రెండోరోజు మంగళవారం కూడా బ్యాంకింగ్, ఇంధనం, ఐటీ రంగ షేర్లు భారీ కుదుపునకు లోనుకావడంతో సూచీలు భారీగా నష్టపోయాయి. లాభాల్లో ప్రారంభమైన సూచీలకు అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన ప్రతికూల సంకేతాలకు తోడు దేశ ఆర్థిక వ్యవస్థపై ఆందోళన వ్యక్తంకావడంతో మదుపరులు ప్రాఫిట్ బుకింగ్‌కు మొగ్గుచూపారు. ఫలితంగా తీవ్ర ఒడిదుడుకుల మధ్య 30 షేర్ల ఇండెక్స్ బీఎస్ఈ సెన్సెక్స్ 247.55 పాయింట్ల నష్టంతో 40,239.88 వద్ద ముగిసింది. జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ కూడా మరో 80.70 పాయింట్లు పతనం చెంది 11,856.80 వద్ద స్థిరపడింది. వృద్ధి రేటుకు సంబంధించి అనుకూల వార్తలు వచ్చినప్పటికీ, అమెరికా-చైనా దేశాల మధ్య వాణిజ్య చర్చలు ఇప్పట్లో కొలిక్కి వచ్చే అవకాశాలు లేవన్న అంచనాలు మదుపరుల్లో ఆందోళనను పెంచింది. ఫలితంగా దేశీయ, అంతర్జాతీయ పెట్టుబడిదారులు ప్రాఫిట్ బుకింగ్‌కు మొగ్గుచూపారు.

యెస్ బ్యాంక్ షేరు ఢమాల్

యెస్ బ్యాంక్ షేరు పాతాళంలోకి పడిపోయింది. 2 బిలియన్ డాలర్ల నిధుల సేకరణ కష్టతరంకానున్నట్లు నివేదిక విడుదల కావడంతో షేరు కుప్పకూలింది. ఒక దశలో 12 శాతానికి పైగా పడిపోయిన షేరు ధర చివరకు 10.05 శాతం నష్టంతో రూ.50.55 వద్ద ముగిసింది. అటు ఎన్ఎస్ఈలోనూ 10.4 శాతం తగ్గింది. 2 బిలియన్ డాలర్లకు బదులుగా 500 మిలియన్ డాలర్లను సిటాక్స్ హోల్డింగ్స్ అండ్ సిటాక్స్ ఇన్వెస్ట్‌మెంట్ గ్రూపునకు బ్యాంక్ ఆఫర్ ఇచ్చింది. యెస్ బ్యాంక్‌తోపాటు పవర్ గ్రిడ్, ఇండస్ఇండ్ బ్యాంక్, ఎన్‌టీపీసీ, ఐటీసీ, టీసీఎస్, యాక్సిస్ బ్యాంక్, హీరో మోటోకార్ప్, మహీంద్రా అండ్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్‌లు కూడా మూడు శాతం వరకు మార్కెట్ వాటాను కోల్పోయాయి. కానీ, బజాజ్ ఆటో, హెచ్‌యూఎల్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, బజాజ్ ఆటో షేర్లు మాత్రం ఒక్క శాతంవరకు పెరిగాయి. రంగాల వారీగా చూస్తే అన్ని రంగాలు ప్రతికూల వృద్ధిని నమోదు చేసుకున్నాయి. యుటిలిటీ రంగం అత్యధికంగా 2 శాతానికి పైగా క్షీణించగా, ఇంధనం 1.83 శాతం, చమురు అండ్ గ్యాస్ 1.73 శాతం, మెటల్ 1.38 శాతం, బేసిక్ మెటీరియల్ 1.27 శాతం, ఐటీ 1.18 శాతం, టెక్ 1.12 శాతం, ఎఫ్ఎంసీజీ 1.11 శాతం, ఇంధనం 1.02 శాతం వరకు దిగువకు పడిపోయాయి. కాగా, డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 11 పైసలు పడిపోయి 70.93 వద్ద ముగిసింది.

ఏడాదిలోగా 45,500కి సెన్సెక్స్: కొటక్

ప్రస్తుతం తీవ్ర ఒడిదుడుకులను ఎదుర్కొంటున్న దేశీయ స్టాక్ మార్కెట్లు వచ్చే ఏడాది భారీగా పుంజుకునే అవకాశాలున్నాయని కొటక్ సెక్యూరిటీస్ అంచనావేస్తున్నది. వచ్చే ఏడాది చివరినాటికి బీఎస్ఈ సెన్సెక్స్ 45,500 పాయింట్లకు, నిఫ్టీ 13,400 పాయింట్లను తచ్చాడే అవకాశాలున్నాయని కొటక్ వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం సెన్సెక్స్ 40వేల స్థాయిలో కదలాడుతుండగా, నిఫ్టీ 11,900 స్థాయిలో ఉన్నది. 2019 జనవరి నుంచి నవంబర్ మధ్యకాలంలో సెన్సెక్స్ 13 శాతం ఎగబాకగా, నిఫ్టీ 11 శాతం పెరిగింది. వచ్చే మార్చి నాటికి నిఫ్టీ 10 శాతం వృద్ధి అంచనావేస్తున్న కొటక్ సెక్యూరిటీస్..వచ్చే ఏడాదిలో 27 శాతం పెరుగనున్నదని తెలిపింది. మిడ్ క్యాప్, స్మాల్ క్యాప్ సూచీలు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయని, వచ్చే ఏడాది కూడా ప్రతికూల వృద్ధిని నమోదు చేసుకునే అవకాశాలున్నాయని పేర్కొంది. కాగా, ప్రస్తుత సంవత్సరంలో రిజర్వు బ్యాంక్ 135 బేసిస్ పాయింట్లు వడ్డీరేట్లను తగ్గిస్తే బ్యాంకులు మాత్రం 50 బేసిస్ పాయింట్లు తగ్గించాయన్నారు.

స్కైవర్త్‌లో 5 వేల ఉద్యోగాలు

హైదరాబాద్, డిసెంబర్ 10: హాంకాంగ్ కేంద్రస్థానంగా ఎలక్ట్రానిక్ పరికరాల తయారీ సంస్థ స్కైవర్త్..హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ప్లాంట్ కోసం రూ.700 కోట్లకు పైగా ఖర్చు చేయబోతున్నది. మూడేండ్లలో మూడు విడుతల్లో ఖర్చు చేయనున్న ఈ నిధులతో టీవీల ఉత్పత్తి సామర్థ్యం రెట్టింపుకానున్నదని కంపెనీ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ క్రివర్ లియూ తెలిపారు. ప్రస్తుతం ఈ అసెంబ్లింగ్ యూనిట్‌లో ఏడాదికి 20 లక్షల టీవీలు ఉత్పత్తి అవుతుండగా, వచ్చే ఏడాది చివరినాటికి దీనిని 40 లక్షలకు పెంచుకోబోతున్నట్లు చెప్పారు. రూ.9 వేల నుంచి రూ.1.15 లక్షల లోపు పలు రకాల టీవీలను సంస్థ విక్రయిస్తున్నది. ఇప్పటి వరకు 4.82 లక్షల యూనిట్లు విక్రయించగా, వచ్చే ఏడాది చివరినాటికి 20 లక్షల యూనిట్లు విక్రయించాలని సంస్థ లక్ష్యంగా పెట్టుకున్నది. ఈ యూనిట్‌లోనే రిఫ్రిజిరేటర్లు, వాషింగ్‌మిషిన్లు, సెటప్ బాక్స్‌లను సైతం ఉత్పత్తి చేయనున్నట్లు ఆయన ప్రకటించారు. అలాగే ఈ యూనిట్ ద్వారా 5 వేల మందికి పైగా ఉపాధి అవకాశాలు లభించనున్నట్లు ఆయన ప్రకటించారు. ప్రస్తుతం 700 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభిస్తున్నది.

ప్యాసింజర్ వాహనాల్లో ప్రతికూలం



న్యూఢిల్లీ, డిసెంబర్ 10: ప్యాసింజర్ వాహన విక్రయాలు మళ్లీ పడిపోయాయి. పండుగ సీజన్ అక్టోబర్‌లో కాస్త కోలుకున్న అమ్మకాలు ఆ మరుసటి నెలలోనే ప్రతికూలానికి జారుకున్నాయి. దేశవ్యాప్తంగా డిమాండ్ లేకపోవడం, వీటికి తోడు అనవసరపు ఖర్చులను తగ్గించుకోవడంలోభాగంగా వాహన ఉత్పత్తి సంస్థలు డీలర్లను భారీగా తగ్గించుకోవడం విక్రయాలపై ప్రభావం చూపిందని భారత ఆటోమొబైల్ తయారీదారుల సంఘం(సియామ్) వెల్లడించింది. గత నెలలో దేశీయంగా 2,63,773 యూనిట్ల ప్యాసింజర్ వాహనాలు అమ్ముడయ్యాయి. క్రితం ఏడాది ఇదే నెలలో అమ్ముడైన 2,66,000లతో పోలిస్తే 0.84 శాతం తగ్గాయి. కానీ, యుటిలిటీ వాహనాలకు అనూహ్యంగా డిమాండ్ నెలకొనడం విశేషం. గత నెలలో ఏకంగా 92,739లు అమ్ముడయ్యాయి. 2018 ఏడాది నవంబర్‌లో అమ్ముడైన 69,884లతో పోలిస్తే 32.7 శాతం అధికం. సియామ్ విడుదల చేసిన నివేదికలో పలు అంశాలు..

- దేశవ్యాప్తంగా కార్ల అమ్మకాలు 10.83 శాతం తగ్గి 1,60,306లకు పడిపోయాయి. గతేడాది 1,79,783గా ఉన్నాయి. వ్యాన్ల విక్రయాలు ఏడాది ప్రాతిపదికన 34.32 శాతం తగ్గి 10,728లకి జారుకున్నాయి.
- ఏడాది ప్రాతిపదికన ద్విచక్ర వాహన అమ్మకాలు 14.27 శాతం తగ్గి 14,10,939లకు పడిపోయాయి. అంతక్రితం ఏడాది ఇదే నెలలో 16,45,783లు అమ్ముడయ్యాయి.
- వీటిలో మోటర్ సైకిల్ సేల్స్ 14.87 శాతం పతనం చెంది 8,93,538లకు పడిపోగా, స్కూటర్ విక్రయాలు కూడా 11.83 శాతం జారుకొని 4,59,851కి తగ్గాయి.
- అలాగే కమర్షియల్ వాహన సేల్స్ 15.98 శాతం దిగువకు పడిపోయాయి. గత నెలలో కేవలం 61,907లు మాత్రమే అమ్ముడయ్యాయి.
- కంపెనీల విషయానికి వస్తే మారుతి సుజుకీ 3.31 శాతం తగ్గగా, మహీంద్రా అండ్ మహీంద్రా విక్రయాలు కూడా 9.62 శాతం తగ్గగా, హ్యుందాయ్ మోటర్ సేల్స్ 2.04 శాతం పెరుగడం విశేషం.
- ద్విచక్ర వాహన విభాగానికి చెందిన సంస్థల్లో హీరో మోటోకార్ప్ అమ్మకాలు 15.81 శాతం పడిపోగా, హోండా మోటర్‌సైకిల్ అండ్ స్కూటర్ కూడా 5.32 శాతం క్షీణించగా, టీవీఎస్ మోటర్ అమ్మకాలు కూడా 26.52 శాతం పడిపోయాయి.
- గతనెలలో మొత్తంగా 17,92,415 వాహనాలు అమ్ముడయ్యాయి. 2018 ఏడాది ఇదే నెలలో అమ్ముడైన 20,38,007లతో పోలిస్తే 12.05 శాతం తగ్గాయి.

హ్యుందాయ్ కార్లు మరింత ప్రియం

ప్రముఖ వాహన సంస్థ హ్యుందాయ్ కూడా తన వాహన ధరలను పెంచేసింది. ఉత్పత్తి వ్యయం పెరుగడంతో వచ్చే నెల నుంచి అన్ని రకాల వాహన ధరలను పెంచుతున్నట్లు మంగళవారం ప్రకటించింది. పెట్రోల్, డీజిల్ రకాల వాహన ధరల పెంపులో వ్యత్యాసం ఉంటుందని కంపెనీ ఒక ప్రకటనలో వెల్లడించింది. ఎంత ధర పెంచుతున్నదో మాత్రం సంస్థ వెల్లడించలేదు. ఉత్పత్తి వ్యయం పెరుగడంతోపాటు ముడి సరుకుల ధరలు ఎగబాకడం వల్లనే ధరలు పెంచాల్సి వచ్చిందని కంపెనీ వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం ధరల పెంపుపై చర్చలు జరుగుతున్నాయని, ఈ నెల చివరినాటికి కొలిక్కి వచ్చే అవకాశం ఉన్నదని తెలిపింది. ఇది వరకే మారుతి సుజుకీ, టాటా మోటర్స్, మెర్సిడెజ్ బెంజ్, మహీంద్రా అండ్ మహీంద్రాలు ధరలను పెంచుతున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే.

> ప్యాసింజర్ వాహన విక్రయాలు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. గతేడాదితో పోలిస్తే గత నెలలో అమ్మకాల్లో క్షీణత నమోదైంది. పండుగ సీజన్‌కావడంతో అక్టోబర్‌లో స్వల్ప వృద్ధిని నమోదు చేసుకున్న పీవీ అమ్మకాలు ఆ మరుసటి నెలలో మళ్లీ దిగువకు పడిపోయాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి పీవీల అమ్మకాలు మరింత పడిపోయే అవకాశాలున్నాయి. వీటితోపాటు కమర్షియల్, ద్విచక్ర వాహన అమ్మకాలు కూడా మరింత పతనం చెందాయి. వరుసగా రెండు నెలల్లో పలు యుటిలిటీ వాహనాలు విడుదల కావడంతో ఈ రంగంలో వృద్ధి నమోదైంది.
>
> - రాజేశ్ మీనన్, సియామ్ డైరెక్టర్ జనరల్

లాభం కాదు.. నష్టం

2018-19కిగాను బయటపడిన మరో రూ.12 వేల కోట్ల ఎస్బీఐ ఎన్‌పీఏలు

రూ.862 కోట్ల లాభాల స్థానంలో రూ.7 వేల కోట్ల నష్టాలు

న్యూఢిల్లీ, డిసెంబర్ 10: ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్బీఐ గత ఆర్థిక సంవత్సరం (2018-19)లో ఏకంగా సుమారు రూ.12 వేల కోట్ల మొండి బకాయి (నిరర్థక ఆస్తులు లేదా ఎన్‌పీఏ)లను తక్కువగా చూపింది. ద

మాజీ ఎంపీ కవితకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నల్ల భారతి

సమస్యల పరిష్కారానికి చొరవచూపండి

- మాజీ ఎంపీ కవితకు అంగన్‌వాడీల విజ్ఞప్తి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో అంగన్‌వాడీ వర్కర్ల వేతనాలు పెంచిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ (టీఆర్‌వీకేఎస్ అనుబంధం) అధ్యక్షురాలు నల్ల భారతి అన్నారు. ప్రస్తుతం కొన్ని సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటి పరిష్కారానికి చొరవ చూపాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, మాజీ ఎంపీ కల్వకుంట్ల కవితకు ఆమె విజ్ఞప్తిచేశారు. ఈ మేరకు మంగళవారం ఆమెను కలిసి ఒక వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా భారతి మాట్లాడుతూ రాష్ట్రంలో అంగన్‌వాడీ కేంద్రాల కుదింపు జరుగుతుందని వస్తున్న వదంతులతో టీచర్లు, ఆయాలు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. కేంద్రాలను తగ్గించవద్దని కోరారు. ఐసీడీఎస్‌లో 44 ఏండ్లుగా పనిచేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు ఉద్యోగ భద్రత కల్పించాలని, పదోన్నతులు ఇవ్వాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని కోరినట్లు చెప్పారు. దీనిపై సీఎం కేసీఆర్‌కు వివరిస్తానని మాజీ ఎంపీ కవిత హామీ ఇచ్చినట్లు భారతి తెలిపారు.

ఢిల్లీలో మొక్కలు నాటి నీరుపోస్తున్న ఎంపీ అనిల్ అగర్వాల్, తెలంగాణభవన్ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్

హైదరాబాద్‌లో మొక్కనాటుతున్న అదనపు సీపీ డీఎస్ చౌహాన్

గ్రీన్ చాలెంజ్‌లో బీజేపీ ఎంపీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: టీఆర్ఎస్ ఎంపీ సంతోష్‌కుమార్ తలపెట్టిన గ్రీన్‌చాలెంజ్‌లో దేశంలోని అన్ని ప్రాంతాల్లో ప్రముఖులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. యూపీకి చెందిన బీజేపీ రాజ్యసభ సభ్యుడు అనిల్ అగర్వాల్ ఢిల్లీలోని తన నివాసంలో మూడు మొక్కలు నాటి మరో ముగ్గురిని నామినేట్ చేశారు. ప్రభుత్వ ప్రత్యేక ప్రధానకార్యదర్శి అధర్ సిన్హా విసిరిన గ్రీన్ చాలెంజ్‌తో ఢిల్లీలోని తెలంగాణభవన్ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్ మంగళవారం భవన్ ప్రాంగణంలో మొక్క నాటారు. నల్లగొండ ఎంపీ, వనపర్తి కలెక్టర్, తెలంగాణభవన్ అదనపు రెసిడెంట్ కమిషనర్‌కు చాలెంజ్ విసిరారు. ఏసీబీ డీజీ పూర్ణచందర్‌రావు ఇచ్చిన గ్రీన్ చాలెంజ్‌ను స్వీకరించిన హైదరాబాద్ అదనపు సీపీ (శాంతిభద్రతలు) డీఎస్ చౌహాన్ మంగళవారం గోషామహల్‌లోని సిటీ సెక్యూరిటీ భవన ప్రాంగణం, నార్త్‌జోన్ డీసీపీ కార్యాలయ అవరణలో మొక్కలు నాటారు.

టెలిమెట్రీపై సీడబ్ల్యూపీఆర్ఎస్ సర్వే

- ఈ నెల 17, 18,19 తేదీల్లో ప్రాజెక్టుల సందర్శన
- 20న బోర్డు అధికారులతో శాస్త్రవేత్తల భేటీ
- శ్రీశైలం, సాగర్ నీటినిల్వ సామర్థ్య సర్వేపైనా చర్చించే అవకాశం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలుగు రాష్ట్రాల పరిధిలోని కృష్ణా ప్రాజెక్టుల వద్ద టెలిమెట్రీ ఏర్పాటు ప్రక్రియ కొనసాగుతూనే ఉన్నది. మొదటిదశ విజయవంతం కాకపోగా.. రెండోదశ టెండర్ల దశలోనే ఆపసోపాలు పడుతున్నది. రెండోదశలో భాగంగా చేపట్టాల్సిన ఆరు పాయింట్ల వద్ద శాస్త్రీయ సర్వే కాకపోవడంతో సెంట్రల్ వాటర్, పవర్ రీసెర్చ్ స్టేషన్ (సీడబ్ల్యూపీఆర్ఎస్) శాస్త్రవేత్తలు ఈనెల 16న హైదరాబాద్‌కు రానున్నారు.17 నుంచి 19 వరకు జూరాల పరిధిలోని నాలుగు పాయింట్లు, కేసీ కెనాల్, నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్ పాయింట్లను పరిశీలిస్తారు. ఆయా పాయింట్ల వద్ద ఎక్కడ టెలిమెట్రీని ఏర్పాటుచేయాలి? ఏరకమైన పరికరాన్ని అమర్చాలి? అనే దానిపై బోర్డుకు సూచనలు చేస్తారు. ఈ నెల 20న కృష్ణాబోర్డు అధికారులతో సమావేశమై అంశాలపై చర్చిస్తారు. మొదటిదశలో ఏర్పాటుచేసిన 18 పాయింట్ల వద్ద ప్రక్రియ విజయవంతం కాలేదు. రెండోదశకు సంబంధించి ప్రక్రియ టెండర్ల దశలోనే ఉన్నది. దీంతో కచ్చితమైన డిశ్చార్జి లెక్కలు వచ్చేందుకు ఇంకెలాంటి చర్యలు తీసుకోవాలనే దానిపై బోర్డు అధికారులు శాస్త్రవేత్తల నుంచి సలహాలు తీసుకొనే అవకాశమున్నది. సమావేశంలో భాగంగా కీలకమైన చర్చ మరొకటి కూడా జరిగే అవకాశముందని అధికారులు చెప్తున్నారు. కొన్నేండ్లుగా శ్రీశైలం అవుట్‌ఫ్లో, నాగార్జునసాగర్ ఇన్‌ఫ్లో మధ్య భారీ తేడాలు వస్తున్న నేపథ్యంలో రిజర్వాయర్ల నీటి నిల్వ సామర్థ్యంపై సర్వే చేయాలనే ప్రతిపాదన తెరపైకి వచ్చింది. కృష్ణా బోర్డు అధికారులు రెండు జలాశయాల సర్వేకు సీడబ్ల్యూపీఆర్ఎస్‌కు లేఖ రాయగా.. అందుకు సుమారు రూ.కోటిన్నర వరకు అవుతుందని శాస్త్రవేత్తలు అంచనాలు పంపారు. దీనిపై బోర్డు ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో రెండు తెలుగు రాష్ట్రాలకు అత్యంత కీలకమైన జలాశయాల నిల్వ సామర్థ్యంపై సందిగ్ధత వీడటం లేదు.

నిధులే అసలు సమస్య

టెలిమెట్రీతోపాటు శ్రీశైలం, సాగర్ జలాశయాల సామర్థ్యంపై సర్వేకు నిధులే అసలు సమస్య. ముఖ్యంగా కృష్ణాబోర్డు అధికారులు రెండోదశ టెలిమెట్రీ కోసం చాలారోజుల కిందటే టెండర్లు పిలిచారు. రూ.4 కోట్ల అంచనా వ్యయంతో 18 చోట్ల పరికరాల ఏర్పాటుకు టెండర్లను ఆహ్వానించారు. కానీ, ఇప్పటివరకు టెండరు ప్రక్రియ పూర్తికాలేదు. దీనికి నిధుల లేమి ప్రధాన కారణంగా తెలుస్తున్నది. రెండు రాష్ట్రాలతో బోర్డు సమావేశాన్ని నిర్వహిస్తే దీనిపై చర్చించాలని బోర్డు అధికారులు భావిస్తున్నారు.

మంగళవారం సికింద్రాబాద్‌లోని సీతాఫల్‌మండి చర్చిలో మహిళలకు క్రిస్మస్ కానుకను అందజేస్తున్న శాసనసభ డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్. ప్రభుత్వం నిర్వహించే క్రిస్మస్ విందుకు సికింద్రాబాద్‌లోని చర్చిల నిర్వాహకులు, ప్రతినిధులు పెద్దఎత్తున హాజరుకావాలని ఈ సందర్భంగా ఆయన విజ్ఞప్తిచేశారు. - సికింద్రాబాద్, నమస్తేతెలంగాణ

చరిత్రను నిర్భయంగా చెప్పిన ధీశాలి బీఎన్ శాస్త్రి

- తెలంగాణ సాహిత్యానికి చేసినసేవలు చిరస్మరణీయం: నందిని సిధారెడ్డి



బీఎన్ శాస్త్రి సాహిత్యవ్యాసాల సమాహారం 'శిలాక్షరం' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణ వివక్షకు గురైనపుడు తెలంగాణ చరిత్రను నిర్భయంగా, నిరంతరంగా చెప్పిన ధీశాలి బీఎన్ శాస్త్రి.. ఉన్నదాన్ని ఒప్పుకోక ఘర్షణ పడి చరిత్రను రచించినవారే అసలైన చరిత్రకారులు.. ఆ కోవలోకే బీఎన్ శాస్త్రి కూడా వస్తారని తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ నందిని సిధారెడ్డి అన్నారు. తెలంగాణ సాహిత్య అకాడమీ, మూసీ సాహిత్యధార సంయుక్త ఆధ్వర్యంలో 'బీఎన్ శాస్త్రి సాహిత్యం– సమాలోచన' అంశంపై రెండురోజుల జాతీయ సదస్సును ఓయూ ప్రాంగణంలోని సురభారతి హాలులో నిర్వహించారు. ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన సిధారెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ సాహిత్యానికి బీఎన్ శాస్త్రి చేసిన సేవలు చిరస్మరణీయమైనవని కొనియాడారు. ఈ సదస్సు శాస్త్రిని తెలంగాణ లోకానికి తిరిగి కొత్తగా పరిచయం చేసిందని, నవలా సాహిత్యం, శాసనాల వెలికితీతలో ఆయన ప్రతికూల పరిస్థితుల్లోనూ తనదైన బాటవేసుకుని ముందుకుసాగారని గుర్తుచేశారు. ఒక చరిత్రకారుడికి ఉండాల్సిన లక్షణాలన్నీ నూటికి నూరుశాతం ఆయనకు ఉన్నాయని చెప్పారు. చరిత్రలో ఖాళీగా ఉన్న పేజీల్లో కొత్త పరిశోధనలు చేసి చరిత్రలోకాన్ని సైతం ఆశ్చర్యపరిచారన్నారు. సదస్సుకు అధ్యక్షత వహించిన ప్రొఫెసర్ కసిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ.. ఎంతోమంది పరిశోధకులకు సొంతడబ్బులతో పుస్తకాలను అచ్చువేయించారని చెప్పారు. ఎన్నో కష్టాలుపడి జిల్లా సర్వస్వాలను రచించారని తెలిపారు. సీఎం కార్యాలయ ఓఎస్డీ దేశపతి శ్రీనివాస్ మాట్లాడుతూ.. తెలంగాణలో పరిశోధక సంస్థను నెలకొల్పి, దానికి బీఎన్ శాస్త్రి పేరును పెట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇప్పటివరకు రాష్ట్రంలో పరిశోధక సంస్థలేదని, ప్రభుత్వం ఆ దిశగా యోచించాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ఏర్పడ్డాక శాస్త్రి చిరస్మరణీయులయ్యారని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా శాస్త్రి సాహిత్య వ్యాసాల సమాహారం 'శిలాక్షరం' పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో మూసీ మాసపత్రిక సంపాదకుడు సాగి కమలాకరశర్మ, శ్రీరంగాచార్యులు, ఓయూ మాజీ రిజిస్ట్రార్ కిషన్‌రావు, పల్లెర్ల రామ్మోహన్, శభిన్నూరి గోపాలకృష్ణ, శాస్త్రి కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

చెట్టును నరికించిన వ్యక్తికి 5 వేలు జరిమానా

సిరిసిల్ల రూరల్: ఇంటి ముందు ఏపుగా పెరిగిన చెట్టును కొట్టడంతో సంబంధిత ఇంటి యజమానికి పంచాయతీ పాలకవర్గం రూ.5 వేల జరిమానా విధించింది. రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం ఇందిరమ్మకాలనీలో హరితహారంలో భాగంగా 2015లో గ్రామ పంచాయతీ సిబ్బంది కోటలక్ష్మి –చంద్రమోహన్ ఇంటి ముందు వేప మొక్క నాటారు. ఏపుగా పెరిగిన చెట్టు వేర్లతో భవిష్యత్తులో ఇంటికి ఇబ్బందులు వస్తాయని, మంగళవారం కూలీలను పెట్టి వేప చెట్టును కొట్టించారు. దీంతో ఇంటి యజమాని లక్ష్మికి 5 వేల రూపాయల జరిమానాను విధించారు. డబ్బులు చెల్లించడంతో రశీదు అందించారు.

వేములవాడలో బద్దిపోశమ్మ దర్శనం కోసం ఆలయం ఎదుట నెత్తిన బోనాలతో బారులు తీరిన భక్తులు

బద్దిపోశమ్మకు ఘనంగా బోనాలు

- మొక్కులు చెల్లించుకున్న భక్తులు

వేములవాడ కల్చరల్: వేములవాడ రాజన్న అనుబంధ దేవాలయమైన బద్దిపోశమ్మ ఆలయంలో భక్తులు మంగళవారం ఘనంగా బోనాలు సమర్పించారు. రాజన్నను దర్శించుకున్న అనంతరం బద్దిపోశమ్మకు మొక్కులు చెల్లించడం ఆనవాయితీ. ఈ క్రమంలో భక్తులు అమ్మవారికి కల్లుపోసి, సారెపెట్టి, పట్నాలు వేసుకున్నారు. బోనాలు నెత్తిన పెట్టుకొని డప్పుచప్పుళ్ల మధ్య నృత్యాలు చేస్తూ పోశమ్మ ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారికి ఘనంగా మొక్కులు చెల్లించుకున్నారు.

- ఆత్మరక్షణకు కరాటే

కరీంనగర్‌లోని అంబేద్కర్ స్టేడియంలో వివిధ విద్యాసంస్థలకు చెందిన సుమారు పదివేల మంది విద్యార్థినులకు మంగళవారం కరాటే చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ వసంత్‌కుమార్ ఆధ్వర్యంలో కరాటే శిక్షణ ఇచ్చారు. ఆపద ఎదురైనప్పుడు ఎదుర్కొనే విధానంపై మెళకువలు నేర్పారు. కార్యక్రమంలో సీపీ కమలాసన్‌రెడ్డి అడిషనల్ డీసీపీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. - కరీంనగర్ క్రైం

దేవాలయాల సందర్శనతో విజ్ఞానం

- విశాఖ శారదాపీఠం ఉత్తరాధికారి స్వామి స్వాత్మానందేంద్ర సరస్వతి ఉవాచ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: దేవాలయాల సందర్శనతో విశేష ఫలితంతోపాటు విజ్ఞానం కూడా పెంపొందుతుందని విశాఖ శారదాపీఠం ఉత్తరాధికారి స్వామి స్వాత్మానందేంద్ర సరస్వతి అన్నారు. ఏపీలోని అనంతపురం జిల్లా పెన్నహోబిలం పుణ్యక్షేత్రాన్ని మంగళవారం సందర్శించిన స్వామీజీకి ఆలయ అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం స్వామీజీ లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేకపూజలు నిర్వహించి, అనుగ్రహ భాషణం చేశారు. పురాణ, ఇతిహాసాలను తెలుసుకుంటే అపారమైన జ్ఞానం సొంతమవుతుందన్నారు. ఈ కారణంగానే భారతీయ సంస్కృతిని విజ్ఞానగనిగా ప్రపంచమంతా గుర్తించిందన్నారు.

ఏసీబీకి చిక్కిన కోర్టు బెంచ్‌క్లర్క్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఒక కేసులో అనుకూల ఉత్తర్వులు ఇప్పిస్తానంటూ ఫిర్యాదుదారు నుంచి భారీ మొత్తాన్ని డిమాండ్‌చేసిన అదనపు ఫ్యామిలీ కోర్టు బెంచ్‌క్లర్క్ అవినీతి నిరోధకశాఖకు చిక్కారు. హైదరాబాద్ సిటీ సివిల్‌కోర్టు కాంప్లెక్స్‌లోని అదనపు ఫ్యామిలీ కోర్టులో బొజ్జ రామకృష్ణ బెంచ్‌క్లర్క్‌గా పనిచేస్తున్నాడు. సికింద్రాబాద్ కవాడిగూడకు చెందిన ప్రైవేటు ఉద్యోగి అలోక్ వర్ధన్‌సింగ్‌కు సంబంధించిన కేసు అదనపు ఫ్యామిలీ కోర్టులో ఉన్నది. న్యాయమూర్తి ఎస్ శ్రీవాణి నుంచి వర్ధన్‌సింగ్‌కు అకుకూలంగా ఉత్తర్వులు ఇప్పిస్తానంటూ బెంచ్‌క్లర్ రామకృష్ణ అతని నుంచి మోటర్‌సైకిల్ రూపంలో లంచాన్ని కోరడంతోపాటు జిల్లా జడ్జికి రూ.15 లక్షలు కావాలని డిమాండ్ చేశారు. ఫిర్యాదుదారుని సమాచారం మేరకు రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు రామకృష్ణను పట్టుకుని, అరెస్టు చేసి, ఏసీబీ ప్రత్యేక న్యాయమూర్తి ఎదుట ప్రవేశపెట్టారు. న్యాయశాఖకు సంబంధించిన ఏ ఉద్యోగి లంచాన్ని డిమాండ్ చేసినా వెంటనే ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064కు సమాచారం ఇవ్వాలని ఏసీబీ డైరెక్టర్ జనరల్ ప్రజలను కోరారు.

రోడ్డుపై బాలిక పేరుతో కేకులు

- వరంగల్ మిల్స్‌కాలనీ ఠాణా పరిధిలో కలకలం
- పరారీలో ఆకతాయిలు

వరంగల్ మిల్స్‌కాలనీలో పోలీసులను చూసి ఆకతాయిలు విసిరిసిన కేక్‌లు

ఖిలావరంగల్: మహిళలు, యువతులపై ఆకతాయిల ఆగడాలు ఆగడంలేదు. మంగళవారం వరంగల్ మిల్స్‌కాలనీ పోలీసుస్టేషన్ పరిధిలో ఆకతాయిల చేష్టలు కలకలం సృష్టించాయి. స్థానికుల కథనం ప్రకారం.. వరంగల్‌కు చెందిన ఓ బాలికను కొందరు యువకులు ప్రేమపేరుతో వేధిస్తున్నారు. ఇవేమీ పట్టించుకోకుండా బాలిక యథావిధిగా పాఠశాలకు వెళ్తున్నది. అయితే బాలికను ఏదో రకంగా ఆకర్షించాలని ఆ ఆకతాయిలు ఆమె పేరుమీద 20కి పైగా కేకులు తయారుచేయించి.. బాలిక నడుచుకుంటూ వెళ్లే దారిలో అక్కడక్కడ కేక్‌లు పెట్టారు. స్థానికులు గమనించి మిల్స్‌కాలనీ పోలీసులకు సమాచారం చేరవేశారు. దీంతో పోలీసులు ఘటనా స్థలానికి వస్తుండగా గమనించిన ఆకతాయిలు కేకులు పడేసి అక్కడి నుంచి పారిపోయారు. సీసీ కెమెరాల ఆధారంగా పోలీసులు వారిని గుర్తించారు. ఈ ఘటనకు సంబంధించి మరింత సమాచారం తెలియాల్సి ఉన్నది.

విద్యార్థినుల కిడ్నాప్‌నకు విఫలయత్నం

కోరుట్లటౌన్: ఇద్దరు విద్యార్థినులను కిడ్నాప్ చేసేందుకు ఓ వ్యక్తి యత్నించిన ఘటన జగిత్యాల జిల్లా రాయికల్ మండలంలో ఆలస్యంగా వెలుగు చూసింది. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన 17, 13 ఏండ్ల వయస్సున్న బాలికలు సోమవారం రాయికల్ వెళ్లేందుకు గ్రామంలోని బస్‌స్టాప్ వద్ద బస్సు కోసం వేచిఉన్నారు. అదే సమయంలో ద్విచక్ర వాహనంపై వచ్చిన ఓ గుర్తు తెలియని యువకుడు లిఫ్ట్‌ఇస్తానని నమ్మించి బైక్ ఎక్కించుకున్నాడు. అయితే బైక్ నడుపుతున్న యువకుడు రాయికల్ వైపు కాకుండా ఇటిక్యాల వైపు నుంచి దారి మళ్లించి కోరుట్ల మండలంలోని కల్లూరు వైపు వచ్చాడు. అనుమానం వచ్చిన బాలికలు అటు ఎందుకు తీసుకుపోతున్నావని ప్రశ్నించగా, పొలానికి నీరు పెట్టాననీ, మోటర్ స్విచ్ ఆఫ్ చేసి రాయికల్ పోదామని సమాధానమిచ్చాడు. రాయికల్‌వైపు కాకుండా ద్విచక్రవాహనంపై కల్లూరు, అయిలాపూర్ మధ్యలో ఉన్న గుట్టల మధ్యకు తీసుకెళ్లాడు. అక్కడ ఇద్దరిలో ఓ బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించడంతో అప్రమత్తమైన మరో బాలిక అగంతకుడిపై బండరాళ్లతో దాడి చేసింది. కేకలు వేస్తూ రక్షించడని ఆరవడంతో నిందితుడు బాలిక మెడలో ఉన్న బంగారు గొలుసు, పర్సులో ఉన్న రూ.500 నగదు లాక్కొని విషయం ఎవరికైనా చెబితే చంపివేస్తానని చెప్పి బైక్‌పై పరారయ్యాడు. బాలికలు రహదారి మీదకు వచ్చి స్థానికుల సాయంతో కుటుంబసభ్యులకు సమాచారం చేరవేశారు. కుటుంబసభ్యులు, పోలీసులు అతడి ఆచూకీ కోసం గాలించినా ఫలితం లేకపోయింది. బాధితుల ఫిర్యాదు మేరకు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసుకున్నారు.

శవ రాజకీయాలు బాబుకు అలవాటే

- కుక్కతోక వంకర సామెతకు బాబే ఉదాహరణ
- ఏపీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి

అమరావతి: శవరాజకీయాలు చేయడం టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబుకు అలవాటేనని ఏపీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చెప్పారు. ఉల్లికి సంబంధించిన రాజకీయాలు చూస్తే బాధేస్తున్నదని అన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ఏపీలో కేజీ ఉల్లిని రూ.25కే ఇస్తున్నామని చెప్పారు. ఇప్పటివరకు 38,496 క్వింటాళ్ల ఉల్లిని ప్రజలకు అందించామని తెలిపారు. మంగళవారం ఏపీ అసెంబ్లీలో ఉల్లి ధరలు, సన్నబియ్యం, రైతు భరోసా తదితర అంశాలపై అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య మాటలయుద్ధం నడిచింది. అసెంబ్లీలో ఆయా సందర్భాల్లో జగన్ మాట్లాడుతూ.. చంద్రబాబు హెరిటేజ్ షాపుల్లో కేజీ ఉల్లిని రూ.200 అమ్ముతున్నారు.. కానీ, రైతుబజార్లతో రూ.25కే అందజేస్తున్నామని చెప్పారు. 'కుక్కతోక వంకర' అనే సామెతకు ఎవరైనా ఉదాహరణ ఉన్నారంటే అది చంద్రబాబునాయుడే అని సీఎం జగన్ రెండు చేతులు జోడించి దండం పెట్టారు. ఎవరిది కుక్కతోకో త్వరలోనే తెలుస్తుందని చంద్రబాబు ఘాటుగా బదులిచ్చారు. హెరిటేజ్ ఫ్రెష్‌ను ఫ్యూచర్ గ్రూప్‌కు అమ్మేశామని, అది తమదని నిరూపిస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని అన్నారు. నిరూపించకపోతే సీఎం పదవికి జగన్ రాజీనామా చేస్తారా? అని చంద్రబాబు సవాల్ విసిరారు. మరో అంశంపై జగన్ మాట్లాడుతూ.. వైఎస్సార్సీపీ మ్యానిఫెస్టోలో సన్నబియ్యం అన్న మాటే లేదని అన్నారు. మ్యానిఫెస్టోలో చెప్పని పనులను కూడా తమ ప్రభుత్వం చేస్తున్నదని చెప్పారు. ప్రజలకు నాణ్యమైన బియ్యం అందజేస్తున్నామని తెలిపారు. టీడీపీ అధినేత చంద్రబాబు, తనయుడు లోకేశ్‌పై వైఎస్సార్సీపీ ఎమ్మెల్యే రోజా సభలో విమర్శలు గుప్పించారు.

నమస్తే తెలంగాణ WWW. NTNEWS.COM

జిందగీ

బుధవారం 11 డిసెంబర్ 2019 /nt.zindagi

'పదికి రెండు కిలోలు.. పదికి రెండు' అంటూ పలికిన ఉల్లిధర.. ఇప్పుడు.. 'అగ్గువా అగ్గువా కిలోకి వంద.. రెండొందలు' అంటూ పలుకుతున్నది. మామూలుగా రేట్లు పెరిగితే 'వామ్మో.. వాయ్యో' అంటాం కదా? ఇదంతా సీరియస్ మ్యాటర్. బట్ ఎ చేంజ్. జనాలు రూటు మార్చారు. ఉల్లిధర తీవ్రతను సీరియస్‌గా చెప్పకుండా జోకులేసేస్తున్నారు. ఉల్లిలొల్లికి హ్యూమర్ బాంబులేస్తూ బాప్‌రే అనిపిస్తున్నారు. అందుకే ఇప్పుడెక్కడ చూసినా.. 'ఉల్లి ఉల్లాసమే' కనిపిస్తున్నది. ఉల్లిఘాటుతో పాటు.. హుషారైన హాస్యమూ హీటెక్కుతున్న నేపథ్యంలో కథనం.

పెరిగిన ఉల్లి ధరలు.. పేలిన జోకులు!

'వదినా ఓ రెండు ఉల్లిగడ్డలు బదులివ్వవా'? అంటే.. 'రెండు కాకపోతే రెండు కిలోలు తీసుకెళ్లొదినా' అనేది పాత డైలాగ్. ఇప్పుడు చేంజ్. 'సారీ వదినా.. బంగారమైనా ఇస్తాగానీ ఉల్లిగడ్డలు రెండు కాదు కదా.. ఒక్కటి కూడా ఇవ్వలేను' అంటున్నారు. అవును మరి.. పక్కింటి ముచ్చట్లు ఇలానే ఉంటున్నాయి ప్పుడు. ఒక్కదెబ్బకు రెండు పిట్టలు రాలుతాయనేది విన్నాం కదా? అదే ఇది. ఉల్లిరేటు తీవ్రత ఏంటో తెలుపుతూనే దానికి చక్కటి హాస్యాన్ని జోడిస్తున్నారు. ఇంకొంద రైతే పెండ్లిళ్లో 'ఉల్లిగడ్డలు ప్యాక్' చేసి గిఫ్టులుగా ఇస్తున్నారు. కొందరైతే.. ఉల్లిగడ్డల ధరల తీరును తెలిపేందుకు 'అల్లుడు ఉల్లిగడ్డ రైతైనా బాగుండు' అనుకుంటు న్నారు. ఇది రోజూ మనం చూస్తూనే ఉన్నాం. కార్టూన్‌ల రూపంలో.. వీడియోల రూపంలో.. కవితల రూపంలో ఇలా జోక్సే జోక్సు.!

'లవ్యూ'.. అబ్బాయి ప్రపోజ్ చేశాడు
అమ్మాయి 'నో' అన్నది
'నా దగ్గర కారుంది'
'నో'..
'అయామ్ ఏ మిలియనీ'
'నో'
'ఇదిగో ఈ రింగ్ నీకోసమే'
'గోల్డా, ప్లాటీనమా?'
'ఆనియన్'
అమ్మాయి ఇంప్రెస్‌డ్.

10 శాతం డిస్కౌంట్
అందుబాటులో ఈఎంఐ
ఫ్రీ అండ్ స్పీడ్ డెలివరీ
@ ఆన్‌లైన్‌లో అమ్మకానికి ఉల్లి

నువ్వు లేకుండా నాకేం బాగోలేదు.
ఆకలి అవడం లేదు..
భోజనం రుచించడం లేదు..
తినేటప్పుడు నువ్వుంటే బాగుండు అనిపిస్తుంది..
రాత్రి కలలోకి వస్తున్నావు..
ఎక్కడికెళ్లినా నువ్వే గుర్తొస్తున్నావు..
నా ఇంట్లో వెలతి ఉంది.. వంటిల్లు బోసి పోయింది.
నీ కోసం నా గది తలుపులు ఎప్పుడూ తెరిచి ఉంచుతా..
ఎప్పుడు వస్తావంటే ఏమో తెలియదు కానీ
ఇక రాను అంటే లోపలేదో నొప్పిగా ఉంది..
'ధర' ఎప్పుడు తగ్గుతావు? ఇంటికెప్పుడు వస్తావు..
@ఉల్లిగడ్డకో ప్రేమలేఖ

ఇన్నాళ్లూ మిర్చీకే ఘాటెక్కువ అనుకున్నాం..
ఇప్పుడు ఉల్లికీ ఘాటెక్కువే..
గుండెమంట అనుకున్నవా అక్కయ్యా.. ఇది ఉల్లిమంట..
@ మార్కెట్‌లో ఓ మహిళ



ఉల్లి బాంబ్‌లు

రమేశ్.. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అని నమ్మించాడు. మొదట స్నేహం అన్నాడు. తర్వాత ప్రేమ అన్నాడు. నెమ్మదిగా పరిచయం పెంచుకున్నాడు. అమ్మాయి వివరాలు, కుటుంబ నేపథ్యం తెలుసుకున్నాడు. తేనెపూసిన కత్తిలా తీయని మాయమాటలు చెప్పి ఆమె చిరునామా తెలుసుకున్నాడు. బయట కలవడం నాకిష్టముండదని మర్యాదస్తుడిలా మాట్లాడాడు. ఓ రోజు మిట్టమధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేనిది తెలుసుకొని ఇంట్లోకి వచ్చాడు. ఎవరూ రారని నిర్ధారించుకున్నాడు. నెమ్మదిగా మాటల్లో దించాడు. అప్పటికే జేబులో సిద్ధం చేసుకున్న మత్తు మందు కలిపిన చాక్లెట్ తీసిచ్చాడు. అది తిన్న ఆ యువతి నెమ్మదిగా సోఫాలో ఒరిగింది. వెంటనే క్షణం కూడా ఆలస్యం చేయకుండా వడివడిగా వంటింట్లోకి నడిచి తన వెంట తెచ్చుకున్న సంచి నిండా ఉల్లిపాయల్ని సర్దేసుకున్నాడు. సంచిలో కుక్కుకుని పారిపోయాడు.

* * *

ముగ్గురు కుర్రాళ్లు... ఓ అమ్మాయి వెంట పడుతుం టారు. వారి నుంచి రక్షించుకోవడానికి అమ్మాయి పరుగు పెడుతుంది. కానీ ఆమెను వదలకుండా కుర్రాళ్లు ఆమె వెనుకే అనుసరిస్తారు. చివరికి వీరి బాధ పడకలేక ఆ అమ్మాయి తన చేతిలో ఉన్న వాటిని కింద పడేసి పరిగెడుతుంది. వెంటనే ఆ ముగ్గురు కుర్రాళ్లు వాటిని అందుకుంటారు. ఇంతకీ ఆమె కింద పడేసినవి డబ్బులు.. బంగారం కాదు.. ఉల్లిపాయలు.

భార్యను ప్రేమతో దగ్గరకు తీసుకుంటాడు భర్త. ఒక ప్యాకెట్‌ను చేతిలో పెడతాడు. తన కోసం ఏం గిఫ్ట్ తెచ్చారో అని సంబరపడుతూ దానిని తెరుస్తుంది. అందులో ఒక చిన్న బాక్సు ఉంటుంది. అందులో ఉన్న వస్తువును చూసి ఒక్కసారి అవాక్కవుతుంది. ఇంతకీ ఆ పెట్టెలో ఉన్నది ఏమిటో తెలుసా... ఉల్లిగడ్డ.

* * *

వంటింట్లో వంట చేస్తున్న భార్య.. కుర్చీలో కూర్చొని కునికిపాట్లు పడుతున్న భర్త వద్దకు ఆడుగులో అడుగు వేసుకుంటూ నెమ్మదిగా వస్తుంది. చప్పుడు లేకుండా మెల్లగా భర్త జేబులో ఉన్న బీరువా తాళం చెవిని తీసే ప్రయత్నం చేస్తుంది. గమనించిన భర్త వెంటనే తేరుకొని భార్య చేయి పట్టుకుంటాడు. దొంగతనం ఎందుకు చేస్తున్నావన్నట్లు ఆమె వైపు చూస్తాడు. అసలు విషయం అర్థమై.. తనే బీరువా వద్దకు వచ్చి రెండు ఉల్లిగడ్డలు తీసి భార్య చేతిలో పెడతాడు. భర్త చేష్టలతో ఆశ్చర్యపోవడం భార్య వంతు అవుతుంది.

* * *

ఉంగరంలో ఉల్లిపాయ.. తాంబూలంలో ఉల్లిపాయలు. పేకాట రాయుళ్ల పందాల్లో ఉల్లిపాయలు. పెళ్లి రిసెప్షన్ లో పెళ్లి కూతురుకి..పెళ్లి కొడుక్కి గిఫ్ట్ గా ఉల్లి పాయలు. జువెలరీ బాక్సుల్లో ఉల్లిపాయలు. తన ఇంట్లో డైనింగ్ టేబుల్ మీద భోజనం చేస్తున్న ఓ వ్యక్తి దగ్గరకు సడెన్ గా ఇన్ కమ్ ట్యాక్స్ అధికారులు వచ్చారు. మేం ఇన్ కమ్ ట్యాక్స్ అధికారం..మీ ఇంట్లో కూరల్లో ఉల్లిపాయలు వాడుతున్నారనీ తెలిసింది అందుకే మీ ఆస్తులపై రైడ్ చేయటానికి వచ్చామని కార్టూన్ తెగ నవ్విస్తున్నది.

'ఉల్లి' వారిమండీ!

డబ్బున్నవారు బంగారం, ఆభరణాలతో పెండ్లికూతురుని అలంకరిస్తారు. బంగారాన్నే ఎందుకు ఎంచుకుంటారంటే. అవి చాలా విలువైనవి కాబట్టి.. ఇప్పుడు అంత కంటే విలువైనవి ఉల్లిగడ్డలంటున్నారు. అందుకే పెండ్లికూతురు అలంకరణ విషయంలో జడపట్టీ నుంచి పూర్తి వడ్డానం, కమ్మలు, మెడలో దండలు, కాళ్ల పట్టీల వరకు పూర్తి అలంకరణకు ఉల్లిగడ్డల్నే ఉపయోగించారు.

నవ్వు తెప్పించే వాస్తవాలు

ఉల్లిగడ్డలు సంచులకొద్దో.. క్వింటాళ్ల కొద్దో దొంగతనం చేస్తే మనం ఇక్కడ చెప్పుకోకపోయేవాళ్లం. కానీ ఇది మాత్రం కచ్చితంగా చెప్పుకొని తీరాల్సిందే. ఎందకంటే మనోడు ఇక్కడ చేసింది 'అద్దకిలో ఉల్లిగడ్డల' దొంగతనం. నిజంగా నవ్వుతెప్పించే యవ్వారమే.

పంజాబ్‌లోని కపూర్థలాలో వింతైన రీతిలో ఉల్లి దొంగతనం జరిగింది. అరకిలో ఉల్లిపాయలను చోరీ చేసిందనే ఆరోపణతో పోలీసులు ఓ మహిళను అరెస్టు చేశారు. పంజాబ్‌లోని గ్రేటర్ కైలాశ్ ప్రాంతంలో కిరణ్ అనే మహిళ ఉంటున్నది. రేఖ అనే మహిళ ఇంట్లో తరచూ వస్తువులు పోతున్నాయని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆధారాలు దొరకకపోవడంతో పోలీసులు ముందడుగు వేయలేదు. అయితే కిరణ్ ఎవరికీ తెలియకుండా ఇంట్లో ఓ సీసీ కెమెరా ఏర్పాటు చేసింది. అందులో పనిమనిషి రేఖ అరకిలో ఉల్లిపాయలు దొంగతనం చేస్తుండగా రికార్డయ్యింది. ఇదిప్పుడు చర్చనీయాంశం అవుతున్నది.

'ఉల్లి' కానుక

ఒకప్పుడు ఇంట్లో బంగారం ఉంటే ధనికులు అనేవారు. ఇప్పుడు ఉల్లిగడ్డలు ఉంటే ధనికులు అంటున్నారు. ఇటీవల వరంగల్ రూరల్ జిల్లా పరకాలలో జరిగిన పెండ్లిలో ఓ వింత బహుమతి అందర్నీ ఆకట్టుకున్నది. సాయి సందీప్ – శ్రీజల రిసెప్షన్‌కు వారి స్నేహితులు కొంచెం బరువుగా ఉన్న బహుమతిని ఇచ్చారు. రిసెప్షన్‌లోనే బహుమతి ఏంటో చూడాలని అక్కడివారంతా కోరారు. సరే అంటూ బరువుగా ఉన్న గిఫ్ట్‌ను మెల్లగా పట్టుకొని తెరిచి చూసే సరికి రెండు కిలోల ఉల్లిగడ్డలు ఉన్నాయి. ఇంతకంటే పెద్ద బహుమతి ఏముందంటూ అక్కడి వారంతా ఆనందం వ్యక్తం చేశారు.



'ఈ ఉల్లిధరల భారాన్ని బాహుబలి ఒక్కడే మోయగలడు' అంటూ కొందరు పోస్టులు పెడుతున్నారు. ఈనేపథ్యంలో శివలింగాన్ని ఎత్తుకున్న ప్రభాస్ ఫొటో నెట్టింట వైరల్ అవుతున్నది.

అక్కడా.. ఇక్కడా.. ఎక్కడైనా

రాత్రి పదకొండవుతున్నది.
వీధిలో భయపడుకుంటూ వెళ్తున్నాడో అబ్బాయి..
'హెల్ప్' అని గట్టిగా కేకేశాడు. ఎవరూ రాలేదు.
ఇంకో సారి ప్రయత్నించాడు.
ఈసారి అన్ని ఇండ్లలో లైట్లు వెలిగాయి
అందరూ భయటకు వచ్చారు.
అబ్బాయి హ్యాప్పీగా నడుచుకుంటూ వెళ్లాడు..
@ ఉల్లిగడ్డలు కిలో 30 అని అరిచాడాతను వీధిలో

అంత కట్నం ఎందుకంటా?..
ఇంతకీ అబ్బాయేం చేస్తాడు..?
'ఉల్లిగడ్డల వ్యాపారం'..
@ ఓ ఇంట్లో పెండ్లి చూపులు

. 'ఏరా! ఉద్యోగం
వదిలేస్తా అంటున్నావంటా?'
'అవున్రా! ఉల్లిగడ్డలు అమ్ముకోవడం
బెటర్ అనిపిస్తుంది'
@ చేపల మార్కెట్‌కు ఫ్రెండ్స్‌తో వచ్చిన
ఓ సాఫ్ట్ వేర్ ఉద్యోగి.

'ఏం రమణమ్మ.. అబ్బాయికేం పేరు పెట్టావ్'
'మొన్నటి వరకూ బంగారం అని పిలిచా.. ఇప్పుడు
ఉల్లిగడ్డ అని పెట్టా'
@ ఓ ఆడపడచు.

ఏటీఎం ఎదుట క్యూ..
వరుసను కాదని అందరినీ దాటుకుంటూ వెళ్తు
న్నాడు టిప్‌టాప్‌గా వచ్చిన వ్యక్తి.
అతన్ని అడ్డగించాడో వ్యక్తి..
'మేరా పాస్ కార్ హై, బంగ్లా హై.. తుమారా పాస్
క్యాహైరే?' గద్దిరించాడు ఆపినందుకు.
'రెండు బండ్ల నిండా ప్యాస్ హై!'..
జవాబిచ్చాడు వెనక్కి వెళ్లి నిల్చో అన్నట్టు.

ఒకప్పుడు ఇంట్లోని పాత కాగితాలు ఇస్తే ఉల్లిగడ్డలు
ఇచ్చేవారు..
ఇప్పుడు ఇంటి కాగితాలు ఇస్తే ఇస్తున్నారు.
@ ఫ్రెస్టేటెడ్ ఆనియన్ బయ్యర్.

'కేజీ ఉల్లిగడ్డలివ్వండి'
'హ.. రూ. 230 ఇవ్వండి'
'ఏంటి నిన్న 150నే అన్నారు'
'అది నిన్న'
@ రోజురోజుకూ పెరుగుతున్న ఉల్లి ధరలు..

'ఏంటి ఆనియన్ దోశలో ఆనియన్ లేదు'
'మైసూర్ బోండాలో మైసూర్ లేకున్నా
తింటావ్‌గా.. ఇదీ అంతే'
@ టిఫిన్ సెంటర్ ఓనర్

'నీ ఫ్రెండ్ అంత ధనవంతుడా'
'అవును'
'ఎంత ఆస్తి ఉంది'
'ఆనియన్ దోశ, ఆనియన్
చట్నీతో తినేంత'

ఒక వ్యక్తి ఆటో ఎక్కుతాడు. తను వెళ్లే ప్రదేశం చెప్పి ఛార్జీ మాట్లాడుకుంటాడు. ఆటో దిగే సమయంలో డబ్బులకు బదులు మూడు పెద్ద ఉల్లిగడ్డలు ఇస్తాడు. చిల్లర కింద ఆటో డ్రైవరు సైతం రెండు చిన్నవి ఇచ్చి తీసుకో అనడంతో ఆశ్చర్యపడటం ఇద్దరి వంతు అవుతుంది.

ఇంటి చిట్కాలు

- గాజు అద్దాలపై పడిన మరకలు పోవాలంటే మనం వాడే టూత్‌పేస్ట్ రాసి పేపర్‌తో కానీ గుడ్డతో కానీ తుడవాలి. ఇలా చేయడం వల్ల గాజు అద్దాలపై ఉన్న మరకలు పోతాయి.
- పుస్తకాలకు పురుగులు, చీడ పట్టకుండా ఉండాలంటే వాటి మధ్య చిన్న గంధపు ముక్క పెట్టాలి. లేదంటే అల్మారా అరల్లో గంధపు పొడి చల్లాలి. ఇలా చేసినందువల్ల పుస్తకాలకు పురుగులు చీడ పట్టకుండా ఉంటాయి.
- మీ ఇంట్లో స్విచ్‌లు, స్విచ్ బోర్డులపై నల్లబడిపోయి మరకలు ఉంటే కిరోసిన్‌లో ముంచిన గుడ్డతో తుడిస్తే మళ్లీ మెరుస్తాయి. లేదా టూత్ పేస్ట్ కొంచెం తీసుకొని గుడ్డతో తుడిస్తే నల్లబడిపోయిన స్విచ్‌బోర్డులు మెరుస్తాయ.
- బియ్యం పురుగులు పట్టకుండా ఉండాలంటే.. ఎండిన కాకరకాయల్ని ఓ పల్చని వస్త్రంలో మూటకట్టి, ఆ మూటని బియ్యం డబ్బాలో వేయాలి.
- ఇంట్లోకి ఈగలు, దోమలు రాకుండా ఉండాలంటే.. మనం ఇల్లు తుడిచేటప్పుడు నీళ్లలో కొద్దిగా ఉప్పు కలిపితే.. ఈగలు, దోమలు రాకుండా ఉంటాయి.
- బెండకాయ కూర జిగురుగా ఉండకూడదని అనుకుంటే అందులో టమాటా వేయకూడదు.

సరికొత్త పరిష్కారం

దేశవ్యాప్తంగా లక్షలాదిమంది చిన్నారులు డిస్లెక్సియా సమస్యతో బాధపడుతున్నారు. దీనివల్ల వారు చదువులో రాణించలేకపోతున్నారు. అటువంటి వారి కోసం వినూత్న పరిష్కారాలను అందిస్తున్నది ఓ పరిశోధకురాలు.

గుర్‌గ్రామ్‌కు చెందిన న్యూరో సైంటిస్ట్ నందిని ఛటర్జీ సింగ్ డిస్లెక్సియాతో బాధపడే చిన్నారులకు పరిష్కారాలందించేందుకు ముందుకొచ్చింది. రాయడం, చదవడంలో ఆసక్తి చూపించకపోవడాన్ని 'డిస్లెక్సియా 'అంటారు. చిన్నతనంలో ఈ సమస్యను గుర్తించి పరిష్కరించాలి. లేకపోతే చదువులో రాణించలేరు. ఇటువంటి సమస్యను ఎదుర్కొనే వారికి సులువైన పరిష్కారాలు అందించాలనుకున్నది నందిని. డిస్లెక్సియా ఉన్న వారిని గుర్తించాలంటే పలురకాల పరీక్షలు చేయాల్సి ఉంటుంది. అటువంటి పరీక్షలకు పెద్ద మొత్తంలో ఖర్చవుతుంది. అందుకోసం ప్రత్యేకంగా కొన్ని డిస్లెక్సియా పాఠశాలలు వెలిశాయి. వీటిల్లో సంపన్నవర్గాలకు చెందిన వారు మాత్రమే ఫీజులు భరించగలుగుతారు. ఇదే సమస్య ఎదుర్కొంటున్న గ్రామీణ ప్రాంతాలకు చెందిన చిన్నారులకు పరిస్థితి ఏంటి? అనుకున్నది. అటువంటి వారి కోసం ఏదైనా చేయాలనుకున్నది. అందుకోసం ప్రత్యేకంగా ప్రయోగశాలను ఏర్పాటు చేసింది. అందులో పలురకాల పరిశోధనలు చేసి డిస్లెక్సియాను గుర్తించే పద్ధతిని కనుగొన్నది. గుర్‌గ్రామ్ నేషనల్ బ్రెయిన్ రీసెర్చ్ సెంటర్‌తోపాటు భారతప్రభుత్వ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగంతో కలిసి డిస్లెక్సియా అసెస్‌మెంట్ ఫర్ లాంగ్వేజెస్ ఆఫ్ ఇండియా(డాలి) అనే సాధనాన్ని ప్రవేశపెట్టింది. నందిని ఛటర్జీ చేసిన పరిశోధనల ఆధారంగా డిస్లెక్సియాను గుర్తించేలా ఓ బుక్‌లెట్‌ను రూపొందించింది. కొన్నాళ్ల తర్వాత మరాఠీ, కన్నడ, తమిళం వంటి ప్రాంతీయ భాషల్లో 'డాలి' అనే యాప్‌ను ఆవిష్కరించింది. దీనిని ఉపయోగించి డిస్లెక్సియా ఎదుర్కొనే వారిని సులువుగా గుర్తించగలుగుతున్నారు. 'దేశవ్యాప్తంగా 80 శాతం మంది విద్యార్థులు డిస్లెక్సియా కారణంగా చదువులో వెనుకబడుతున్నారు.' అటువంటి వారిని చిన్నతనంలోనే గుర్తిస్తే సమస్యను సులువుగా పరిష్కరించవచ్చని నందిని ఛటర్జీ చెబుతున్నది.

చలికాలం. వెచ్చవెచ్చగా వేడినీటి స్నానం చేద్దామని కోరుకోని వారుండరు. చాలామంది మరిగే నీళ్లను ఒంటిమీద పోసుకొని హ్యాపీగా ఫీలవుతుంటారు. కానీ ఇది ఎంతవరకు మంచిదని ఏ ఒక్కరూ ఆలోచించరు.

వేడినీటి స్నానం మంచిదేనా?

- వేడి నీటికంటే చల్లటి నీటితోనే స్నానం చేయడం మంచిదంటున్నారు నిపుణులు. వేడి నీటితో స్నానం చేస్తే బాడీ మొత్తం రిలాక్స్ అవుతుంటుంది. దీనివల్ల నిద్ర వచ్చినట్లు మత్తుగా ఉంటుంది. దీంతో రోజంతా అలసటగా ఉంటుంది.
- చల్లటి నీటితో స్నానం చేస్తే ముఖంపై చిన్న చిన్న రంధ్రాలు కూడా తగ్గిపోతాయని చెబుతున్నారు నిపుణులు. ఈ కారణంగా చాలామంది ఉదయాన్నే మాస్క్ వేసుకుంటారు. ఐస్ మాస్క్ అంటే ఓ బౌల్‌లో చల్లని నీటిని తీసుకొని అందులో ఐస్ క్యూబ్స్ వేసి ముఖం కాసేపు ఆ బౌల్‌లో ఉంచడం. దీనివల్ల ముఖంపై రంధ్రాలు తగ్గడమే కాకుండా ముఖం తాజాగా మారుతుంది. అందంగా కనిపిస్తారు.
- స్నానానికి వేడి నీటిని ఉపయోగించడం సాయంత్రం వేళ మంచిది. దీని వల్ల బాడీ రిలాక్స్ అవుతుంది. హాయిగా నిద్రపడుతుంది. అలసిన కండరాలు కూడా బాగా రిలాక్స్ అవుతాయి. అయితే బాగా మరిగిన నీటితో స్నానం చేయకుండా గోరు వెచ్చని నీటితో స్నానం చేయడం మంచిది.
- మైగ్రేన్ వంటి సమస్యలతో బాధపడే వారు చన్నీటితో స్నానం చేస్తే సమస్య ఇంకా ఎక్కువవుతుంది. తలనొప్పి, తలపట్టేసినట్లు ఉండడం వల్ల ఎక్కువ అవుతాయి. కాబట్టి మైగ్రేన్ సమస్యతో బాధపడుతున్నవారు ఉదయం గోరు వెచ్చని నీటితో స్నానం చేయడం మంచిది.

నమస్తే తెలంగాణ
యువ
[కరీంనగర్]
బుధవారం 11 డిసెంబర్ 2019

మంచిమాట

గమ్యం స్థిరంగా ఉండాలి. మార్గం కచ్చితంగా నిర్ణయించుకోవాలి. ప్రయత్నంలో రాజీ ఉండకూడదు. అప్పుడే విజయం మనదవుతుంది.

- రామకృష్ణ పరమహంస

వాట్సప్ మెసేజ్

ఒంటరిగా ఉన్న నా జీవితంలోకి వచ్చావు. నాకేం కావాలన్నా ఇచ్చావు. నాకు బోర్ కొడితే నా చిరునవ్వువు నువ్వయ్యావు. ఎవరూ లేని సమయంలో నాకు తోడుగా ఉన్నావు. కోపంలో నిన్ను కొడితే తట్టుకున్నావు. నిన్ను నావాళ్లు తిడుతున్నా మౌనంగా ఉన్నావు. ఇన్ని చేసిన నీకు ఏమిచ్చి రుణం తీర్చుకోవాలి. కొంచెం చార్జింగ్ పెట్టి రీచార్జ్ చేయడం తప్ప ఐలవ్ యూ మొబైల్..

ఏం డైలాగ్ గురూ..

రేషన్ కార్డుకు లంచం. పిల్లలను స్కూల్లో చేర్చడానికి లంచం. రైతుకు రుణం కావాలంటే లంచం. పుట్టిన ప్పటి నుంచి చచ్చేంత వరకు.. ప్రసూతి ఘట్టం నుంచి శ్మశానం వరకు లంచం.. లంచం.. లంచం.. జాతీయ సమైక్యతా భావం ఈ దేశంలో లంచంలో మాత్రమేరా ఉంది.

సినిమా: భారతీయుడు

నవ్వుకొందాం

భర్త: మన నలభై ఏండ్ల కాపురంలో ఇవాళ కాఫీ చాలా బాగా చేశావు డియర్..
భార్య: అయ్యో నా మతి మండ! నా కాఫీ గ్లాసు మీకిచ్చినట్లున్నాను!

కొత్త ప్రపంచం!

పెయింటింగ్.. పేరు వినగానే క్యాన్వాస్ పేపర్, కుంచె పట్టుకొని తయారైపోతాం. వీటిమీద తప్ప మరి వేటి మీద పెయింటింగ్ వేద్దామన్న ఆలోచన రాదు. ఎందుకంటే వాటిపై రంగులు అంటుకోవు కాబట్టి. క్యాన్వాస్‌కే పరిమితమైన రంగులకు భిన్నంగా దేశంలోనే తొలి ఆల్కహాలిక్ కలర్స్ తయారీ సంస్థకు శ్రీకారం చుట్టారు యువతీ యువకులు. ఈ రంగులు అన్నిరంగులకంటే త్వరగా ఆరిపోతాయి. అంతేకాకుండా వీరిరువురు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు కావడం మరో విశేషం.

ఆల్కహాలిక్ రంగులు

చేస్తున్నది సాఫ్ట్‌వేర్ ఉద్యోగం. ఉదయం నిద్రలేవగానే కోడింగ్ ఎలా రాయాలనే ఆలోచన. తీరా ఆఫీసుకు వెళ్లాక అవుట్‌పుట్ రాకుంటే బాస్‌తో తిట్లు. ఇంటికొచ్చాక అయినా ప్రశాంతంగా ఉంటామని చెప్పలేం. ఆ పని ఈ పనంటూ తలప్రాణం తీసేస్తారు. వీటన్నింటి నుంచి విముక్తి పొందేందుకు నచ్చిన కళతో కాస్త కుస్తీపడితే చాలు అలసట మొత్తం మాయం అవుతుంది. ఆ కళే పెయింటింగ్. రంగులు తీసుకొని క్యాన్వాస్ పేపర్‌పై నచ్చిన చిత్రాన్ని చిత్రీకరించడం. అలా రోజూ చేసే పనిలో కూడా కొత్తదనం వెతికారు. పెయింటింగ్ అంటే క్యాన్వాస్‌పైనే వేయాలా? టేబుల్, ఫోన్, బాటిల్, బ్యాగ్.. ఇలా మన దగ్గరున్న వాటిపై పెయింటింగ్ వేయలేమా అనుకున్నారు హైదరాబాద్‌కు చెందిన హరీశ్, గాయత్రి గుప్తా.

పెయింటింగ్ విషయంలో మరింత ముందుకు వెళ్లారు వీరు. పేపర్లపై చిత్రాలు గీయడం అందరికీ తెలిసిందే. ఇతర ఏ వస్తువుపై వేయాలన్నా కుదిరేది కాదు. అలాగే యూపోషీట్స్ (సింథటిక్)పై కొంత శోధించినప్పుడు ఎటువంటి సర్ఫేస్‌పై అయినా ఉపయోగించే 'ఆల్కహాలింక్స్' పేరుతో ప్రపంచవ్యాప్తంగా అప్పటికే అందుబాటులో ఉన్న రంగులు వీరిని ఆకర్షించాయి. అయితే ఇవి విదేశాలకే పరిమితం అన్నట్లు ఉండేది. హరీశ్ అన్నయ్యకు యూపోషీట్స్ పేపర్లు తయారు చేసే బిజినెస్ ఉన్నది. ఆ పేపర్‌తో ఉపయోగాలు ఏమున్నాయని పరిశోధన చేశారు. అప్పుడు పెయింటింగ్ వేయొచ్చని తెలిసింది. అది ఇతర దేశాల్లోనే చేసేవారు. అలా ఆల్కహాలిక్ కలర్స్ గురించి తెలుసుకున్నారు. అవి ఇక్కడెక్కడా లేవు. అదే సమయంలో గాయత్రి యూఎస్‌లో ఉన్నది. రంగుల తయారీ గురించి తెలుసుకున్నది. హైదరాబాద్‌లో యూపోషీట్స్ అందుబాటులో ఉన్నాయి. రంగులు తయారు చేసేందుకు చాలామందిని కలిసి ఫార్ములా తెలుసుకున్నారు. ఎలాంటి ఫిగ్మెంట్ వాడాలి వంటివన్నీ తెలుసుకొని కెమికల్ ఇంజినీర్స్‌తో కాంట్రాక్ట్ తీసుకున్నారు. ఆరునెలల పరిశోధన తర్వాత మార్చిలో 'బియాండ్ ఇంక్స్' పేరుతో ఆల్కహాలిక్ రంగుల తయారీ మొదలుపెట్టారు. అప్పటి నుంచి ఇప్పటివరకు 15 రకాల రంగులను తయారు చేశారు. బియాండ్ ఇంక్స్‌లో నలుగురు ఎంప్లాయ్స్ ఉంటారు. ఇంక్స్ బాటిల్‌లో నింపడం. వాటికి సీలింగ్, లేబుల్స్ అంటించడం ఇలా అన్ని పనులూ ఎంప్లాయిస్ చూసుకుంటారు.

ఆన్‌లైన్ సదుపాయం

'బియాండ్ ఇంక్స్ డాట్ ఇన్' వెబ్‌సైట్లో, అమెజాన్‌లో ఆల్కహాలిక్ రంగులు అందుబాటులో ఉన్నాయి. ఇదే కాకుండా చెన్నైలోని హెచ్‌టీసీ, రిలయన్స్, హిమాలయా అన్నింటినీ సప్లై చేస్తారు. 25కు పైగా ఆర్ట్‌స్టోర్స్‌కు కూడా సరఫరా చేస్తారు. బ్లెండింగ్ సొల్యూషన్. ఆల్కహాలిక్ కలర్స్‌పై నీటి బిందువులుగా వేయడానికి ఉపయోగపడుతుంది. అలానే రంగులను తొలిగించేందుకు కూడా దీన్ని ఉపయోగిస్తారు.

తయారీ..

ఇథనాల్, రెజెంట్ పాలిమర్స్, ఫిగ్మెంట్స్, డై. ఫిగ్మంట్ అనేది కలర్ పౌడర్‌లాగ. ప్రతిరంగుకు సాల్వెన్సీ ఉంటుంది. సాల్వెంట్‌లో ఫిగ్మెంట్ ఎంతఅవుతుందో నోట్ చేసుకుంటారు. దాన్నిబట్టి అన్ని షేడ్స్ ఎలా వస్తాయో చూసుకుంటారు. అలా ఏ రంగు ఇంక్ తయారు చేయాలో దాని ఫార్ములా చూసుకుంటారు. వీటిలో ఏది ఎక్కువైనా రంగుమారే అవకాశం ఉంది. చాలాజాగ్రత్తగా చూసుకోవాలి. ఇథనాల్ అంటే ఆల్కహాల్. ఈ పేరు చెబితేనే ఎవరైనా గుర్తుపడతారు. అందుకే దీనికి ఆపేరు పెట్టారు. ఇంత ప్రాసెస్ కెమికల్ ఇంజినీర్ల దగ్గర, ఆన్‌లైన్‌లో చూసి నేర్చుకున్నారు హరీశ్, గాయత్రి గుప్తా. ఈ రంగులు చాలా తొందరగా ఆరిపోతాయి. వీటిని బౌల్‌లో వేసుకొని పెయింట్ చేసుకోవచ్చు. గట్టిపడితే బ్లెండింగ్ సొల్యూషన్ కలుపుకోవచ్చు. చర్మానికి అంటుకుంటే పోవడానికి కనీసం ఐదు రోజులు పడుతుంది. కాబట్టి జాగ్రత్తగా వేసుకోవాలి.

ప్రతీనెల వర్క్‌షాప్

ఆల్కహాలిక్ రంగుల గురించి చాలామందికి తెలియదు. వాటిని నేటి తరానికి పరిచయం చేసేందుకు ప్రతి నెలా వర్క్‌షాపులు నిర్వహిస్తున్నారు. మార్చి నుంచి వర్క్‌షాపులు పెడుతున్నారు. హైదరాబాద్‌లో ఎక్కడైతే జనసమూహం ఎక్కువగా ఉంటుందో ఆ ప్రదేశాన్ని ఎంచుకుంటారు. హైటెక్‌సిటీ, బంజారాహిల్స్‌లాంటి ప్రదేశాలు. వర్క్‌షాపుకు అయ్యే ఖర్చుబట్టి ఫీజు నిర్ణయిస్తారు. దాదాపు 500 నుంచి 2000 వరకు ఉంటుంది. హైదరాబాద్‌లోనే కాకుండా దేశంలోని అన్ని నగరాల్లోని ఆర్టిస్ట్‌లతో టైఅప్ అయి అక్కడ కూడా వర్క్‌షాపులు నిర్వహిస్తున్నారు. పేపర్, ఇంక్స్ వారే సరఫరా చేస్తారు. అలా ఇప్పటివరకు 140కి పైగా నిర్వహించారు. వచ్చేనెల జనవరిలో వర్క్‌షాప్ ఉంటుంది. ఉదయం 10 గంటల నుంచి 1 వరకు ఉంటుంది. మధ్యాహ్నభోజనం కూడా అందిస్తారు. అన్నింటికీ కలిపి ఫీజు ఉంటుంది.

అభిరుచినే వృత్తిగా..

నేను హరీశ్ ఒకే ఆఫీసులో పనిచేస్తున్నాం. ఇద్దరికీ పెయింటింగ్ అంటే ఇష్టం. ఆ అభిరుచే మా ఇద్దరితో బియాండ్ ఇంక్స్‌కు శ్రీకారం చుట్టేలా చేసింది. ఎక్కడ చూసినా భిన్నమైన ఆర్ట్స్ కనిపిస్తూనే ఉన్నాయి. అదే టైంలో నేను యూఎస్‌లో ఉన్నాను. ఆల్కహాలిక్ రంగులు నన్ను ఆకర్షించాయి. ఇక్కడ వాటి జాడే తెలియదు. హరీశ్‌వాళ్ల అన్నయ్యకు పేపర్ బిజినెస్ ఉంది. ఇద్దరం మాట్లాడుకొని స్టార్ట్ చేశాం. ఆఫీస్ పనిని 'వర్క్ వర్క్ ఫ్రమ్ హోమ్' చేస్తారు. తల్లిదండ్రులూ ప్రోత్సహిస్తున్నారు.

– గాయత్రి గుప్తా

నాన్నకు మహాఎలక్ట్రానిక్స్ కంపెనీ ఉంది. అమ్మ గృహిణి. చిన్నప్పుడు ఆర్ట్ వేసే వాడిని. మరలా ఇప్పుడు వేస్తున్నాను. నాన్న ఆఫీసునే బియాండ్ ఇంక్స్‌గా ఉపయోగిస్తున్నాం. ఇక్కడ ఒక రూంని ల్యాబ్‌గా వాడుకుంటున్నాం. ఒక కలర్ రూ. 199. మూడు కలిపి రూ. 499. మొత్తం 15 రంగులు కలిపి రూ. 2,495 ఉంటుంది. పూర్తి వివరాల కోసం https://www.facebook.com/beyondinks.in/ సంప్రదించండి.

– హరీశ్

...సరస్వతి వనజ
గడసంతల శ్రీనివాస్

టెక్నాలెడ్జీ

వివో నుంచి వీ17

రష్యా మొబైల్ బ్రాండ్ వివో కొత్త ఫోన్‌ను భారత మార్కెట్‌లోకి విడుదల చేసింది. వివో 17 పేరుతో, మంచి ఫీచర్లతో ఆకట్టుకుంటుంది. మల్టీ టర్బో మోడ్ వాయిస్ చేంజ, ఏఆర్ స్టిక్కర్ ఫీచర్లు ప్రధానంగా ఆకర్షిస్తున్నాయి. డిసెంబర్ 17నుంచి ఈ ఫోన్ అమ్మకాలు ప్రారంభం అవుతాయి.

డిస్‌ప్లే: 6.44అంగుళాలు
రిసొల్యూషన్: 1080x2400 పిక్సెల్
ప్రాసెసర్: క్వాల్కమ్ స్నాప్‌డ్రాగన్ 675
మెమొరీ: 8జీబీ ర్యామ్
స్టోరేజీ: 128జీబీ
ఫ్రంట్ కెమెరా: 32 మెగాపిక్సెల్స్
బ్యాక్ కెమెరా: 48+8+2+2 మెగాపిక్సెల్స్
బ్యాటరీ: 4500ఎంఏహెచ్

హువావే స్మార్ట్‌వాచ్

చైనా స్మార్ట్‌ఫోన్ కంపెనీ నుంచి ఓ స్మార్ట్ వాచ్ విడుదలైంది. 'జీటీ 2' స్మార్ట్ వాచ్ పేరుతో ఇది అందుబాటులో ఉంది. జీటీ 2 వాచ్ రెండు వేరియేషన్లలో ఆకట్టుకుంటున్నది. ఫ్లిప్‌కార్ట్, అమెజాన్, ఇతర రిటైల్ స్టోర్‌ల లోనూ ఇది విక్రయానికి ఉంది.

స్మార్ట్‌వాచ్ ఫీచర్లు

1.2 అంగుళాల అమోలెడ్ టచ్ డిస్‌ప్లే, రౌండ్ డయల్, హువావే కిరిన్ ఎ1 చిప్, 3డీ గ్లాస్, బ్లూటూత్ 5.1 వాటర్ రెసిస్టెన్స్, జీపీఎస్, ఇంటిగ్రేటెడ్ మైక్రోఫోన్ అండ్ స్పీకర్, బ్లూటూత్ కాలింగ్, ఆప్టికల్ హార్ట్ రేట్ సెన్సార్, 15 వర్కవుట్ మోడ్స్, ధర– 46 ఎంఎం స్పోర్ట్ (నలుపు) రూ.15,990, లెదర్ స్ట్రాప్ మోడల్ రూ.17,990, మెటల్ స్ట్రాప్ రూ.21,990. 42 ఎంఎం వేరియంట్ ప్రారంభ ధర రూ. 14,990. అంతేకాదు ఈ స్మార్ట్‌వాచ్ వినియోగదారుని హార్ట్ బీట్‌ను మానిటర్ చేస్తుందని, స్పందన రేటు 100 బీపీఎం కంటే ఎక్కువ లేదా 50 బీపీఎం కంటే తక్కువ 10 నిమిషాలకు మించి ఉంటే యూజర్‌ను అలర్ట్ చేస్తుందని, స్విమ్మింగ్ చేస్తున్నపుడు కూడా ఈ వాచ్ పనిచేస్తుందని కంపెనీ వెల్లడించింది.

మరింత సన్నని ఐప్యాడ్లు

ఆపిల్ సంస్థ నుంచి వచ్చే ఐప్యాడ్‌లు ఇక నుంచి మరింత సన్నగా ఉంటాయని ఆ కంపెనీ విశ్లేషకులు అంటున్నారు. ఇప్పటి వరకూ ఏ ఐప్యాడ్ లేనంత సన్నగా మ్యాక్‌బుక్ మోడళ్లను తెస్తామని వారు చెప్తున్నారు. ఐప్యాడ్ మ్యాక్‌బుక్ ప్రోలలో ఆరు సన్నటి మోడళ్లు 2020 సంవత్సరానికి మార్కెట్‌లోకి వస్తాయని వెల్లడించారు. 0.29 అంగుళాల సన్నటి మ్యాక్‌బుక్ మోడళ్లలో ఓఎల్ఈడీ లైట్లను ఉపయోగించగా, సన్నటి మోడళ్లలో స్క్రీన్ డిస్ ప్లే కోసం చిన్న ఎల్ఈడీ లైట్లను, సన్నటి పిక్చల్స్‌ను ఉపయోగించబోతున్నట్టు వారు తెలిపారు. ఈ ఆరు సన్నటి మోడళ్లను రానున్న ఏడాదిలో ఎప్పుడైనా విడుదల చేయొచ్చని చెప్పారు. కాగా, ఈ సన్నటి మ్యాక్ బుక్ సైజ్ 16 అంగుళాలు ఉంటుందని టెక్‌రిపోర్టులు అంచనా వేస్తున్నాయి.

ప్రేమికులను కలిపే యాప్

భారత్‌లో 90 శాతం పెండ్లిళ్లు పెద్దలు నిశ్చయించినవే. ముఖ పరిచయం లేకపోయినా, ఆస్తులు, అంతస్తులు, బంధుత్వాలు చూసి చేసేవే. అరేంజ్ మ్యారేజెస్ చేయడానికి పెద్దలు, మధ్యవర్తులే ప్రముఖ పాత్ర వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఓ యాప్ ప్రేమ వివాహాల్ని ప్రోత్సహిస్తున్నది. కేవలం ప్రేమికుల్ని కలిపేందుకే ఇది రూపొందించింది.

శాన్‌ఫ్రాన్సిస్కో కేంద్రంగా ఏర్పాటయిన 'దిల్‌మిల్' యాప్ దక్షిణాసియా దేశాల్లో యమ స్పీడ్‌గా దూసుకెళ్తున్నది. అమెరికా, కెనడా, బ్రిటన్ దేశాల్లో కోట్ల మంది ఈ యాప్‌కు యూజర్లున్నారు. ఇప్పటికే ఈ యాప్ ద్వారా రెండు కోట్లకు పైగా పెండ్లిళ్లు జరిగాయట.! రోజుకు కనీసం ఒక్క పెండ్లి చేయడానికి 'దిల్‌మిల్' టీం కృషి చేస్తుందట. అమెరికా, కెనడాలతో పాటు బ్రిటన్, యూరప్ దేశాల్లో నివసిస్తున్న దక్షిణాసియా దేశాలకు చెందిన యువత ఈ యాప్‌ను ఎక్కువగా వినియోగిస్తున్నారు. 2040 వరకు ప్రతి పది మందిలో ఏడుగురు దీని ద్వారా కలుసుకుంటారని ఈ యాప్ వ్యవస్థాపకులు చెబుతున్నారు. అయితే ఈ యాప్ సేవలు త్వరలో భారత్‌లో విస్తరించనున్నట్లు దిల్‌మిల్ సీఈవో కేజే దలివాల్ ఓ ట్వీట్‌లో పేర్కొన్నారు. 'ప్రేమ పెండ్లిళ్లు పెరుగడమే మా లక్ష్యం. ప్రేమమయ ప్రపంచంగా మార్చేందుకు ఈ యాప్ తోడ్పడుతుంది. ప్రేమ వివాహాల ద్వారా కులం అంతరించిపోతుంది' అని ఆయన పేర్కొన్నారు.

సిగరెట్ మానండి.. ఆఫర్ పట్టండి!

'పొగ తాగడం ఆరోగ్యానికి హానికరం. ధూమపానానికి ఎంతోమంది బలైపోతున్నారు'. అయితే కొన్ని ప్రభుత్వాలు కూడా 'స్మోకింగ్ ఈజ్ ఇంజ్యూరియస్ టూ హెల్త్' అని ప్రకటనలకు మాత్రమే పరిమితమవుతున్నాయి. కానీ జపాన్‌లో ఓ కంపెనీ మాత్రం వినూత్నంగా ఉద్యోగులకు ఆఫర్ ప్రకటించింది.

టోక్యోకు చెందిన మార్కెటింగ్ సంస్థ పియాలా ఐఎన్‌సీ కార్యాలయం బిల్డింగ్‌లోని 29వ ఫ్లోర్‌లో ఉంటుంది. అక్కడి నుంచి ఉద్యోగులు కిందికి వచ్చి పొగ తాగుతారు. అలా కిందికి వెళ్లిన ప్రతిసారీ కనీసం 15 నిమిషాలు పడుతుంది. దీంతో సిగరెట్ తాగని ఓ ఉద్యోగి స్మోకింగ్ చేసేందుకు వెళ్తున్న వారి వల్ల సమయం వృథా అవుతుందని భావించాడు. మిగతా ఉద్యోగులపై పనిభారం పడుతున్నదని లెటర్‌పై రాసి కంప్లైంట్ బాక్స్‌లో వేశాడు. దీన్ని చూసిన సీఈవో స్మోకింగ్ చేయని వారికి 6 అదనపు సెలవులు ఇస్తామని ప్రకటించాడు. వెంటనే ఈ ఆలోచనను అమల్లోకి తీసుకొచ్చారు. ఈ ఏడాది సెప్టెంబర్‌లో ఈ విధానం అమల్లోకి వచ్చింది. ఇప్పటికే కొంతమంది ఈ ఆఫర్‌ను ఉపయోగించుకుంటున్నారు. మరోవైపు ఉద్యోగులు టైమ్‌వేస్ట్ అవకుండా సంస్థను డెవలప్ చేయడానికి ఎక్కువ సమయం కేటాయిస్తున్నారు. ఈ విధానాన్ని టోక్యోలో మరికొన్ని కంపెనీలూ అవలంబిస్తున్నాయి.

రాత్రివేళల్లో సురక్షిత ప్రయాణానికి!

ట్రాఫిక్‌ను గుర్తించి సులభతర మార్గాన్ని చూపించే 'గూగుల్ మ్యాప్' ఇప్పుడు ఇంకో అద్భుత ఫీచర్‌ను జోడించబోతున్నది. రాత్రి వేళ వీధుల్లో నడుచుకుంటూ వెళ్లే వాళ్లకు ఇది ఉపయోగపడుతుంది. ఇప్పుడున్న ఫీచర్లకు జోడీగా 'లైటింగ్' అనే ఫీచర్‌ను చేరుస్తున్నది. రాత్రి సమయంలో ఏ వీధిలో దీపాలు వెలుగుతున్నాయో, ఎక్కడ వెలగడం లేదో గుర్తిస్తుంది. వీటిని మ్యాప్‌లో 'పసుపు'రంగు గీతగా చూపిస్తుంది. తక్కువ వెలుతురు ఉన్నా, అసలు వెలుతురూ లేకపోయినా ఆ వీధిని గుర్తిస్తుంది. దీని ద్వారా మీరు వెళ్లాల్సిన వీధిలో వీధి దీపాలు వెలుగుతున్నాయో లేదో ముందే తెలుసుకొని సురక్షితంగా వెళ్లే అవకాశాలు కొంతవరకు ఉన్నాయి.

నిపుణ — విద్య ఉద్యోగ సమాచారం

సోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్) కాంట్రాక్టు ప్రాతిపదికన కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది.

ఇండోర్ ఐఐఎంలో

ఇండోర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం) కింది ప్రోగ్రాముల్లో ప్రవేశాలకు ప్రకటన విడుదల చేసింది.

- **ప్రోగ్రామ్:** ఫెలో ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్
- **ఫెలోషిప్‌ల సంఖ్య:** 30
- **అర్హతలు:** సంబంధిత సబ్జెక్టుల్లో డిగ్రీ, మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణత, తత్సమాన అర్హతలు.
- **విభాగాలు:** కమ్యూనికేషన్, ఎకనామిక్స్, ఫైనాన్స్ అండ్ అకౌంటింగ్ తదితరాలు ఉన్నాయి.
- **ఎంపిక విధానం:** షార్ట్‌లిస్టింగ్, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** 2020, జనవరి 20
- **వెబ్‌సైట్:** https://www.iimidr.ac.in

సాయ్‌లో యంగ్ ప్రొఫెషనల్స్

- **పోస్టులు:** యంగ్ ప్రొఫెషనల్
- **మొత్తం ఖాళీలు:** 130
- **అర్హతలు:** కనీసం 50 శాతం మార్కులతో పీజీ లేదా డిగ్రీ రెండేండ్ల అనుభవం ఉండాలి.
- **కాలపరిమితి:** ఈ పోస్టులను మొదట రెండేండ్ల కాలవ్యవధికి తీసుకుంటారు. తర్వాత మరో రెండేండ్లు పొడగించే అవకాశం ఉంది.
- **వయస్సు:** 32 ఏండ్లు మించరాదు.
- **జీతం:** నెలకు రూ.40,000/–
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **ఎంపిక విధానం:** షార్ట్‌లిస్టింగ్, ఇంటర్వ్యూ ద్వారా
- **చివరితేదీ:** డిసెంబర్ 20
- **వెబ్‌సైట్:** https://sportsauthorityofindia.gov.in

ఏయూడీలో ఎంబీఏ ప్రవేశాలు

న్యూ ఢిల్లీలోని బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ ఢిల్లీ (ఏయూడీ)లో 2020-22 విద్యాసంవత్సరానికి ఎంబీఏలో ప్రవేశానికి విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

- **మొత్తం సీట్లు:** 46
- **ఎంపిక విధానం:** క్యాట్–2019 స్కోర్ లేదా ఏయూడీ ఎంబీఏ ఎంట్రెన్స్ టెస్ట్ (ఏజీఏటీ–2020), ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** డిసెంబర్ 31
- **ప్రవేశపరీక్ష:** ఫిబ్రవరి 23
- **వెబ్‌సైట్:** https://aud.ac.in

ఐఎస్ఐలో పీజీ డిప్లొమాలు

కోల్‌కతాలోని ఐఐఎం, ఐఎస్ఐ, ఐఐటీ ఖరగ్‌పూర్ సంయుక్తంగా నిర్వహించే పీజీ డిప్లొమా ఇన్ బిజినెస్ అనలిటిక్స్ (పీజీడీబీఏ) కోర్సులో ప్రవేశాలకు ప్రకటన విడుదలైంది.

- **కోర్సు:** పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ బిజినెస్ అనలిటిక్స్.
- **అర్హతలు:** డిగ్రీ, సంబంధిత విభాగాల్లో పీజీ ఉత్తీర్ణత.
- **ఎంపిక విధానం:** ప్రవేశ పరీక్ష, వ్యక్తిగత ఇంటర్వ్యూ, అకడమిక్ మెరిట్, అనుభవం ఆధారంగా.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.2000/–,
- **చివరితేదీ:** 2020, జనవరి 6
- **ప్రవేశ పరీక్ష:** 2020, ఫిబ్రవరి 16
- **వెబ్‌సైట్:** https://www.isical.ac.in

అత్యంత సీనియర్ సుప్రీంకోర్టు మహిళా లాయర్ కన్నుమూత

- 'పిలి' వ్యాజ్యాలకు పేరొందిన లిల్లీ థామస్

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టులో అత్యంత సీనియర్ మహిళా న్యాయవాది లిల్లీ థామస్ (91) కన్నుమూశారు. మంగళవారం ఉదయం ఢిల్లీలోని ఓ దవాఖానలో చికిత్సపొందుతూ తుదిశ్వాస విడిచారు. కేరళలోని కొట్టాయంలో జన్మించిన లిల్లీ.. తిరువనంతపురంలో పెరిగారు. ఆ తర్వాత వారి కుటుంబం చెన్నైకి వచ్చింది. 1955లో ఆమె మద్రాస్ హైకోర్టు బార్ కౌన్సిల్‌లో పేరు నమోదు చేసుకున్నారు. రెండేండ్ల తర్వాత మద్రాస్ విశ్వవిద్యాలయంలో ఎల్ఎల్ఎం కోర్సులో చేరారు. ఈ కోర్సులో పట్టా పొందిన తొలి మహిళ కూడా లిల్లీ థామసే. అనంతరం సుప్రీంకోర్టు న్యాయవాదిగా పనిచేశారు. ఆ సమయంలో నలుగురు మహిళలు న్యాయవాద వృత్తిలో ఉండగా, వారిలో లిల్లీ థామస్ ఒకరు. సుప్రీంకోర్టులో ఎన్నో ప్రజాప్రయోజన వ్యాజ్యాలను దాఖలుచేసి ఆమె పేరుతెచ్చుకున్నారు. దోషులుగా తేలిన ప్రజాప్రతినిధులు తమపై కేసులను న్యాయస్థానంలో వాదించుకోవడానికి అనువుగా ఉన్న ప్రజా ప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 8(4)ను రద్దు చేయాలని వ్యాజ్యం దాఖలు చేసి అందరి దృష్టిని ఆకర్షించారు. ఆ వ్యాజ్యంతో దోషులుగా తేలిన ప్రజాప్రతినిధులపై కనీసం రెండేండ్ల అనర్హత వేటును వేస్తూ న్యాయస్థానం తీర్పునిచ్చింది. లిల్లీ థామస్ మృతికి న్యాయవాదులు సంతాపం ప్రకటించారు.

పర్యావరణ జాతరకు సహకరించాలి



కలెక్టర్ నారాయణరెడ్డి

- మేడారం వచ్చే భక్తులు బట్టసంచులు తెచ్చుకోవాలి
- ములుగు జిల్లా కలెక్టర్ సీహెచ్ నారాయణరెడ్డి పిలుపు

ములుగు జిల్లాప్రతినిధి/నమస్తేతెలంగాణ: వచ్చే ఏడాది ఫిబ్రవరి 5, 6, 7, 8 తేదీల్లో నిర్వహించనున్న మేడారం జాతరను పర్యావరణానికి హాని కలుగకుండా ప్లాస్టిక్ రహితంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టామని ములుగు జిల్లా కలెక్టర్ చింతకుంట నారాయణరెడ్డి చెప్పారు. జాతరకు హాజరయ్యే భక్తులు బట్ట సంచులను వెంట తెచ్చుకోవాలని సూచించారు. ప్లాస్టిక్ ఫ్రీ మేడారం జాతర కార్యక్రమంలో భాగంగా ఆయన మంగళవారం జిల్లాస్థాయి అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జనవరి 1 నుంచి సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలని ఆదేశించారు. ఈ నిబంధనను ఉల్లంఘిస్తే రూ.ఐదువేల వరకు జరిమానా విధించాలని అధికారులకు సూచించారు. ప్లాస్టిక్ బ్యాగులకు బదులు ప్రతి ఒక్కరూ జూట్, బట్ట, పేపర్ బ్యాగులను వాడాలని కోరారు. హోటళ్లు, ఫంక్షన్ హాళ్లు, మటన్, చికెన్, కిరాణ, అన్ని వాణిజ్య సముదాయాలతోపాటు ప్రభుత్వ కార్యాలయాల్లో సైతం ప్లాస్టిక్ కనిపించకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్లాస్టిక్ ప్రత్యామ్నాయ వస్తువులను కచ్చితంగా వాడాలని కోరారు. మేడారం జాతరలో ప్లాస్టిక్ సేకరణకు 40 కేంద్రాలను గుర్తించి స్క్రాప్ సేకరణదారులకు అప్పగించనున్నట్టు తెలిపారు. జాతరప్రాంతాల్లో ఉత్పత్తి అయిన ప్లాస్టిక్‌ను ఎప్పటికప్పుడు సేకరించి పర్యావరణానికి నష్టం కలుగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ఉన్నావ్ కేసులో మరణ వాంగ్మూలం కీలకం

నిందితులకు శిక్ష పడేలా చూడటంలో అది ఉపయోగపడుతుంది

త్వరలోనే చార్జిషీట్ దాఖలు: యూపీ డీజీపీ

లక్నో/ఉన్నావ్, డిసెంబర్ 10: ఉన్నావ్ ఘటన నిందితులకు శిక్ష పడటంలో బాధితురాలి మరణవాంగ్మూలం ఎంతో కీలకం కానున్నదని ఉత్తరప్రదేశ్ డీజీపీ ఓపీ సింగ్ చెప్పారు. 'యువతి మరణించడానికి ముందు ఆమెను సబ్ డివిజన్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చాం. ఈ సందర్భంగా ఆమె తన వాంగ్మూలాన్ని ఇచ్చారు. నాపై జరిగిన లైంగికదాడి కేసు విచారణ నిమిత్తం రాయ్‌బరేలీ కోర్టుకు హాజరుకావడానికి వెళ్తుండగా ఐదుగురు వ్యక్తులు దాడి చేసి, నిప్పుపెట్టారు. వారిలో ఇద్దరు (శివమ్ త్రివేది, శుభమ్ త్రివేది) నాపై లైంగికదాడికి పాల్పడిన వాళ్లు ఉన్నారు. మిగిలిన ముగ్గురు వ్యక్తులు హరిశంకర్ త్రివేది, రాం కిషోర్ త్రివేది, ఉమేశ్ బాజ్‌పాయ్' అని యువతి వాంగ్మూలం ఇచ్చారని డీజీపీ తెలిపారు. ఈ వాంగ్మూలం కేసు దర్యాప్తునకు, నిందితులకు శిక్షపడటంలో ఎంతో కీలకం కానున్నదని, దీన్ని కచ్చితంగా ఉపయోగించుకుంటామని చెప్పారు. మంగళవారం డీజీపీ ఓపీ సింగ్ విలేకరులతో మాట్లాడుతూ బాధితురాలిని చికిత్స నిమిత్తం ఢిల్లీలోని సఫ్దర్‌గంజ్ దవాఖానకు తరలించినప్పుడు ఆమె తనపై జరిగిన దాడి విషయాన్ని డాక్టర్లతోనూ చెప్పారని, కాబట్టి డాక్టర్ల వాంగ్మూలాన్ని కూడా సేకరించి చార్జిషీట్‌లో పొందుపర్చుతామని తెలిపారు. బాధితురాలి సెల్‌ఫోన్, పర్స్‌ను ఫోరెన్సిక్ ప్రయోగశాలకు పంపామని, వాటిపై ఉన్న వేలిముద్రలు, తదితర ఆధారాలను బట్టి నిందితులకు డీఎన్ఏ పరీక్షలు నిర్వహించడాన్ని పరిశీలిస్తున్నామని చెప్పారు. నిందితులు ఐదుగురిని ఇప్పటికే అరెస్టు చేశామని, త్వరలోనే వీరిపై చార్జిషీట్ దాఖలు చేస్తామని డీజీపీ పేర్కొన్నారు. మరోవైపు యువతి మరణానికి కారణంపై సీబీఐ దర్యాప్తు జరుపాలంటూ శివమ్ త్రివేది కుటుంబసభ్యులు డిమాండ్ చేశారు.

సమాధి కట్టవద్దంటూ యువతి కుటుంబసభ్యులు ఆందోళన

యువతి ఖననం చేసిన చోట అధికారులు సమాధి కడుతుండటంపై ఆమె కుటుంబసభ్యులు తీవ్ర అభ్యంతరం చెప్పారు. తమకు న్యాయం జరిగే వరకు సమాధి కట్టనివ్వమని తెలిపారు. సమాధిపై పేర్చిన ఇటుకలను తొలిగించారు. ఇంకోవైపు ఛాతి నొప్పితో బాధపడుతూ దవాఖానలో చేరిన బాధితురాలి సోదరి స్పందిస్తూ తమకు వేగవంతంగా న్యాయం జరుగాలని లేకుంటే తాను ఆత్మహత్య చేసుకుంటానని హెచ్చరించారు.

న్యాయం కోసం మౌనదీక్ష

'నిర్భయ' కోసం 20 నుంచి కార్యాచరణ

- దోషులకు ఉరిశిక్ష అమలు చేయాలి..
- లేదంటే నిరవధిక నిరాహార దీక్ష చేస్తా
- సామాజిక ఉద్యమకారుడు అన్నా హజారే హెచ్చరిక
- ప్రధాని నరేంద్రమోదీకి లేఖ



న్యూఢిల్లీ, డిసెంబర్ 10: దేశంలో ప్రస్తుతం మహిళలపై లైంగికదాడులు, హత్యలు అడ్డూఅదుపూ లేకుండా కొనసాగుతుండటంపై దిగ్భ్రాంతి వ్యక్తంచేస్తూ ప్రముఖ సామాజిక ఉద్యమకారుడు అన్నా హజారే ప్రధాన మంత్రి నరేంద్రమోదీకి సోమవారం ఓ లేఖ రాశారు. ఢిల్లీలో ఏడేండ్ల క్రితం సామూహిక అత్యాచారానికి గురై మరణించిన 'నిర్భయ' న్యాయం చేయాలని కోరుతూ ఈ నెల 20 నుంచి 'మౌనదీక్ష' చేపడతానని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కేసులో దోషులకు సుప్రీంకోర్టు విధించిన శిక్షను అమలుచేసి బాధితురాలికి త్వరగా న్యాయం చేయాలని ఆయన ప్రధానికి విజ్ఞప్తి చేశారు. దీర్ఘకాలం నుంచి నలుగుతున్న ఈ కేసులో ప్రభుత్వం సత్వర చర్యలు చేపట్టకపోతే నిరవధిక నిరాహారదీక్ష మొదలుపెడతానని హజారే స్పష్టం చేశారు. బాధితులకు న్యాయం చేయడంలో తీవ్ర జాప్యం జరుగుతుండటంతో న్యాయ వ్యవస్థపై ప్రజలు నమ్మకాన్ని కోల్పోయారని, ఇటీవల హైదరాబాద్‌లో 'దిశ'పై హత్యాచారానికి పాల్పడిన నలుగురు నిందితులను పోలీసులు ఎన్‌కౌంటర్‌లో హతమార్చడాన్ని ప్రజలు ప్రశంసిస్తుండటమే ఇందుకు ప్రత్యక్ష నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. దేశంలో చివరిసారిగా అత్యాచార అభియోగాలతో ధనంజయ చటర్జీ అనే వ్యక్తికి 2004లో సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఉరిశిక్ష అమలు చేశారని, ఆ తర్వాత అనేక అత్యాచారాలు, హత్య కేసుల్లో మొత్తం 426 మంది దోషులకు మరణశిక్ష విధించినప్పటికీ వారిలో ఎవరినీ ఉరితీయలేదని హజారే గుర్తుచేశారు. న్యాయ వ్యవస్థ నుంచి స్వయంగా తనకు ఎదురైన అనుభవాలను కూడా ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. 1988లో మహారాష్ట్ర మంత్రి బబన్‌రావు ఘోలప్ అవినీతి వ్యవహారంపై తాను బలమైన సాక్ష్యాధారాలతో ఆరోపణలు చేసినప్పుడు ఆయన ప్రతీకారంతో తనపై కేసు దాఖలు చేశారని, ఈ కేసులో తనకు కోర్టు మూడు నెలల జైలుశిక్ష విధించిన ప్పటికీ 14 రోజుల తర్వాత విడుదల చేశారని, ఆ తర్వాత 2014లో న్యాయస్థానం ఆ మంత్రిని అవినీతి వ్యవహారంలో దోషిగా తేల్చి ఏడేండ్ల జైలుశిక్ష విధించిందని హజారే వివరించారు. దేశంలో మహిళల భద్రతపై ఆయన ఆందోళన వ్యక్తంచేస్తూ.. 'మహిళలపై అఘాయిత్యాలు పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తున్నదని, 'నిర్భయ' ఘటనపై ప్రజాగ్రహం వెల్లువెత్తడంతో చట్టాలను సవరించిప్పటికీ దోషులను ఇంకా ఉరికంబం ఎక్కించకపోవడంతో బాధితురాలికి న్యాయం చేయడంలో మనం విఫలమయ్యామని, దేశవ్యాప్తంగా ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల్లో 6 లక్షలకుపైగా అత్యాచార కేసులు పెండింగ్‌లో ఉండటం మన ఘోర వైఫల్యానికి స్పష్టమైన నిదర్శనమని హజారే పేర్కొన్నారు.

మాకు ఉరిశిక్షలు ఎందుకు?

- ఢిల్లీలోని వాయు కాలుష్యం వల్ల ఎలాగూ చనిపోతాం!
- సుప్రీంకోర్టులో నిర్భయ దోషి రివ్యూ పిటిషన్

న్యూఢిల్లీ, డిసెంబర్ 10: నిర్భయ కేసులో ఉరిశిక్ష పడిన నలుగురు దోషుల్లో ఒకడు మంగళవారం సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. తమకు విధించిన మరణశిక్షను సమీక్షించాలంటూ అక్షయ్‌సింగ్ తన న్యాయవాది ఏపీసింగ్ ద్వారా రివ్యూ పిటిషన్ దాఖలు చేశాడు. తనను తప్పుగా దోషిగా నిర్ధారించారని, పలు దేశాల్లో ఉరిశిక్షలను రద్దు చేశారంటూ పలు న్యాయ సంబంధిత వాదనలను అందులో పేర్కొన్నాడు. ఢిల్లీలో నెలకొన్న వాయు కాలుష్యంపైనా అందులో ప్రస్తావించాడు. 'ఢిల్లీలో వాయు,నీటి కాలుష్యం వల్ల ఎలాగూ జీవితం హరించుకుపోతున్నది. ఇక ఉరిశిక్షలు ఎందుకు?' అని ప్రశ్నించాడు. సత్యయుగంలో ప్రజలు వెయ్యేండ్లపాటు జీవించేవారంటూ హిందువులకు సంబంధించిన వేదాలు, పురాణాలు, ఉపనిషత్తుల గురించి కూడా పిటిషన్‌లో పేర్కొన్నట్లు సమాచారం. 2012 డిసెంబర్ 16 అర్ధరాత్రి ఢిల్లీలో కదులుతున్న బస్సులో పారామెడికల్ విద్యార్థిని నిర్భయ(23)పై ఆరుగురు సామూహిక లైంగిక దాడికి పాల్పడిన సంగతి తెలిసిందే. బాధితురాలు సింగపూర్ దవాఖానలో చికిత్సపొందుతూ డిసెంబర్ 29న మరణించింది. దేశవ్యాప్తంగా సంచలనం రేపిన ఈ కేసులో నిందితుడైన రామ్‌సింగ్ జైల్లో ఆత్మహత్య చేసుకున్నాడు. దోషుల్లో ఒకడైన బాల నేరస్థుడికి జువెనైల్ కోర్టు మూడేండ్ల శిక్ష విధించగా అది ముగియడంతో జైలు నుంచి అతడు విడుదయ్యాడు. మిగిలిన నలుగురైన ముకేశ్(30), పవన్‌గుప్తా (23), వినయ్ శర్మ (24), అక్షయ్‌సింగ్ (31)కు ట్రయల్ కోర్టు 2013లో ఉరిశిక్ష విధించగా 2014లో హైకోర్టు, 2017లో సుప్రీంకోర్టు సమర్థించాయి. ముకేశ్, పవన్ గుప్తా, వినయ్ శర్మ దాఖలు చేసిన రివ్యూ పిటిషన్లను 2018 జూలై 9న సుప్రీంకోర్టు తిరస్కరించింది. మరోవైపు హైదరాబాద్‌కు చెందిన పశువైద్యురాలు దిశపై హత్యాచారం చేసిన నిందితులను పోలీసులు ఇటీవల ఎన్‌కౌంటర్ చేయడంతో నిర్భయ నిందితులకు విధించిన ఉరిశిక్షలను అమలు చేయాలన్న డిమాండ్ ఊపందుకున్నది. ఈ నేపథ్యంలో నిర్భయపై అకృత్యానికి పాల్పడిన డిసెంబర్ 16న నలుగురు నిందితులకు ఉరిశిక్షలు అమలు చేయాలని కేంద్రం నిర్ణయించినట్లు తెలుస్తున్నది. దీని కోసం ఉరి తాళ్లను కూడా తయారు చేయిస్తున్నది. ఈ నేపథ్యంలో తనకు విధించిన ఉరిశిక్ష తీర్పుపై ఇప్పటి వరకు సమీక్ష కోరని నలుగురు నిందితుల్లో ఒకడైన అక్షయ్ సింగ్ తాజాగా రివ్యూ పిటిషన్ వేసినట్లు తెలుస్తున్నది.

నిర్భయ నిందితుడు పవన్ తీహార్ జైలుకు తరలింపు

నిర్భయ నిందితుల్లో ఒకడైన పవన్ కుమార్ గుప్తాను తీహార్ జైలుకు తరలించినట్లు జైళ్ల విభాగం డైరెక్టర్ జనరల్ సందీప్ గోయల్ మంగళవారం తెలిపారు. ఇప్పటి వరకు మండోలి జైలులో ఉన్న అతడ్ని ఇటీవల ఇక్కడకు తీసుకొచ్చి 2వ నంబరు కారాగార గదిలో ఉంచినట్లు వెల్లడించారు. మరో ఇద్దరు నిందితులైన ముకేశ్ సింగ్, అక్షయ్ సింగ్ కూడా ఇదే సెల్‌లో ఉండగా, మరో నిందితుడు వినయ్ శర్మ 4వ నంబర్ సెల్‌లో ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ నలుగురు నిందితులకు తీహార్ జైలులోనే ఉరిశిక్షలు అమలు చేయనున్నట్లు తెలుస్తున్నది.

'ఉన్నావ్' తొలి బాధితురాలి కేసులో పదహారున తీర్పు

న్యూఢిల్లీ, డిసెంబర్ 10: ఉన్నావ్ తొలి బాధితురాలి లైంగికదాడి కేసులో న్యాయమూర్తి తీర్పును రిజర్వ్ చేశారు. ఈ నెల 16న తీర్పు ప్రకటించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. 2017లో తాను మైనర్‌గా ఉన్నప్పుడు బీజేపీ ఎమ్మెల్యే కుల్‌దీప్ సింగ్ సెంగర్ తనను అపహరించి లైంగికదాడికి పాల్పడ్డాడని పేర్కొంటూ సదరు యువతి కేసు పెట్టిన విషయం తెలిసిందే. జూలైలో ఆమె తన బంధువులతో, న్యాయవాదితో కలిసి కారులో ప్రయాణిస్తుండగా ఓ లారీ బలంగా ఢీకొట్టడంతో ఆమె బంధువులైన ఇద్దరు మహిళలు మరణించారు. యువతికి, న్యాయవాదికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదానికి కుల్‌దీప్ సింగ్ సెంగరే కారణమని సదరు యువతి ఆరోపించారు. ఈ నేపథ్యంలో లైంగికదాడి కేసులో వాదనలు విన్న న్యాయమూర్తి ధర్మేశ్ శర్మ తీర్పును రిజర్వ్ చేశారు.

నేటి నుంచి ఏపీలో పెంచిన చార్జీలు అమలు

అమరావతి, నమస్తే తెలంగాణ: ఆంధ్రప్రదేశ్‌లో పెంచిన ఆర్టీసీ బస్సు చార్జీలు బుధవారం ఉదయం నుంచి అమలవుతాయని ఏపీఎస్ఆర్టీసీ ప్రకటించింది. పల్లెవెలుగు, ఇంద్ర, ఏసీ, గరుడ, అమరావతి బస్సుల్లో కిలోమీటర్‌కు పది పైసల చొప్పున, ఎక్స్‌ప్రెస్, అల్ట్రా డీలక్స్, సూపర్‌లగ్జరీల్లో 20 పైసల చొప్పున చార్జీలు పెంచారు. వెన్నెల, స్లీపర్ బస్సుల్లో చార్జీలు పెంచలేదు. సిటీ, ఆర్డినరీ బస్సుల్లో 11 స్టేజీల వరకు పెంపు వర్తించదు. పల్లెవెలుగులో మొదటి రెండు స్టేజీలు లేదా పది కిలోమీటర్ల వరకు చార్జీల పెంపులేదని, తదుపరి 75 కిలోమీటర్ల వరకు రూ.ఐదు చార్జీ పెంచినట్టు ఏపీఎస్ఆర్టీసీ ప్రకటించింది.

ఆన్‌లైన్‌లో గ్రూప్-2 లా పోస్టుల హాల్‌టికెట్లు

- ఈనెల 16 నుంచి 18వరకు సర్టిఫికెట్లు అప్‌లోడ్‌కు అవకాశం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: గ్రూప్-2 న్యాయశాఖ విభాగంలో అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ పోస్టులకు సంబంధించిన అభ్యర్థుల హాల్‌టికెట్ నంబర్లు వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు టీఎస్‌పీఎస్సీ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొంది. లా డిగ్రీ సర్టిఫికెట్లను ఈనెల 16 నుంచి 18 వరకు అప్‌లోడ్ చేసేందుకు అవకాశం కల్పించింది. హాల్‌టికెట్ నంబర్లు, అప్‌లోడింగ్ లింక్ కోసం టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్ చూడాలని కోరింది.

పల్లెప్రగతికి ప్రాధాన్యం

రూ.430 కోట్లతో 30 రోజుల ప్రణాళిక పనులు

- హరితహారం కోసం అదనంగా రూ.255 కోట్లు
- డీసీసీ కింద రూ.150 కోట్లు
- మరో రూ.158 కోట్లతో కొత్త పనులు
- ఈ ఆర్థిక సంవత్సరంలోగా ఉపాధి పనుల ప్రణాళిక

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: గ్రామాల అభివృద్ధి ప్రధాన లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు రచించి, అమలుచేస్తున్నది. గత సెప్టెంబర్ ఆరో తేదీ నుంచి అక్టోబర్ ఐదో తేదీ వరకు నిర్వహించిన పల్లెప్రగతిలో గుర్తించిన పనులన్నీ ప్రాధాన్య క్రమంలో చేపడుతున్నారు. ఇందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతోపాటు ఉపాధిహామీ పథకం నిధులను వినియోగిస్తున్నారు. వచ్చే ఏడాది మార్చి నాటికి ఉపాధిహామీ పథకం కింద రాష్ట్ర వాటాతో కలిపి దాదాపు రూ.వెయ్యి కోట్లను పల్లెల అభివృద్ధికి ఖర్చు చేయనున్నారు. ఉపాధిహామీ పథకం లక్ష్యాన్ని నెరవేరుస్తూనే గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని పల్లెప్రగతి ప్రణాళికలో పేర్కొన్నారు. పల్లెప్రగతి పనులతోపాటు హరితహారం పనులన్నీ ఉపాధిహామీ పథకం కూలీలతోనే చేపడుతున్నారు.

పల్లెప్రగతికి రూ.430 కోట్లు

పల్లెప్రగతి ప్రణాళిక పనులను పూర్తిచేసేందుకు రూ.430 కోట్లను ఈ ఆర్థిక సంవత్సరంలో వెచ్చించనున్నట్టు గ్రామీణాభివృద్ధిశాఖ వెల్లడించింది. వీటితోపాటుగా పంచాయతీరాజ్ శాఖ నిధులను కూడా వినియోగించనున్నారు. మౌలిక సదుపాయాల కల్పనతోపాటు గ్రామాలను అందంగా, పరిశుభ్రంగా తీర్చిదిద్ది, ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పించడానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇప్పటివరకు రాష్ట్రంలోని 12,249 గ్రామ పంచాయతీల్లో నర్సరీలు ఏర్పాటయ్యాయి. 3,864 చోట్ల కంపోస్ట్‌పిట్స్, షెడ్‌తో కూడిన డంపింగ్‌యార్డులు నిర్మించగా.. మరో 8,800 నిర్మాణాలకు సిద్ధమయ్యాయి. 2,644 వైకుంఠధామాల నిర్మాణం పూర్తయ్యే దశలో ఉండగా, మరో 10,120 పనులు చేపట్టారు. ఇప్పటివరకు గ్రామాల్లో 1,35,438 ఇంకుడుగుంతల పనులు తుదిదశకు చేరుకోగా... మరో 42,52,243 ఇంకుడుగుంతల పనులు జరుగుతున్నాయి. వీటి కోసం పల్లె ప్రణాళిక కింద రూ.430 కోట్లు వెచ్చిస్తున్నారు.

హరితహారం కోసం రూ.255 కోట్లు

హరితహారం పనులన్నీ ఉపాధిహామీ పథకం కూలీలతో చేపడుతున్నారు. ఇప్పటికే రాష్ట్రంలో 12,249 పంచాయతీల్లో నర్సరీలు ఏర్పాటుచేశారు. ఆయా నర్సరీల్లో స్థానిక అవసరాలకు అనుగుణంగా దోమల నివారణకు ఉపకరించే మొక్కలు, చింత, వేప తదితర మొక్కలను పెంచుతున్నారు. నర్సరీల నిర్వహణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా రూ.255 కోట్లు వెచ్చిస్తున్నాయి.

డీసీసీ కింద రూ.150 కోట్లు

జిల్లా కలెక్టర్ అనుమతితో జిల్లాస్థాయి కమిటీ ఆధ్వర్యంలో ఉపాధి హామీ పథకం కింద పలు గ్రామాల్లో సీసీరోడ్లు, అంతర్గతరోడ్ల నిర్మాణం చేపట్టారు. దీనికోసం గ్రామాలకు రూ.150 కోట్లు వెచ్చించేందుకు ప్రణాళికలో పేర్కొన్నారు.

ఎంసీసీ కింద రూ.50 కోట్లు

మండలస్థాయి నిధుల్లో గ్రామాల అభివృద్ధి కోసం రూ.50 కోట్లు వెచ్చించేందుకు నిర్ణయించారు. హరితహారం కోసం ప్రభుత్వ భూములు, ప్రైవేట్ భూములను చదునుచేయడం, మొక్కలునాటడం వంటి పనులతోపాటు గ్రామాభివృద్ధి కోసం పంచాయతీల తీర్మానం మేరకు ఈ నిధులను వెచ్చించనున్నారు.

కొత్త పనులకు రూ.158 కోట్లు

ఇప్పటివరకు చేపట్టిన పనులే కాకుండా పల్లెప్రగతి ప్రణాళికా నిర్వహణలో గుర్తించిన పనుల కోసం కూడా నిధులను వెచ్చించేందుకు నిర్ణయించారు. కొత్త పనుల కోసం రూ.158 కోట్లను ఖర్చు చేయనున్నారు. పల్లెప్రగతి సందర్భంగా గ్రామాల్లో పర్యటించిన ప్రత్యేకాధికారులు ఈ పనులపై నివేదికలు తయారుచేయనున్నారు. ఈ నివేదికలను గ్రామసభలో ఆమోదించి పనులు చేపడతారు.

టార్గెట్ మార్చి

ప్రస్తుతం అంచనా వేసిన నిధులన్నీ ఈ ఆర్థిక సంవత్సరంలో ఖర్చుచేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నది. ఆయా పనులకు వేగంగా అనుమతిలిచ్చేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారు. మార్చిలోగా ఈ పనులను పూర్తిచేసి, ఆ తర్వాత మరో విడుత ప్రణాళిక సిద్ధంచేసుకోనున్నారు.

మహిళలపై నేరాల కేసుల్లో బీజేపీ సభ్యులే అత్యధికం!

- ఆ తర్వాతి స్థానాల్లో కాంగ్రెస్, వైఎస్సార్సీపీ
- ఏడీఆర్ నివేదిక

న్యూఢిల్లీ, డిసెంబర్ 10: మహిళలపై నేరాలకు సంబంధించిన కేసులను ఎదుర్కొంటున్న చట్టసభ సభ్యుల్లో బీజేపీ నుంచి అత్యధికంగా 21 మంది సభ్యులు ఉన్నట్లు ఎన్నికల పరిశీలక సంస్థ 'అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫామ్స్' (ఏడీఆర్)తాజా నివేదికలో వెల్లడించింది. ఆ తర్వాతి స్థానాల్లో కాంగ్రెస్ (16), వైఎస్సార్సీపీ (7) ఉన్నట్టు తెలిపింది. మహిళలపై నేరాలకు సంబంధించిన కేసులున్న ఎంపీలు 2009లో ఇద్దరు ఉండగా, 2019 నాటికి 19కి పెరిగిందని పేర్కొంది. ముగ్గురు ఎంపీలు, ఆరుగురు ఎమ్మెల్యేలపై లైంగికదాడి కేసులున్నాయని తెలిపింది. ఏడీఆర్ నివేదిక ప్రకారం.. గత ఐదేండ్లలో లైంగికదాడి కేసులను ఎదుర్కొంటున్న 41 మంది అభ్యర్థులకు గుర్తింపుపొందిన పార్టీలు టికెట్లు ఇచ్చాయి. కేసులున్న 66 మంది అభ్యర్థులకు బీజేపీ ఐదేండ్లలో లోక్‌సభ, రాజ్యసభ, ఆయా రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల టికెట్లు కేటాయించింది. కాంగ్రెస్ 46 మందికి, బీఎస్పీ 40 మందికి టికెట్లిచ్చింది. ఎంపీలు, ఎమ్మెల్యేలు సమర్పించిన 4,896 ఎన్నికల అఫిడవిట్లలో 4,822 అఫిడవిట్లను విశ్లేషించి ఏడీఆర్ ఈ నివేదికను రూపొందించింది. కేసులున్న లోక్‌సభ అభ్యర్థుల సంఖ్య 2009లో 38గా ఉండగా, 2019నాటికి అది 126కు చేరుకుంది. అత్యధిక కేసులున్న ఎంపీలు/ఎమ్మెల్యేల్లో పశ్చిమబెంగాల్ నుంచి అత్యధికంగా 16 మంది సభ్యులు ఉండగా, ఒడిశా (12), మహారాష్ట్ర(12) రెండో స్థానంలో ఉన్నాయి. గత ఐదేండ్లలో ఇలాంటి కేసులున్న 572 మంది అభ్యర్థులు లోక్‌సభ, రాజ్యసభ, ఆయా రాష్ట్రాల చట్టసభల ఎన్నికల్లో పోటీచేశారు. అయితే వారెవరిపైనా నేరాలు రుజువు కాలేదు. ఇలాంటి కేసులున్న సుమారు 410 మందికి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు టికెట్లు ఇచ్చాయి. వారిలో 89 మంది లోక్‌సభ, రాజ్యసభకు ఎన్నికయ్యారు. గత ఐదేండ్లలో మహిళలపై నేరాలకు సంబంధించి తమపై కేసులున్నాయని అఫిడవిట్‌లో ప్రకటించినప్పటికీ, రాజకీయ పార్టీలు టికెట్లు ఇచ్చిన అభ్యర్థుల్లో మహారాష్ట్ర నుంచి అత్యధికంగా 84 మంది ఉన్నారు. ఆ తర్వాతి స్థానంలో బీహార్(75) ఉన్నది.

భూ సమస్యలకూ క్లినిక్

- రైతుల వద్దకే న్యాయసహాయం
- ప్రతి శనివారం గ్రామాల్లో నిర్వహణ
- జనగామ జిల్లా చెన్నూరులో పైలట్ ప్రాజెక్టు
- ప్రారంభించిన లీఫ్ సొసైటీ, సెయిల్స్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: భూమి సమస్యల పరిష్కారానికి ఒక క్లినిక్ ఏర్పడింది. సంచార వైద్యశాల మాదిరిగా భూమి సమస్యల పరిష్కారానికి రైతులవద్దకే వెళ్లి న్యాయసహాయం చేయడానికి న్యాయవాదుల బృందం ముందుకొచ్చింది. నల్సార్ లా యూనివర్సిటీ అనుబంధ ఆచార్యుల నేతృత్వంలోని లీగల్ ఎంపవర్‌మెంట్ అండ్ అసిస్టెన్స్ ఫర్ ఫార్మర్స్ సొసైటీ (లీఫ్స్), సెయిల్స్ సంస్థలు దీనికి పూనుకొన్నాయి. పైలట్ ప్రాజెక్టుగా మంగళవారం జనగామ జిల్లా పాలకుర్తి మండలం చెన్నూరులో భూమిహక్కుల క్లినిక్ నిర్వహించారు. మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇకపై ప్రతి శనివారం ఇలాంటి క్లినిక్‌లు నిర్వహిస్తామని ఎం సునీల్‌కుమార్ బృందం ప్రకటించింది. ఇప్పటికే ప్రతి గురువారం వరంగల్‌లోని కార్యాలయంలో రైతులకు ఉచిత న్యాయసేవలు అందిస్తున్నామని తెలిపింది.

రైతులకు న్యాయసలహాలు

మంగళవారం చెన్నూరు రైతుల భూముల సమస్యలను క్లినిక్ బృందం పరిశీలించింది. వాటిని ఎలా పరిష్కరించుకోవాలో న్యాయసలహాలు, సూచనలు ఇచ్చింది. ఈ గ్రామంలో దాదాపు మూడు వేల ఎకరాల భూమి ఉన్నదని, ఇందులో వైవాటి కబ్జాలు ఎక్కువగా ఉన్నాయని, వాస్తవంగా ఉన్న భూమి కంటే ఎక్కువగా రికార్డుల్లో నమోదైన విషయాన్ని గుర్తించింది. అసైన్డ్ భూముల సమస్యకూడా ఉన్నది. ఆయా సమస్యల పరిష్కారానికి ఏమేమి చేయాలో ఒక్కొక్క రైతుకు బృందం వివరించింది. ఈ గ్రామానికి ఇంకా కొన్ని సార్లు ప్రత్యేకంగా వెళితే సమస్యలు పరిష్కారం అవుతాయని సునీల్‌కుమార్ చెప్పారు. మెజార్టీ సమస్యలు తాసిల్దార్ కార్యాలయంలో పరిష్కారం అయ్యేవే ఉన్నాయని తెలిపారు. రెవెన్యూ అధికారులు ఏ మాత్రం దృష్టిసారించినా ఈ గ్రామంలో ఉన్న అన్ని భూ సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. చెన్నూర్‌లో భూమి సమస్యల క్లినిక్ నిర్వహించిన బృందంలో న్యాయవాదులు అభిలాష్, జీవన్, మల్లేశ్, సెయిల్స్ సంస్థ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రమేశ్ పాల్గొన్నారు.

త్వరలో ఎస్సీఎఫ్‌కు 485 మంది కొత్త ఉద్యోగులు

2019లో సంవత్సరంలో చిన్న సినిమాలు ఆశాజనక ఫలితాల్ని అందుకున్నాయి. కథాంశాల్లో వైవిధ్యతకు పెద్దపీట వేస్తూ చేసిన చిరు ప్రయత్నాలకు ప్రేక్షకులు అపూర్వ విజయాల్ని అందించారు. ఈ చిన్న చిత్రాలతో ప్రతిభావంతులైన సాంకేతిక నిపుణులు తెలుగు చిత్రసీమకు పరిచయమయ్యారు. కథ, కథనాల్లోని నవ్యత లోపించడంతో మరికొన్ని లో బడ్జెట్ సినిమాలు ప్రేక్షకుల తిరస్కారానికి గురయ్యారు. మొత్తంగా ఈ సంవత్సరం చిన్న సినిమాలకు కలిసి వచ్చిందని చెప్పవచ్చు.

చిన్న సినిమా చిరు సందడి

రివ్యూ 2019

ఈ ఏడాది చిన్న సినిమాల్లో పెద్ద విజయాన్ని సాధించిన చిత్రంగా 'ఏజెంట్‌సాయిశ్రీనివాస ఆత్రేయ' నిలిచింది. మర్డర్ మిస్టరీ కథాంశానికి డిటెక్టివ్ నేపథ్యాన్ని జోడిస్తూ తెరకెక్కించిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద పదికోట్లకుపైగా వసూళ్లను రాబట్టింది. ఈ సినిమాలో నెల్లూరుకు చెందిన ప్రైవేట్ డిటెక్టివ్ ఆత్రేయగా నవీన్ పొలిశెట్టి విలక్షణ అభినయంతో ప్రేక్షకుల్ని మెప్పించారు. ఈ సినిమాతో తొలి అడుగులోనే విమర్శకుల ప్రశంసల్ని అందుకున్నారు దర్శకుడు ఆర్.ఎస్.జే

స్వరూప్.విశ్వక్‌సేన్ కథానాయకుడిగా నటిస్తూ స్వీయ దర్శకత్వంలో రూపొందిన 'ఫలక్‌నుమాదాస్' చిత్రం కమర్షియల్‌గా చక్కటి వసూళ్లను సాధించింది. హైదరాబాద్‌లోని పాతబస్తీ జీవనశైలి, యాస, సంస్కృతి సంప్రదాయాల్ని ఆవిష్కరిస్తూ వాస్తవికత దగ్గరగా తెరకెక్కిన ఈ చిత్రం మాస్ ప్రేక్షకుల మెప్పును పొందింది. మలయాళ చిత్రం 'అంగమలైడైరీస్' మూలకథను తీసుకొని విశ్వక్‌సేన్ ఈ సినిమాను రూపొందించారు. హీరోగా విశ్వక్‌సేన్ అభినయానికి మన్ననలు లభించాయి.

'ఎవరు' సినిమాతో ఈ ఏడాది విజయ పరంపరను కొనసాగించారు కథానాయకుడు అడివిశేష్. తన తండ్రి హత్యకు కారణమైన వారిపై ప్రతీకారం తీర్చుకునే ఓ కొడుకు కథతో స్క్రీన్‌ప్లే ప్రధానంగా తెరకెక్కిన ఈ చిత్రం మంచి వసూళ్లను సాధించింది. స్పానిష్ చిత్రం 'ది ఇన్విజిబుల్ గెస్ట్' ఆధారంగా దర్శకుడు వెంకట్ రామ్‌జీ ఈ సినిమాను తెరకెక్కించి వైవిధ్యతను చాటుకున్నారు.

ఈ ఏడాది సినీ ప్రముఖులతో పాటు ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించిన చిన్న చిత్రం 'బ్రోచేవారెవరురా'. కిడ్నాప్ డ్రామా, వినోదం, ప్రేమ సమ్మిళితంగా వినూత్నమైన కథ, కథనాలతో దర్శకుడు వివేక్ ఆత్రేయ ఈ సినిమాను తెరకెక్కించారు. సున్నితమైన కథాంశాన్ని ఆహ్లాదభరితంగా తీర్చిదిద్దిన తీరుకు ప్రేక్షకులు ఫిదా అయ్యారు. దాదాపు ఐదు కోట్ల వ్యయంతో రూపొందిన ఈ చిత్రానికి ఆశాజనకమైన వసూళ్లు లభించాయి.

విద్యార్థి ఉద్యమ నాయకుడు జార్జిరెడ్డి జీవితం ఆధారంగా రూపొందిన 'జార్జిరెడ్డి' చిత్రం మంచి ప్రయత్నంగా నిలిచింది. 1970ల కాలం నాటి ఉస్మానియా యూనివర్సిటీ పరిస్థితుల్ని, జార్జిరెడ్డి పోరాటస్ఫూర్తిని ఉద్వేగభరితంగా తెరపై ఆవిష్కరించడంలో దర్శకుడు జీవన్‌రెడ్డి విజయవంతమయ్యారు. కథను నమ్మి నిజాయితీగా నిర్మాతలు అప్పిరెడ్డి, దామోదర్‌రెడ్డి, సంజయ్‌రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మించారు.

ఆసు యంత్రం రూపకర్త, పద్మశ్రీ అవార్డు గ్రహీత చింతకింది మల్లేశం జీవితం ఆధారంగా రూపొందిన 'మల్లేశం' చిత్రం నవ్యమైన ప్రయత్నంగా తెలుగు ప్రేక్షకుల అభినందనల్ని అందుకున్నది. ఆసుయంత్రం తయారీలో చింతకింది మల్లేశానికి ఎదురైన అవరోధాల్ని హృద్యంగా ఆవిష్కరిస్తూ దర్శకుడు రాజ్.ఆర్ ఈ సినిమాను తెరకెక్కించారు. ప్రియదర్శి సహజ అభినయంతో మల్లేశం పాత్రకు ప్రాణంపోశారు. తెలంగాణ యాస, సంస్కృతులకు పెద్దపీట వేస్తూ రూపొందిన ఈ చిత్రం కమర్షియల్‌గా కూడా విజయం సాధించడం విశేషం.

విజయ్ దేవరకొండ సోదరుడు ఆనంద్ దేవరకొండ కథానాయకుడిగా పరిచయమైన 'దొరసాని' విభిన్నమైన చిత్రంగా పేరు తెచ్చుకున్నా కమర్షియల్‌గా మాత్రం ఆశించిన విజయాన్ని అందుకోలేదు. గడీల సంస్కృతికి కులమత అంతరాలు, నిష్కల్మషమైన ప్రేమకథను మేళవిస్తూ దర్శకుడు కె.వి.ఆర్ మహేంద్ర ఈ సినిమాను రూపొందించారు.

అగ్రహీరో విజయ్‌దేవరకొండ నిర్మాతగా మారి తొలి ప్రయత్నంగా రూపొందించిన చిత్రం 'మీకు మాత్రమే చెప్తా'. రహస్య వీడియో ఓ యువకుడి జీవితాన్ని ఎలా చిక్కుల్లోకి నెట్టింది?అతడి పెళ్లికి ఎలాంటి అడ్డంకుల్ని సృష్టించిందనే అంశాన్ని వినోదాత్మకంగా ఆవిష్కరిస్తూ రూపొందిన ఈ చిత్రం నిర్మాతలకు లాభాల్ని తెచ్చిపెట్టింది. ఈ సినిమాతో హీరోగా అరంగేట్రం చేశారు దర్శకుడు తరుణ్‌భాస్కర్.

'నినువీడని నీడను నేనే' సినిమాతో సుదీర్ఘ విరామం తర్వాత విజయాల బాట పట్టారు సందీప్‌కిషన్. హారర్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన ఈ చిత్రం ప్రేక్షకుల్ని నవ్వించడంలో సఫలమైంది. 'తెనాలి రామకృష్ణ'తో ఆ విజయపరంపను కొనసాగించలేకపోయారు సందీప్‌కిషన్. రొటీన్ కామెడీ కథాంశంతో తెరకెక్కిన ఈ చిత్రం కలెక్షన్స్‌ను రాబట్టడంలో వెనుకబడిపోయింది.

'బ్రోచేవారెవరురా' విజయాన్ని అందుకున్న శ్రీవిష్ణు 'తిప్పరామీసం' చిత్రంతో ప్రేక్షకుల్ని నిరూత్సాహపరిచారు. తల్లీకొడుకుల అనుబంధాన్ని భావోద్వేగభరితంగా మలచడంలో దర్శకుడు విఫలమవ్వడంతో ఈ సినిమా పరాజయాన్ని చవిచూసింది.

'ఆర్‌ఎక్స్100' తో యువతరంలో మంచి క్రేజ్‌ను సొంతం చేసుకున్న కార్తికేయకు 2019 పెద్దగా కలిసి రాలేదు. ఈ ఏడాది అతడు నటించిన 'హిప్పీ', 'గుణ 369' చిత్రాలు కథ, కథనాల్లోని లోపాల కారణంగా పరాజయాలుగా నిలిచాయి.

నూతన తారాగణంతో ఈ ఏడాది రూపొందిన 'ఎవ్వరికీ చెప్పొద్దు', 'రాజా వారు రాణిగారు' మంచి సినిమాలుగా తెలుగు ప్రేక్షకుల మన్ననల్ని అందుకున్నాయి. క్యాస్ట్ ఇష్యూను వినోదాత్మకంగా చర్చిస్తూ దర్శకుడు బసవశంకర్ తెరకెక్కించిన 'ఎవ్వరికీచెప్పొద్దు' మల్టీప్లెక్స్ ప్రేక్షకుల్ని మెప్పించింది. పల్లెటూరి ప్రేమ కథతో ఇటీవలే విడుదలైన 'రాజావారు రాణిగారు' ప్రేక్షకులకు కొత్త అనుభూతిని పంచింది. మమ్ముట్టి నటించిన 'యాత్ర' చిత్రం ప్రేక్షకుల్ని మెప్పించింది.

నిఖిల్ కథానాయకుడిగా నటించిన 'అర్జున్ సురవరం' చిత్రం అనేక అవాంతరాల్ని దాటుకొని ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చింది. నకిలీ సర్టిఫికెట్ స్కామ్‌ను వెలికితీసే నిజాయితీపరుడైన పాత్రికేయుడి కథనంతో రూపొందిన ఈ చిత్రం మంచి వసూళ్లను రాబడుతున్నది.

తమిళ చిత్రం 'కణా' ఆధారంగా తెరకెక్కిన 'కౌసల్యకృష్ణమూర్తి' కొత్త ప్రయత్నంగా నిలిచింది. పల్లెటూరికి చెందిన మహిళా క్రికెటర్‌గా ఐశ్వర్యారాజేష్ నటన ఆకట్టుకున్నది.

నిహారిక, రాహుల్ విజయ్ ప్రధాన పాత్రల్లో నటించిన 'సూర్యకాంతం' కథలో కొత్తదనం లోపించడంతో ఫెయిల్యూర్‌గా నిలిచింది. మూస కథల కారణంగా 'జోడి', 'బుర్రకథ' చిత్రాలు ఆదికి విజయాల్ని అందించలేకపోయాయి. 'ఆపరేషన్ గోల్డ్‌ఫిష్' ప్రచార చిత్రాలు ఆకట్టుకున్నా సినిమా మాత్రం బాక్సాఫీస్ వద్ద నిలదొక్కుకోలేదు. దర్శకుడు ఓంకార్ తెరకెక్కించిన 'రాజుగారి గది-3' రొటీన్ సినిమాగా మిగిలిపోయింది. 'ప్రేమకథా చిత్రమ్-2'లో తొలిభాగం మెరుపులు కనిపించకపోవడంతో నిరూత్సాహపరిచింది. లక్ష్మీస్ ఎన్టీఆర్, ఏబీసీడీ, కొబ్బరిమట్ట, విశ్వామిత్ర, రాగల ఇరవై నాలుగు గంటల్లో, ఆవిరి, భాగ్యనగర వీధుల్లో గమ్మత్తు, వజ్రకవచధర గోవింద సినిమాలు మెప్పించలేకపోయాయి. రాబోవు క్రిస్మస్‌కు ఇద్దరిలోకం ఒకటే, మత్తు వదలరా చిత్రాలతో పాటు మరికొన్ని సినిమాలు తమ అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నాయి.

... చిత్రం డెస్క్

'ఛపాక్' చిత్రంలో దీపికాపదుకునే

నాలోని నమ్మకాన్ని నాశనం చేయలేరు

'పద్మావత్' తర్వాత అగ్రనాయిక దీపికాపదుకునే రెండేళ్ల విరామం తీసుకొని నటించిన చిత్రం 'ఛపాక్'. యాసిడ్ దాడి బాధితురాలు లక్ష్మీఅగర్వాల్ జీవితం ఆధారంగా ఈ చిత్రాన్ని రూపొందించారు. మంగళవారం ట్రైలర్‌ను విడుదల చేశారు. యాసిడ్ దాడికి గురైన మాలతి (దీపికాపదుకునే) ఆ ఘటన తర్వాత ఆత్మన్యూనతకులోను కావడం..ఈ క్రమంలో ఆమె సంఘర్షణ...తిరిగి కోలుకొని జీవితాన్ని ప్రేమించడం వంటి అంశాల్ని ట్రైలర్‌లో ఆవిష్కరించారు. యాసిడ్ అమ్మకాల్ని నియంత్రించాలని మాలతి చేసిన ప్రజాపోరాటాన్ని స్ఫూర్తిదాయకంగా చూపించారు. చివరగా 'అతడు నా ముఖాన్ని నాశనం చేశాడు. నాలోని నమ్మకాన్ని కాదు' అంటూ హృద్యమైన సంభాషణతో ముగించిన టీజర్ అందరిని ఆకట్టుకుంటున్నది. ఇదిలావుండగా ముంబయిలో జరిగిన ట్రైలర్ ఆవిష్కరణ కార్యక్రమంలో దీపికాపదుకునే భావోద్వేగానికిలోనై కన్నీళ్లు పెట్టుకుంది. జయాపజయాలతో సంబంధం లేకుండా తన సినీ ప్రయాణంలో ఓ గొప్ప పాత్రను పోషించాననే సంతృప్తి ఉందని, ఇప్పటివరకు తన కెరీర్‌లో చేసిన సినిమాల్లో క్లిష్టమైన పాత్ర ఇదని దీపికాపదుకునే పేర్కొంది. ఆమె కన్నీళ్లు పెట్టుకున్న వీడియో ప్రస్తుతం సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. వృత్తిపరంగా దీపికాపదుకునే నిబద్ధత ఎంతో గొప్పదని నెటిజన్లు కొనియాడుతున్నారు. ఈ సినిమాకు మేఘనా గుల్జార్ దర్శకత్వం వహించారు. ఈ చిత్ర నిర్మాణంలో దీపికాపదుకునే ఓ భాగస్వామిగా ఉన్నారు. జనవరి 10న ఈ చిత్రం ప్రేక్షకులముందుకురానుంది.

వందశాతం కష్టపడతా!

అనూప్‌రూబెన్స్, నేహా సోలంకి, కార్తికేయ, శేఖర్‌రెడ్డి

'ఈ కథ ఎంపిక చేసుకున్నప్పుడు ప్రేక్షకులు ఎలా రిసీవ్ చేసుకుంటారో అనుకున్నా. విడుదలైన మొదటి రోజే అద్భుతమైన స్పందన వచ్చింది' అన్నారు కార్తికేయ. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం '90ఎం.ఎల్'. శేఖర్‌రెడ్డి దర్శకుడు. అశోక్‌రెడ్డి గుమ్మకొండ నిర్మాత. నేహా సోలంకి కథానాయిక. ఇటీవలే ఈ చిత్రం ప్రేక్షకులముందుకొచ్చింది. సోమవారం సక్సెస్‌మీట్‌ను నిర్వహించారు. కార్తికేయ మాట్లాడుతూ 'సినిమాలో నా పోరాటాలు, నృత్యాలు బాగున్నాయని ప్రశంసిస్తున్నారు. ప్రేక్షకులు నన్ను కొత్త పాత్రల్లో చూడటానికి ఇష్టపడుతున్నారు. ప్రతి సినిమాలో వారిని ఇంప్రెస్ చేయాలని ప్రయత్నిస్తున్నా. వందశాతం కష్టపడుతూ భవిష్యత్తులో మరిన్ని మంచి సినిమాలు చేస్తా' అన్నారు. 'బీసీ సెంటర్ల నుంచి మంచి స్పందన లభిస్తున్నది. ఈ సినిమా ద్వారా మేము ఆశించిన లక్ష్యం నెరవేరింది' అని దర్శకుడు చెప్పారు. రెండు గంటల పాటు ప్రేక్షకుల్ని కడుపుబ్బా నవ్వించే చిత్రమిదని సంగీత దర్శకుడు అనూప్‌రూబెన్స్ అన్నారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు.

సందేశంతో 'కాలేజ్ కుమార్'

రాహుల్ విజయ్, ప్రియ వడ్లమాని

కన్నడ చిత్రం 'కాలేజ్ కుమార్' అదే పేరుతో తెలుగులో రీమేక్ అవుతున్నది. ఎమ్‌ఆర్ పిక్చర్స్ పతాకంపై లక్ష్మణ్ గౌడ సమర్పణలో ఎల్.పద్మనాభ ఈ చిత్రాన్ని కన్నడంలో నిర్మించగా మంచి విజయం సాధించింది. తెలుగులో వెర్షన్‌లో రాహుల్ విజయ్, ప్రియ వడ్లమాని నాయకానాయికలుగా నటిస్తున్నారు. హరిసంతోష్ దర్శకుడు. రాజేంద్రప్రసాద్ ముఖ్యపాత్రను పోషిస్తున్నారు. ఈ చిత్ర టీజర్ ఆవిష్కరణ సోమవారం జరిగింది. దర్శకుడు చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'దర్శకుడిగా నాకిది ఎనిమిదో చిత్రం. కన్నడంలో విజయం అందుకున్న ఈ కథను తెలుగులో దర్శకత్వం వహించడం ఆనందంగా ఉంది' అన్నారు. 'ప్రతి అబ్బాయికి తండ్రే హీరో. ఆయన భుజాల మీద నుంచే ప్రపంచాన్ని చూస్తారు. ఇదొక తండ్రీకొడుకుల మధ్య నడిచే ఎమోషనల్ డ్రామా. సందేశంతో స్ఫూర్తివంతంగా ఉంటుంది' అని హీరో రాహుల్ విజయ్ చెప్పారు. రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ 'నా మనసుకు నచ్చిన కథ ఇది. కథాబలమున్న సినిమాను వినోదాత్మకంగా చెబితే అందరికి చేరువవుతుంది. ఈ సబ్జెక్ట్‌లో అలాంటి లక్షణాల ఉన్నాయి' అన్నారు. వినోదం, సందేశం మేళవించిన చిత్రమిదని నిర్మాత ఎల్.పద్మనాభ తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: గురుప్రశాంత్ రాజ్, సంగీతం: కుతుబ్ ఈ క్రిప, సంభాషణలు: సందీప్‌రాజ్, సమర్పణ: లక్ష్మణగౌడ.

తోలుబొమ్మల సిత్రాలు నిర్మాణంలో...

స్వాతి

స్వాతి మండల్ ప్రధాన పాత్రలో కొమారి జానకిరామ్‌ను దర్శకుడిగా పరిచయం చేస్తూ తోలు బొమ్మల సిత్రాలు పతాకంపై కొమారి జానయ్య నాయుడు నిర్మిస్తున్న చిత్రం ఒక పాట మినహా చిత్రీకరణ పూర్తిచేసుకుంది. ఈ సందర్భంగా చిత్రం విశేషాలను దర్శకుడు తెలియజేస్తూ 'కొత్త, పాత నటీనటులతో రూపొందుతున్న విభిన్న చిత్రమిది. హారర్ థ్రిల్లర్ నేపథ్యంలో కొనసాగే ఈ చిత్రంలో ప్రేక్షకులకు థ్రిల్‌తో పాటు చక్కటి సందేశం ఉంటుంది. త్వరలోనే బ్యాలెన్స్‌గా వున్న ప్రత్యేక గీతాన్ని చిత్రీకరిస్తాం' అని తెలిపారు. కొమరక్క, స్వప్న, వేదం నాగయ్య, పద్మారావు, ఆదినారాయణ, గోవింద్ రాజు తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: డి.యాదగిరి, సంగీతం: యు.వి.నిరంజన్.